అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

ఆదివారం 19-01-2025 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 11 సంచిక : 19 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు + వెబ్‌లో (సోపతి) వెల : 8.00





కేజ్రీవాల్ కారుపై దాడి



రాళ్లు రువ్వి..ఇటుకలు విసిరి అడ్డుకునే యత్నం

బీజేపీ గూండాల పనే : ఆప్

వివరాలు 13లో

సంజయ్ రాయ్ దోషి

ఆర్‌జి కర్ ఆస్పత్రి కేసులో వెలువడిన తీర్పు

20న శిక్ష విధిస్తానన్న న్యాయమూర్తి

కన్నీటిపర్యంతమైన బాధితురాలి తల్లిదండ్రులు

మిగిలిన వారి సంగతేంటి : బాధితురాలి తల్లి



వివరాలు 13లో

అపరిమిత నిఘా అధికారాలు

కీలక వ్యక్తిగత సమాచారం కూడా..!

ఆందోళన కలిగిస్తున్న ముసాయిదా నిబంధనలు

అమలు, పారదర్శకతపై సందేహాలు

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ఈ నెల 3న వ్యక్తిగత సమాచార రక్షణకు సంబంధించి విడుదల చేసిన ముసాయిదా నిబంధనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి అపరిమిత నిఘా అధికారాలు సంక్రమిస్తాయి. ఈ నిబంధనలను సమాచార రక్షణ కోసమే ఉద్దేశించినప్పటికీ అమలు, పారదర్శకత విషయంలో సందేహాలు తలెత్తుతున్నాయి. 2023లో ప్రభుత్వం డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ చట్టాన్ని తీసుకొచ్చింది. ఇందులోని సెక్షన్ 36 ప్రకారం ప్రభుత్వం వ్యక్తిగత సమాచారాన్ని కోరవచ్చు. ప్రభుత్వానికి సంక్రమించిన అధికారాలకు రూల్ 22 మరింత పదును పెట్టింది. దీని ప్రకారం వ్యక్తుల అనుమతి పొందకుండానే కంపెనీల నుండి కీలకమైన వ్యక్తిగత సమాచారాన్ని కోరే హక్కు కేంద్రానికి దఖలు పడుతుంది.

దేశ సార్వభౌమత్వం, సమగ్రత, భద్రతా ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం వ్యక్తిగత సమాచారాన్ని కోరవచ్చునని నిబంధనలు చెబుతున్నాయి. ఎలాంటి పరిమితులు లేకుండా, స్పష్టత లేకుండా ప్రభుత్వం ఏకపక్షంగా వ్యక్తుల సమాచారాన్ని తీసుకునేందుకు ఇవి వీలుకల్పిస్తాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించుకోవచ్చు. అందుకోసం ప్రభుత్వం నియమించిన అధికారులు ఎలాంటి అభ్యర్థనలు, లిఖిలపూర్వక విజ్ఞాపనలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం నియమించే ఏజెంట్లు తమ ఇష్టానుసారం వ్యక్తుల కీలక సమాచారాన్ని డిమాండ్ చేయవచ్చు. అయితే ఇది ప్రజలకు ఉన్న గోప్యత హక్కును హరిస్తుందని, అధికార దుర్వినియోగం జరిగే అవకాశం ఉన్నదని నిపుణులు అభిప్రాయపడ్డారు.

ఏదైనా సమాచారం దేశ భద్రత, సార్వభౌమత్వానికి భంగకరమని ప్రభుత్వం భావిస్తే దానిని ప్రభుత్వం బయటపెట్టాల్సిన అవసరం లేదని రూల్ 22 చెబుతోంది. ఏదైనా సమాచారాన్ని కోరాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉన్నదా లేదా అలా కోరడం చట్టబద్ధమేనా అని పరిశీలించే యంత్రాంగం ఏదీ ఉండదు. కాబట్టి ప్రభుత్వం ఏకపక్షంగానే నిర్ణయాలు తీసుకోవచ్చు. అవసరానికి మించిన సమాచారాన్ని సైతం ప్రభుత్వం సేకరించవచ్చు. ఇక్కడ గమనించాల్సిన విషయమేమంటే ప్రభుత్వం ఏదైనా సమాచారాన్ని కోరినప్పుడు దానిని సవాలు చేసేందుకు వ్యవస్థ అంటూ ఏదీ ఉండదు.

కొత్త ప్రాజెక్టులపై ఆసక్తి

సింగపూర్ వాణిజ్య శాఖమంత్రితో సీఎం రేవంత్ భేటీ

ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవంపై చర్చ

శాస్త్ర సాంకేతిక రంగాల్లో కలిసి పని చేసేందుకు అంగీకారం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రతినిధి బృందం ఆ దేశ వాణిజ్య, పర్యావరణ శాఖ మంత్రి గ్రేస్ ఫు హై యిన్‌తో శనివారం భేటీ అయ్యింది. రాష్ట్రంలో వివిధ రంగాల్లో సింగపూర్ ప్రభుత్వ భాగస్వామ్యంపై ఈ సందర్భంగా ఆ బృందం చర్చలు జరిపింది. నగరాలు, పట్టణాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, నీటి వనరుల నిర్వహణ, నైపుణ్యాల అభివృద్ధి, క్రీడలు, సెమీ కండక్టర్ల తయారీ, పర్యావరణం, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఉన్న అనుకూలతలను ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వారికి వివరించారు. తెలంగాణ ప్రభుత్వానికి సహకారం అందించేందుకు సింగపూర్ మంత్రి గ్రేస్ ఫు హైయిన్ సానుకూలంగా స్పందించారు. వివిధ రంగాల లక్ష్య సాధనలో భాగస్వామ్యం పంచుకోవాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవం ప్రాజెక్ట్, నీటి వనరుల నిర్వహణ, తెలంగాణ ఎంచుకున్న సుస్థిరవృద్ధి ప్రణాళికలపై ఆసక్తి ప్రదర్శించారు. పలు ప్రాజెక్టుల్లో పరస్పరం కలిసి పని చేసేందుకు అంగీకరించారు. ఉమ్మడిగా చేపట్టాల్సిన ప్రాజెక్టులు, వాటిపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేక బృందాలను గుర్తించాలని నిర్ణయించారు. వివిధ రంగాల్లో సింగపూర్ అనుభవాలను పంచుకోవాలనీ, దేశంలోనే వేగంగా వృద్ధి చెందుతున్న తెలంగాణలో సంయుక్తంగా చేపట్టే ప్రాజెక్టుల కార్యాచరణ వేగవంతం చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

రూ.3,500 కోట్లతో ఎస్‌టీటీ డేటా సెంటర్
మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో సింగపూర్ కంపెనీతో ఒప్పందం

రాష్ట్రంలో రూ.3,500 కోట్లతో డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు ప్రముఖ సింగపూర్‌కు చెందిన ప్రముఖ సంస్థ ఎస్‌టీటీ ముందుకొచ్చింది. ఆ దేశ పర్యటనలో ఉన్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో సమక్షంలో శనివారం రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. సింగపూర్‌లోని ఎస్‌టీటీ డాటా సెంటర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంవోయూపై ఎస్‌టీటీ సీఈవో బ్రూనో సంతకాలు చేశారు. ఇప్పటికే హైదరాబాద్ హైటెక్ సిటీలో ఓ డాటా సెంటర్ నిర్వహిస్తోన్న ఎస్‌టీటీ, ముచ్చర్ల మీర్‌ఖాన్‌పేట్‌లో మరో డాటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. తెలంగాణ ప్రభుత్వ ప్రగతిశీల విధానాలు, బలమైన మౌలిక సదుపాయాలు, అంకితభావం, సాంకేతిక ఆవిష్కరణ, సహకారం ఉమ్మడి లక్ష్యాన్ని సాధించేందుకు ఎంతగానో ...13లో

మతోన్మాద, కార్పొరేట్ శక్తులపై పోరు



స్వతంత్ర బలం పెంచుకోవడంపై నిర్ణయాలు

వామపక్షాల బలోపేతంపై కూడా చర్చ

వామపక్ష, ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయ విధానాన్ని కాపాడుతాం

అఖిల భారత మహాసభలో రాజకీయ ఎత్తుగడల పంథా : సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాశ్‌కరత్

వివరాలు 3లో



ఇన్ఫోసిస్‌కు షాక్

మూర్తి కుటుంబ సంపద రూ.1900 కోట్లు ఫట్

ఇన్ఫి షేర్ ఆరుశాతం పతనం..

వివరాలు 13లో


బ్యాంక్ అధికారుల వేధింపులకు రైతు బలి

బ్యాంక్‌లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య

కుటుంబీకుల ఆందోళన

న్యాయం చేయాలని డిమాండ్

బ్యాంకు వద్ద పోలీసుల భారీ బందోబస్తు



వివరాలు 13లో

అంతా అదానీ గ్రూపు కనుసన్నల్లోనే..

ప్రశ్నించేవారి ముందస్తు అరెస్టులు



పోలీస్ బలగాల మధ్య ప్రజాభిప్రాయ సేకరణ

ముగిసిన అంబుజా పబ్లిక్ హియరింగ్

సీపీఐ(ఎం) ప్రజాసంఘాల నాయకుల అరెస్ట్, విడుదల

నవతెలంగాణ-మిర్యాలగూడ

ప్రజల అభిప్రాయాల మేరకు కంపెనీని ఏర్పాటు చేయాలన్న నిబంధన ఉన్నప్పటికీ.. యాజమాన్యం ప్రభుత్వం, అధికారం, పోలీసుల మద్దతుతో ప్రజాభిప్రాయ సేకరణను తమకు అనుకూలంగా మార్చుకుంది. అంతేకాక తమకు అనుకూలంగా ...6లో

దళితులకు మొండిచెయ్యే!

అమలుకు నోచుకోని చేవెళ్ల డిక్లరేషన్

బీఆర్ఎస్ తోవలో కాంగ్రెస్ ప్రభుత్వం

మాయ మాటలతో కాలయాపన

పథకాల పట్ల స్పష్టత నిల్

స్వయం ఉపాధి ఊసెత్తని వైనం

దాడులు, దౌర్జన్యాలు నిత్యకృత్యం

నికరంగా పోరాడుతున్న కేవీపీఎస్

దాని ఫలితమే సబ్‌ప్లాన్ చట్టం





నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ముందు దగా, వెనుక దగా, కుడిఎడమల దగా దగా అన్నట్టు దళితుల పట్ల పాలకుల మోసం సాగుతూనే ఉంది. వారు వంచనకు గురవుతూనే ఉన్నారు. సంక్షేమ పథకాల పేరుతో మాయ. వాటి అమలులో నిర్లక్ష్యం. దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల భూమి, దళిత బంధు, తదితర పథకాల పేర గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులను మోసం చేసింది. మరో పక్క దాడులు, దౌర్జన్యాలు నిత్యకృత్యమయ్యాయి. అతనికంటే ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్టు కాంగ్రెస్ సర్కార్ కూడా అదే తోవలో పయనిస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల డిక్లరేషన్ ప్రకటించి దాని అమలు పట్ల రేవంత్ సర్కారు మీన మేషాలు లెక్కిస్తున్నదని దళిత సంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. కుల వివక్ష, దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, గ్రామ బహిష్కరణలు నిత్యకృత్యంగా సాగుతున్నాయి. వీటికి వ్యతిరేకంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నది. పోరాటాల ఫలితంగా కొన్ని విజయాలను కూడా సాధించింది.

పోరాటాల ఫలితమే సబ్ ప్లాన్ చట్టం..

రాష్ట్ర జనాభాలో 15.45 శాతం ఎస్సీలున్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ...3లో

రాజ్యాంగ రక్షణకు ఉద్యమాలు
- జాన్ వెస్లీ (కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు)



బీజేపీ ఏలుబడిలో రాజ్యాంగానికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. దాన్ని రక్షించుకోవాల్సిన అవశ్యకత ప్రజాస్వామిక, లౌకిక, ప్రజాతంత్ర శక్తులతోపాటు దళితులపై కూడా ఉందనే విషయాన్ని గుర్తించాలి. ప్రజల్ని చీలకలు, పేలికలు చేసి పాలించటం దాని నైజం. అందుకు ఊతమిచ్చేలా దళిత ఉద్యమాలు ఉండకూడదు. ఈ పెనుప్రమాదాన్ని గమనించటం అవసరం. హిందూ మతం ముసుగులో మనువాదాన్ని అమలు చేసే తీరును పసిగట్టి ఎండగట్టాలి. ప్రభుత్వ ...3లో

ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలి

- ఉద్యోగ సంఘాలతో మంత్రివర్గ ఉపసంఘం సమావేశం కావాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టికి టీఎన్జీవో వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగుల పెండింగ్ సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలని టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు మంత్రివర్గ ఉపసంఘం సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేసి ఉద్యోగ సంఘాల నేతలతో పూర్తిస్థాయిలో చర్చించాలని కోరింది. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలన్నింటిని కూడా ప్రాధాన్యతా క్రమంలో వెంటనే పరిష్కరించాలని సూచించింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను టీఎన్జీవో కేంద్ర సంఘ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం హుస్సేనీ ముజీబ్ నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగ సంఘాల నాయకులతో భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఉద్యోగుల పెండింగ్ బిల్లులను ఒక్కొక్కటిగా మంజూరు చేస్తున్నామని చెప్పారు. పెండింగ్ సమస్యలను ఫిబ్రవరి మొదటి వారంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశాన్ని



ఏర్పాటు చేసుకుని పరిష్కరిస్తామని అన్నారు. ఉద్యోగులు ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, నగర శాఖ అధ్యక్షులు కట్యూరి శ్రీకాంత్, కార్యదర్శి పంతులు హరికృష్ణ, తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడ్డం జ్ఞానేశ్వర్, ఖాదర్, మార్కెటింగ్ ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి ముక్రం, ఇరిగేషన్ ఫోరం రాష్ట్ర కోశాధికారి పి శ్రీనివాస్, ఏపీ నుంచి తెలంగాణకు కేటాయించబడ్డ ఉద్యోగులు మహేందర్, ఖాజా, వహీద్, నర్సింగరావు, రాజు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల వేతనాలపై మాట్లాడే అర్హత హరీశ్‌రావుకు లేదు : మంత్రి సీతక్క

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పంచాయతీ కార్మికుల వేతనాలపై మాట్లాడే నైతిక అర్హత మాజీ మంత్రి హరీశ్‌రావుకు లేదని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) పేర్కొన్నారు. ఇకపై 92 వేల మంది పంచాయతీ స్థాయి సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగులకు తరహాలోనే జీతాలు అందిస్తామని మరోమారు పురుద్ఘాటించారు. అవాస్తవాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను మానుకోవాలి హరీశ్‌రావుకు సూచించారు. శనివారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో నెలల తరబడి జీతాలు అందక పంచాయతీ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. 13 మార్చి 2023న కలెక్టరేట్ల ముందు జీపీ కార్మికులు వంటా వార్పు చేపట్టి నిరసన తెలిపిన వార్తా కథనాలను మరిచారా? అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు జీతాలియ్యకుండా అవస్థలకు గురి చేసి ఇప్పుడు మొసలి కన్నీరు కార్చడమేంటని నిలదీశారు. పంచాయతీ కార్మికులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల వంటి వేల మంది చిరు ఉద్యోగులను బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం గుర్తించలేదని విమర్శించారు. గ్రామ స్థాయిలో చిరుద్యోగులకు సైతం ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ప్రతి నెలా సకాలంలో జీతాలు చెల్లించే విధానాన్ని రూపొందించి తమ ప్రజా ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నదని తెలిపారు.

బీసీ కులాల పేర్ల మార్పు, పర్యాయ పదాల చేర్పునకు..

- ముగిసిన అభ్యంతరాల గడువు : బీసీ కమిషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీ కులాల పేర్ల మార్పు, పర్యాయ పదాల చేర్పునకు శనివారంతో అభ్యంతరాల గడువు ముగిసినట్టు రాష్ట్ర బీసీ కమిషన్ తెలిపింది. ఈ మేరకు కమిషన్ చైర్మెన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 15 రోజుల్లో ఆయా కుల సంఘాల ప్రతినిధులు అభ్యంతరాలు, విజ్ఞప్తులను, అఫిడవిట్ రూపంలో 500కుపైగా సమర్పించినట్టు తెలిపారు. వీటిని పరిశీలించి భవిష్యత్తులో ఆయా కులాలకు సంబంధించిన వారు ఎలాంటి న్యూనతా భావానికి గురి కాకుండా ఉండేలా కమిషన్ ఒక నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. కుల సంఘాలతో జరిగిన ఈ చర్చల్లో బీసీ కమిషన్ చైర్మెన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు తదితరులు పాల్గొన్నారు. "బూంజువ" కులం విషయంలో జిల్లాల పరిమితులను ఎత్తివేయాలనీ, గొర్రెలు, మేకలు పెంపకం కుల వృత్తిగా గల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని "ధన్గర్" అనే కులం వారిని బీసీ జాబితాలో చేర్చాలని ఆయా కులాల వారు కోరినట్టు చెప్పారు.

ఓర్వలేకే కాంగ్రెస్‌పై విమర్శలు

- అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు :శాసనమండలిలో చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేకే విమర్శలు చేస్తున్నారని శాసనమండలిలో చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కల్వ సుజాతతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 26 తర్వాత మిగతా హామీలను నెరవేరుస్తామని భరోసా ఇచ్చారు. జానమ్మ రుణమాఫీకి అర్హురాలు కాదనీ, కొడుకుల పేరిట భూమి ఉందని అన్నారు. వారికి రుణమాఫీ అయిందనీ, అన్ని జిల్లాల్లో సమీక్షా సమావేశాలు నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేస్తున్నారని తెలిపారు.

వామపక్ష, ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయ విధానాన్ని కాపాడుతాం

అఖిల భారత మహాసభలో రాజకీయ ఎత్తుగడల పంథా: సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాశ్‌కరత్

మతోన్మాద, కార్పొరేట్ శక్తులపై పోరు

స్వతంత్ర బలం పెంచుకోవడంపై నిర్ణయాలు

వామపక్షాల బలోపేతంపై కూడా చర్చ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని మతోన్మాద, కార్పొరేట్ శక్తులపై పోరాడుతామని సీపీఐ(ఎం) సమన్వయకర్త ప్రకాశ్‌కరత్ అన్నారు. పార్టీ 24వ అఖిల భారత మహాసభలో రాజకీయ ఎత్తుగడ పంథాను నిర్ణయిస్తామని తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కత్తాలో జరుగుతున్న సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశాల సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 24వ సీపీఐ(ఎం) అఖిలభారత మహాసభ తమిళనాడులోని మధురైలో ఏప్రిల్ 2 నుంచి 6 వరకు జరగనుందని, ఇప్పటికే ఆయా రాష్ట్రాల్లో మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. దేశంలో ప్రస్తుతం హిందూత్వ, కార్పొరేట్ శక్తుల ప్రతినిధిగా మోడీ సర్కార్ ఉందని అన్నారు. గత పదేండ్లుగా దేశంలో అధికారాన్ని, స్వతంత్ర సంస్థలను ఉపయోగించి తన ఎజెండాను అమలు చేస్తోందని విమర్శించారు. ఆ ఎజెండాలో రెండే అంశాలు ఉన్నాయని, ఒకటి హిందూ రాష్ట్ర నిర్మాణానికి హిందూత్వాన్ని ముందుకు తీసుకురావడం, రెండు కార్పొరేట్ అనుకూల నయా ఉదారవాద విధానాలను అమలు చేయడం అని పేర్కొన్నారు. హిందూత్వ, కార్పొరేట్ బంధంతో మిళితమైన మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా ఎలా ఉద్యమించాలనే దానిపై పార్టీ అఖిల భారత మహాసభ ప్రధానంగా దృష్టి పెడుతుందని పేర్కొన్నారు. హిందూ మతోన్మాద శక్తులకు, నయా ఉదార వాద విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తామని అన్నారు. ఈ రెండూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని, కనుక ఈ రెండింటికీ వ్యతిరేకంగా ఒకేసారి ఉద్యమించాల్సి ఉందని తెలిపారు. దీంతో పాటు సీపీఐ(ఎం) స్వతంత్ర బలం పెంచుకోవడంపై కూడా పార్టీ మహాసభ నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. సీపీఐ(ఎం) బలంగా లేకపోతే, హిందూ మతోన్మాద, కార్పొరేట్ శక్తులపై పోరాటం విజయవంతం కాదని పేర్కొన్నారు. అలాగే వామపక్షాల బలోపేతంపై కూడా మహాసభలో చర్చిస్తామన్నారు. కార్మిక వర్గ పోరాటం, వివిధ వర్గాల ప్రజల ఉద్యమాలపై, అలాగే ఆర్‌ఎస్‌ఎస్, హిందూత్వానికి వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటంపై కూడా చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిపారు.

వామపక్ష, ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయాన్ని కాపాడుతాం

ప్రపంచంలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయని, వాటిపై కూడా పార్టీ మహాసభ చర్చిస్తుందని అన్నారు. అమెరికాలో ట్రంప్ వచ్చిన తరువాత సామ్రాజ్యవాదం విధానం మరింత పునరుద్ధరించబడిందని విమర్శించారు. ప్రపంచంలో పురోగతి సాధిస్తోన్న చైనా, అమెరికాకు సవాల్‌గా మారిందని, దీంతో చైనాను అమెరికా టార్గెట్ చేస్తోందని తెలిపారు.

పాలస్తీనా, గాజాపై దాడులు చేస్తోన్న ఇజ్రాయిల్‌కు అమెరికా సామ్రాజ్యవాదం ఎలా మద్దతుగా నిలుస్తోందో అందరికీ తెలుసని అన్నారు. రష్యాకు వ్యతిరేకంగా యుద్ధం చేస్తోన్న ఉక్రెయిన్‌కు అమెరికా సహాయం చేస్తోందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ మితవాద శక్తులకు వ్యతిరేకంగా బలమైన వామపక్ష ప్రత్యామ్నాయ విధానం ఐక్యంగా ముందుకు సాగుతోందని అన్నారు. అలాగే దేశంలో కూడా మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా వామపక్షాలు ఐక్యమై బలోపేతంతో ముందుకు సాగుతాయని తెలిపారు. దేశంలో వామపక్ష, ప్రజాస్వామ్య ప్రత్యామ్నాయాన్ని కాపాడుతామన్నారు. ఇదే 24వ పార్టీ అఖిల భారత మహాసభ ప్రధాన ఎజెండా అని ప్రకాశ్‌కరత్ తెలిపారు.

దళితులకు మొండిచెయ్యే!

(మొదటి పేజీ తరువాయి)

అట్టడుగుననున్నారు. వీరి అభివృద్ధి కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో నాలుగు శాతం నిధులను మాత్రమే కేటాయించేది. ఆ నిధులను కూడా దళితుల అభ్యున్నతికి ఖర్చు పెట్టేది కాదు. దీంతో వారి అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉండేది. ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం), కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘంతో పాటు మేధావులు, ఇతర సంఘాలు ఐక్య వేదికగా ఏర్పడి సబ్ ప్లాన్ చట్టం కోసం నిర్విరామ పోరాటాలు చేశాయి. ఉమ్మడి రాష్ట్రంలోనే బీవీ రాఘవులు, జాన్‌వెస్లీ, మిడియం బాబూరావు తదితరులు ఆందోళనలకు, నిరవధిక దీక్షలకు పూనుకున్నారు. ఈ పోరాటాల ఉధృతికి తలవంచిన నాటి కాంగ్రెస్ ప్రభుత్వం.. సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసు కొచ్చింది. ఆ చట్టం ద్వారా బడ్జెట్‌లో షెడ్యూల్ కులాలకు ప్రత్యేక నిధులు కేటాయించి వారి అభివృద్ధి కోసం ఖర్చు చేసే వ్యవస్థ ఉమ్మడి రాష్ట్రంలోనే ఏర్పాటైంది. ఎస్సీ అభివృద్ధికి కేటాయించిన నిధులు సుమారు 54 శాఖల ద్వారా ఖర్చు చేసే యంత్రాంగం ఉండేది. ఈ ఏడాది ఖర్చు చేయని నిధులను మరుసటి సంవత్సరం ఖర్చు చేసే విధంగా క్యారీ ఫార్వడ్ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా నాటి ప్రభుత్వం ప్రకటించింది. గొప్ప పోరాటం ఫలితంగా సాధించిన విజయమిది. అయితే కేసీఆర్ ప్రభుత్వం దళితుల అభివృద్ధికి పాటుపడుతున్నట్టు గొప్పలు చెప్పుకుందేగానీ, ఆచరణలో వారికోసం కేటాయించిన నిధులను ఖర్చు చేయకుండా చట్ట విరుద్ధంగా దారి మళ్లించింది. 2014 నుంచి 2022-24 (సెప్టెంబర్ 30 వరకు) మధ్యకాలంలో ఎస్సీల అభివృద్ధి నిధి కింద 55శాతం మాత్రమే ఖర్చు చేసింది. సుమారు రూ.63,182,10 కోట్లు దారి మళ్లాయి. ఇక ప్రస్తుత సైతం ఏడాది పాలన పూర్తి చేసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం సబ్‌ప్లాన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తామంటూనే 10శాతం నిధులను కేటాయిస్తా మంటూ సన్నాయి నొక్కులు నొక్కుతోంది. జనాభా ప్రాతిపదికన కేటాయించాల్సిన నిధులను తగ్గించాలని యత్నించడం తగదని దళిత సంఘాలు హెచ్చరిస్తూనే ఉన్నాయి.

పెరుగుతున్న దాడులు..

రాష్ట్రంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు, కుల దురహంకార హత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవటంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నది. ఇటీవల కాలంలోనే నల్లగొండ జిల్లా గుంటుపల్లి అన్నారానికి చెందిన దళిత యువకుడిపై కుల దురహంకార హత్య జరిగింది. ఇబ్రహీంపట్నం మండలం రాయప్రోలు గ్రామానికి చెందిన కానిస్టేబుల్ నాగమణి కులాంతర వివాహం చేసుకుందని కుటుంబ సభ్యులే అత్యంత దారుణంగా హత్య చేశారు.అంతకు ముందు పెరుమాళ్ల ప్రణయ్, మంథని మధుకర్ ఇలా అనేక మంది కుల దరహంకార హత్యలకు గురయ్యారు. వీటికి వ్యతిరేకంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నికరంగా పోరాడింది. ఐక్య పోరాటాల్లో ముందు భాగాన నిలబడింది.పోరాటాల ఫలితంగానే దోషులపై చట్టబద్ధ చర్యలు తీసుకున్నారు. మరో పక్క వీడీసీల పేరుతో నిజామాబాద్ జిల్లాలో దళితులు ఇప్పటికీ గ్రామ బహిష్కరణలకు గురవుతూనే ఉన్నారు.

పోరాటాలతోనే దళితులకు న్యాయం

అధికారంలోకి ఎవరొచ్చినా దళితులకు జరుగుతోంది అన్యాయమే. హామీలను అమలు చేయటంలో ఎగనామం పెడుతున్నారు. ఆ మోసాలకు వ్యతిరేకంగా కేవీపీఎస్ నికరంగా పోరాడుతున్నది. అనేక సందర్భాల్లో విజయాలు కూడా సాధించింది. దళితుల చైతన్యానికి పూలే అంబేద్కర్‌ల జనజాతరలు నిర్వహిస్తూనే..కుల దురహంకార హత్యలు, దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడింది. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కొట్లాడింది.దళిత వాడలకు జీవో 342 ప్రకారం 101 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇవ్వాలని ఉద్యమాలు నిర్వహించింది. గురుకులాల్లో విద్యార్థులకు పౌష్టికాహారం, ఇతర సౌకర్యాలకోసం పోరాటాలు నిర్వహించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్యం కోసం ఉద్యమాలు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన చేవెళ్ల డిక్లరేషన్‌లోని వాగ్దానాలను అమలు చేయాలని ఉద్యమాలు నిర్వహించింది.

-టి స్కైలాబ్‌బాబు

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

జీవం లేని ఎస్సీ కార్పొరేషన్

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ లోన్లు, స్వయం ఉపాధి పథకాలు అమలు జరిగేవి. ఇది ఒక నాటి మాట. కానీ..గత పదేండ్ల కాలంలో ఆ కార్పొరేషన్ జీవచ్ఛవంలా పడి ఉంది. అరకొర సిబ్బందితో దాని ద్వారా జరగాల్సిన కార్యక్రమాలకు పాలకులు బ్రేకులు వేశారు. వ్యూహాత్మకంగానే గత ప్రభుత్వం దీన్ని నిర్వీర్యం చేసి, దళిత బంధుకు హైప్ క్రియేట్ చేసింది. ఇది కూడా తమ అనుయాయులకు మాత్రమే ఉపయోగపడింది. అవినీతికి అడ్డాగా మారింది. పారదర్శకత లోపించింది. అర్హులకు అందకుండా పోయింది.

రాజ్యాంగ రక్షణకు ఉద్యమాలు

(మొదటి పేజీ తరువాయి)

రంగ సంస్థల ప్రయివేటీకరణతో ప్రశ్నార్థకమవుతున్న రిజర్వేషన్లను రక్షించుకోవాలి. ఒకే దేశం- ఒకే పన్ను, ఒకే దేశం-ఒకే ఎన్నిక అంటున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఒకే దేశం-ఒకే కులం అని ఎందుకనడం లేదో చెప్పాలంటూ మనువాదులను ప్రశ్నిద్దాం. రాబోయే కాలంలో ఐక్య ఉద్యమాలకు శ్రీకారం చుడదాం.

- జాన్ వెస్లీ (కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు)

ట్రంప్ ప్రమాణం రేపే

40ఏండ్లలో తొలిసారిగా క్యాపిటల్ లోపల కార్యక్రమం

వాషింగ్టన్ : అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ (78) 20వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్నారు. లాంఛనంగా ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగిన అనంతరం సంగీత ప్రదర్శనలు, పరేడ్‌తో సహా పలు కార్యక్రమాలు జరగనున్నాయి. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12గంటలకు ప్రమాణ స్వీకారం జరుగుతుంది. ట్రంప్‌చే చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్ ప్రమాణం చేయిస్తారు. దీంతో ట్రంప్ రెండో పదవీ కాలం ఆరంభమవుతుంది. అయితే సోమవారం ఉష్ణోగ్రతలు మరింత కనిష్టానికి అంటే మైనస్ 7డిగ్రీలకు పడిపోయే అవకాశముందని వాతావరణ హెచ్చరికలు వెలువడడంతో సాంప్రదాయంగా ఆరుబయట జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని కేపిటల్ రోటుండా లోపల నిర్వహించనున్నారు. ఇలా వేదిక మారి లోపల కార్యక్రమం నిర్వహించడమనేది 40ఏళ్ళలో మొదటిసారి. చివరి సారిగా 1985లో ఇక్కడ అప్పటి అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన కూడా అప్పుడు రెండోసారి ఎన్నికయ్యారు. వాతావరణం అనుకూలించనుందునే అప్పుడు కూడా లోపల నిర్వహించారు. అధ్యక్షుడు జో బైడెన్, కాంగ్రెస్ సభ్యులు, ఇతర ప్రముఖులు, ఆహుతులు, అతిథులు కేపిటల్ లోపల కూర్చుని చూసేందుకు వీలుగా వేదిక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ఉదయం అర్లింగ్టన్ నేషనల్ సిమెట్రీలో అజ్ఞాత సైనికుని సమాధి వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళి అర్పించడంతో ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ఆరంభమవుతాయి. తర్వాత విక్టరీ ర్యాలీ జరగనుంది. కాగా ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆనాడు కేపిటల్‌పై దాడి చేసిన నిందితులు కూడా హాజరు కానున్నారు. కోర్టు అనుమతినివ్వడంతో వారు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

డిగ్రీలు కాదు..నైపుణ్యాలే ఆధారం

- నియామకాలపై 30 శాతం భారతీయ సంస్థల తీరు
- డబ్ల్యూఈఎఫ్ నివేదిక

న్యూఢిల్లీ : భారత్‌లోని పలు సంస్థలు, కంపెనీల ఉద్యోగ నియామకాల్లో అనుసరించే తీరు మారుతున్నదా? డిగ్రీల కంటే నైపుణ్యాలకే ప్రాధాన్యతనిస్తున్నాయా? అంటే అవుననే సమాధానం వినబడుతున్నది. 30 శాతం భారతీయ సంస్థలు.. డిగ్రీలు కాకుండా.. నైపుణ్యాధారిత నియామక పద్ధ తులను అవలంభించాలని చూస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 19 శాతం కంపెనీలు ఈ దారిలో ఉన్నాయి. దీనితో పోలిస్తే భారత్‌లో ఈ సంఖ్య అధికంగా ఉండటం గమనార్హం. వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) తన జాబ్స్ రిపోర్ట్ 2025లో ఈ విషయాన్ని పేర్కొన్నది. డిజిటల్ యాక్సెస్ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాతావరణ ఉపశమన ప్రయత్నాలు.. 2030 నాటికి భారత ఉద్యోగ మార్కెట్ భవిష్యత్తును రూపొందించే ప్రాథమిక ధోరణులని డబ్ల్యూఈఎఫ్ వివరించింది. భారత్‌లో పని చేస్తున్న కంపెనీలు ఏఐ, రోబోటిక్స్, అటానమస్ సిస్టమ్స్ అండ్ ఎనర్జీ టెక్నాలజీస్ వంటి అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలలో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయని పేర్కొన్నది. భారత్‌లోని దాదాపు 35 శాతం కంపెనీలు తమ కార్యకలాపాలను మార్చుకోవటానికి సెమీ కండక్టర్లు, కంప్యూటింగ్ టెక్నాలజీని ఆశిస్తున్నాయని నివేదిక వివరించింది. క్వాంటం, ఎన్‌క్రిప్షన్ టెక్నాలజీలు కూడా ఇలాంటి ప్రభావాన్ని చూపుతాయని దాదాపు 21 శాతం కంపెనీలు అంచనా వేస్తున్నాయని డబ్ల్యూఈఎఫ్ హైలెట్ చేసింది. ఈ మార్పులు బిగ్ డేటా స్పెషలిస్ట్‌లు, ఏఐ, మెషిన్ లెర్నింగ్ స్పెషలిస్ట్‌లు, సెక్యూరిటీ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్‌ల వంటి పాత్రలక అధిక డిమాండ్‌ను సృష్టిస్తాయని తన నివేదికలో పేర్కొన్నది. భారత్‌లో పని చేస్తున్న కంపెనీలు విభిన్న ప్రతిభ గల సమూహాలను ఉపయోగించుకోవాలని యోచిస్తున్నాయనీ, 67 శాతం ఈ వ్యూహాన్ని నొక్కి చెప్తున్నాయి. ప్రపపంచ వ్యాప్తంగా 47 శాతంగా ఉన్నదని నివేదిక పేర్కొన్నది. 2025- 2030లో యూరప్‌లో కార్మిక మార్కెట్ పరివర్తనను ప్రభావితం చేసే కీలక ధోరణులైన డిజిటలైజేషన్, వాతావరణ మార్పు, జీవన వ్యయం పెరుగుతాయని వివరించింది. యూరప్‌లోని వ్యాపారలకు కార్మిక మార్కెట్లో ప్రతిభ కొరత, నైపుణ్య అంతరాలు ఒక ప్రధాన సవాల్‌గా ఉన్నదని కూడా డబ్ల్యూఈఎఫ్ స్పష్టం చేసింది. ఈ ప్రాంతంలోని దాదాపు 54 శాతం కంపెనీలు, సంస్థలు.. ప్రతిభ లభ్యత విషయంలో ఆందోళనను వ్యక్తం చేస్తున్నాయి.

దేనికైనా రెడీ

- మా నుంచి బలమైన స్పందన తప్పదు
- 'ట్రంప్ టారిఫ్ ట్యాక్స్'పై తీవ్రంగా స్పందించిన కెనడా
- అమెరికాకు స్ట్రాంగ్ వార్నింగ్
- రెండు దేశాల మధ్య ముదురుతున్న వాణిజ్య యుద్ధం



కెనడా : అమెరికా, కెనడాల మధ్య వాణిజ్య యుద్ధం ముదురుతున్నది. అమెరికా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ ట్యాక్స్ హెచ్చరికలపై కెనడా తీవ్రంగా స్పందించింది. యూఎస్ టారిఫ్‌లు పెంచితే.. అమెరికన్లకు కూడా ట్రంప్ పన్నుల దెబ్బలు తప్పవని హెచ్చరించింది. ఈ మేరకు కెనడా విదేశాంగ మంత్రి మెలానీ జోలీ స్పందించారు. కెనడా దిగుమతులపై 25 శాతం సుంకాలు విధించాలనే తన ప్రణాళికను ట్రంప్ అనుసరిస్తే, కెనడియన్లు అమెరికాపై 'ట్రంప్ సుంకాలు' విధించవచ్చని అన్నారు. ట్రంప్ తన హెచ్చరికలను అమలు చేస్తే, ఆ తర్వాత జరిగే పరిణామాలను ఎదుర్కొనేందుకు కెనడా సిద్ధంగా ఉన్నదని చెప్పారు. వాణిజ్య యుద్ధం జరిగితే కెనడా నుంచి బలమైన ప్రతిస్పందన ఉంటుందని స్పష్టం చేశారు.

ఇది దశాబ్దాలలో కెనడా, యూఎస్ మధ్య జరిగే అతిపెద్ద వాణిజ్య యుద్ధం అవుతుందని ఆమె అన్నారు. మెలానీ జోలీ.. ఇటీవలే అమెరికాలో పర్యటించారు. వాణిజ్యం, సరిహద్దు భద్రతతో సహా పలు కీలక అంశాలపై ఆమె అమెరికాతో చర్చించారు. అమెరికా పర్యటన తర్వాతే ఆమె ట్రంప్ సర్కారుకు హెచ్చరికలు పంపటం గమనార్హం. మరో రెండ్రోజుల్లో అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇలాంటి తరుణంలో ఈ రెండు పొరుగు దేశాల పరిస్థితులు మరింతగా ముదరటం చర్చనీయాంశంగా మారింది. కెనడా, మెక్సికోలపై 25 శాతం సుంకాలు విధించనున్నట్టు ట్రంప్ ఇటీవలే వెల్లడించిన విషయం విదితమే. అంతేకాకుండా, కెనడా సార్వభౌమత్వాన్ని కూడా అవమానించేలా వ్యాఖ్యలు కూడా చేశారు. వలసలు, డ్రగ్స్, అక్రమ రవాణాను కట్టడి చేయకపోతే అమెరికాలో కెనడా 51వ రాష్ట్రంగా చేరాలంటూ అప్పటి కెనడా అధినేత జస్టిన్ ట్రూడోను ట్రంప్ హెచ్చరించిన విషయం విదితమే.

ప్రతీకార చర్యలకు సిద్ధమవుతున్న కెనడా?

అమెరికా-కెనడాల మధ్య వాణిజ్య యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉన్నదని కొందరు నిపుణులు అంచనా వేస్తున్నారు. ట్రంప్ సుంకాల ప్రణాళికలు అమలైతే.. వివిధ యూఎస్ వస్తువులపై అధిక సుంకాలను విధించటానికి కెనడా సిద్ధంగా ఉన్నదని యూరోపియన్ వార్తా సంస్థ అయిన ఏఎఫ్‌పీ నివేదిక ఒకటి పేర్కొన్నది.

గెలిచేదెలా?

ఢిల్లీలో సీఎం పీఠం కోసం బీజేపీ విశ్వ ప్రయత్నాలు

- 1993లో తొలి అసెంబ్లీ ఎన్నికల్లో విజయం.. ముఖ్యమంత్రి కుర్చీ కైవసం
- అదే మొదటి, చివరిసారి

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్నాయి. ఆప్, కాంగ్రెస్, బీజేపీ సహా పలు పార్టీలు తమ ప్రచారాలను కొనసాగిస్తున్నాయి. ఢిల్లీ పీఠాన్ని దక్కించుకోవటమే లక్ష్యంగా ఆరోపణలు, ప్రత్యారోపణలు, ప్రచారాలు, హామీలు, మ్యానిఫెస్టోలు, సభలు, సమావేశాలతో ముందుకెళ్తున్నాయి. ఢిల్లీలో హ్యాట్రిక్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఆప్.. మరొకసారి పాలనా పగ్గాలు చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. కాంగ్రెస్, బీజేపీలు కూడా ఎన్నికల్లో విజయం సాధించి, అధికారాన్ని దక్కించు కునేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి. ముఖ్యంగా, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. ఢిల్లీ పీఠంపై కన్నేసింది. కేంద్రంలో అధికారం, ఢిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్జీ) కార్యాలయం, ఢిల్లీ శాంతి భద్రతలు వంటి అంశాలను వాడుకొని ఎలాగైనా అధికారంలోకి రావాలని చూస్తున్నది.

బీజేపీకి అదే ఫస్ట్ అండ్ లాస్ట్

కొన్ని సీట్లలో విజయం కమలం పార్టీకి ఇప్పటికీ అందని ద్రాక్షే



న్యూఢిల్లీ : ఢిల్లీలో 1993లో తొలిసారిగా అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించింది. ముఖ్య మంత్రి పీఠాన్ని దక్కించుకొని, ఇక్కడ ఐదేండ్ల పాటు ప్రభు త్వాన్ని నడిపింది. ఆ సమ యంలో ముగ్గురిని ముఖ్య మంత్రులుగా మార్చింది. ఢిల్లీలో.. ముఖ్య మంత్రి పీఠాన్ని చేజిక్కించు కోవటం బీజేపీకి అదే మొదటి, చివరిసారి. ఆ తర్వాత 2013 అసెంబ్లీ ఎన్నికల్లో మిగతా పార్టీల కంటే అత్యధికంగా 31 స్థానాలు దక్కించుకున్నా.. అప్పటి రాజకీయ సమీకరణాలలో భాగంగా అవినీతి అంతమే లక్ష్యంగా రాజకీయాల్లో కొత్తగా అడుగుపెట్టిన ఆప్‌నకు సీఎం పీఠం దక్కింది. ముఖ్యమంత్రిగా అరవింద్ కేజ్రీవాల్ తొలిసారి బాధ్యతలు తీసుకున్నారు. అయితే, విస్పష్ట మెజారిటీ కావాలంటూ.. కేజ్రీవాల్ సీఎం కుర్చీకి రాజీనామా చేసి, మళ్లీ ఎన్నికలకు వెళ్లారు. దీంతో 2015లో జరిగిన ఎన్నికల్లో ఆప్.. భారీ విజయాన్ని సొంతం చేసు కున్నది. 70 అసెంబ్లీ సీట్లకు గానూ.. ఆప్ 67 సీట్లను కైవసం చేసుకోగా.. బీజేపీకి మాత్రం మూడు సీట్లే దక్కాయి. 2020 అసెంబ్లీ ఎన్నికల్లోనూ 62 సీట్లతో కేజ్రీవాల్ ముఖ్య మంత్రి పీఠాన్ని నిలుపుకున్నారు. కాషా యపార్టీ 8 స్థానాలను దక్కించుకున్నది.

ఆ స్థానాల్లో విజయం సాధించలేని కమలం పార్టీ

ఢిల్లీ అసెంబ్లీకి 1993 నుంచి 2020 వరకు.. మొత్తం ఏడుసార్లు ఎన్నికలు జరిగాయి. ఇందులో ఆప్, కాంగ్రెస్‌లు మూడుసార్ల చొప్పున సీఎం పీఠాన్ని దక్కించుకున్నాయి. బీజేపీ మాత్రం ఒక్కసారి మాత్రమే ముఖ్యమంత్రి కుర్చీని దక్కించుకున్నది.

ఢిల్లీ ప్రజలు బీజేపీని దూరం పెట్టి దాదాపు రెండు దశాబ్దాలకు పైనే కావస్తున్నది. ఢిల్లీలో జరిగే ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ కొన్ని సీట్లు మాత్రం బీజేపీకి దక్కటంలేవు. 1993 నుంచి 9 సీట్లు, 2008 నుంచి 12 స్థానాలను ఆ పార్టీ దక్కించుకోవటంలో విఫలమవుతున్నది.

ఈ 12 సీట్లలో మాటియా మహల్, బల్లిమారన్, అంబేద్కర్ నగర్, సీలంపూర్, ఓఖ్లా, సుల్తాన్‌పూర్ మజ్రా, మంగోళ్‌పురి, జంగ్‌పురా, డియోలిలు ఉన్నాయి. సుల్తాన్‌పూర్ మాజ్రా, అంబేద్కర్ నగర్, డియోలి, మంగోల్‌పురి, కోండ్లి లు ఎస్సీ రిజర్వ్ స్థానాలు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌పై కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపటంతో.. ఇక్కడి రిజర్వ్‌స్థానాల్లో విజయంపై ఢిల్లీ బీజేపీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను ఆప్, కాంగ్రెస్‌లు ఎన్నికల ప్రచారాల్లో ఆయుధంగా మలుచు కుంటున్నాయి. దీంతో ఢిల్లీలోని ఇతర ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లలోనూ కాషాయపార్టీకి తీవ్ర నష్టం కలగక మానదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ఇక మిగిలిన ఏడు నియోజవర్గాలలో ముస్లిం జనాభా గణనీయమైన సంఖ్యలో ఉన్నది. హిందూత్వ సిద్ధాంతంతో వెళ్లే బీజేపీకి ఈ స్థానాలు కూడా గెలవటం చాలా కష్టమని చెప్తున్నారు.

"పార్టీ 30కి పైగా అసెంబ్లీ స్థానాల్లో దూకుడుగా ప్రచారం నిర్వహిస్తున్నది. వాటిలో 12 రిజర్వ్ సీట్లు ఉన్నాయి. ఇందులో కొన్నింటిని బీజేపీ ఎప్పుడూ గెలవలేదు" అని ఢిల్లీ బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మోహన్‌లాల్ గిహారా అన్నారు. 2008లో ఉనికిలోకి వచ్చిన న్యూఢిల్లీ స్థానాన్నైతే బీజేపీ ఇప్పటికీ దక్కించుకోలేదు.

మురికివాడల్లో నివసించేవారి ఓట్లే కీలకం



ఢిల్లీలోని మురికివాడల్లో నివసించేవారి ఓట్లు ఈ ఎన్నికల్లో కీలకంగా మారాయి. వీరి సంఖ్య దాదాపు 20 లక్షలు ఉంటుందని అంచనా. వీరు సాంప్రదాయకంగా, ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి షీలాదీక్షిత్ హయాంలో కాంగ్రెస్‌కు మద్దతుదారులు. అయితే, మొహల్లా క్లినిక్‌లు, విద్యుత్, నీటి బిల్లుల తగ్గింపు , ప్రాథమిక సౌకర్యాలను అందించటం వంటి లక్ష్య విధానాల ద్వారా ఆప్ వారిని తనవైపునకు తిప్పుకోగలిగిందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. అయితే, మురికివాడల్లో నివసించే ప్రజల మద్దతును పొందటంపై బీజేపీ కూడా దృష్టి సారించి పలు కార్యక్రమాలను సాగిస్తున్నదని ఆ పార్టీ నాయకులు చెప్తున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ఢిల్లీలోని ఎంపీ సీట్లను దక్కించుకుంటున్న బీజేపీ.. అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం చతికలపడిపోతున్నదని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం.. ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అదే నెల 8న తుది ఫలితాలు వెలువడనున్నాయి.

సంపాదకీయం

లక్షలాది మంది ప్రజలు కుల, మత, ప్రాంత భేదాలేవీ లేక ఐక్యంగా పోరాడి పొందిన ఫలితాన్నే ఈ భగవత్, వారి వారసులూ అనుభవిస్తున్నారు. చరిత్రనూ తొక్కేయాలని చూస్తున్నారు. భిన్నమతాల వారు వీరులుగా పోరాడి మనకు స్వాతంత్య్రాన్ని ఇచ్చిపోయారు. మీరేమో మతతత్వ కళ్లతో చూసి మాట్లాడుతున్నారు. పాశ్చాత్య దేశాల ఫాసిస్టు ఉద్యమాల నుండి ప్రేరణ పొందిన సంఘ్ సేవకులు ప్రజాస్వామ్యాన్నీ, స్వేచ్ఛను భరించడం కష్టంగానే ఉంటుంది మరి!

ద్రోహభాషణం

వాళ్లు అలా మాట్లాడటం ఆశ్చర్యం అనిపించదు. వాళ్లలానే మాట్లాడుతారు. కానీ అశేష భారత ప్రజలు వాటినంగీకరించరు. న్యాయము, చట్టము, రాజ్యాంగము, ప్రజాస్వామ్య వ్యవస్థా ఏవీ కూడా ఒప్పుకోవు! అయినా వాళ్ల చరిత్ర పుట్టుక తెలిసిన వాళ్లకు ఈ మాటలు కొత్తేమీ కాదు. ఒక్కొక్క అడుగూ వేసుకుంటూ, ఒక్కొక్క ప్రజాస్వామిక సంస్థనీ తొక్కుకుంటూ ఇపుడు స్వాతంత్య్రం, రాజ్యాంగం మీదకీ వచ్చేస్తున్నారు. ఇప్పుడీ అనాగరిక సంభాషణలను నిర్భయంగా పలుకుతున్నారు. నిలువరించి, నిలేయకపోతే ఎంతకైనా తెగించే అవకాశమూ ఉంది. జాగరూకులమై ఉండాలి మనమిప్పుడు. లేకుంటే ప్రమాదం వెన్నంటుతుంది.

స్వాతంత్య్రం వచ్చి డెబ్బయి ఐదేండ్లయిన సందర్భంగా ఆజాదీ అమృత మహోత్సవాలు జరుపుకుని నడుస్తున్న వేళ, ఇది స్వాతంత్య్రమేకాదని గుర్తించ నిరాకరించడం ఈ దేశభక్త నాయకునికి ఎలా సాధ్యమయింది! ఈ మధ్య రాష్ట్రీయ స్వయం సేవక సంఘం అధిపతి మోహన్ భగవత్ మాట్లాడుతూ దేశానికి 1947 ఆగస్టు 15న వచ్చింది అసలు స్వాతంత్య్రం కాదని, 2024 జనవరి 22న అయోధ్యలో రామమందిర ప్రతిష్టాపన తోనే దేశానికి నిజమైన



స్వాతంత్య్రం వచ్చిందని పేర్కొన్నాడు. అంతేకాదు, రాముడు, కృష్ణుడు, శివుడు కేవలం దేవుళ్లే కాదు, మన నాగరికతా విలువలకు, సనాతన ధర్మానికి గుర్తులు అని బోధించారు. రెండు విలువల మధ్య యుద్ధం జరిగి విజయం పొందిన సందర్భం అని సెలవిచ్చారు. ఇది అత్యంత దారుణమైన విషయం. రాముడు, కృష్ణుడు, శివుడు ఇంకా ముప్పది మూడు కోట్ల దేవుళ్లు ఉండవచ్చు గాక, వారిని విశ్వాసాల మేరకు ఆరాధించనూవచ్చు. కానీ వారికి గుడులను నిర్మించడానికి, విగ్రహాలు ప్రతిష్టించడానికీ, మన దేశ స్వాతంత్య్రానికి ముడివేయటం అసంబద్ధమైన వాదం మాత్రమే. ఒక దేవుని గుడిని కూలగొట్టి, మరో దేవునికి గుడి కట్టడం స్వాతంత్య్రం ఎలా అవుతుంది! అంతేకాదు, ఈ వాదన మనం ఇంతకాలంగా అనుభవిస్తున్న స్వేచ్ఛను, ఆధునిక ప్రజాస్వామిక విధానాన్ని, రాజ్యాంగ విలువలను అపహాస్యం చేసినట్టేకదా! రెండువందల యేండ్ల ఆంగ్లేయుల పాలన నుండి విముక్తి పొందేందుకు ప్రజలు పోరాడిన చరిత్రనంతా చులకన చేయటం వారికే చెల్లింది. ఎంతోమంది యోధులు తమ జీవితాలను త్యాగం చేశారు. ప్రాణాలిచ్చారు. ఉరికంభాలెక్కారు. ఆఖరికి స్వేచ్ఛను సాధించారు. ఎలాంటి పాలన కావాలో ఆలోచించి ప్రజాస్వామిక విలువలతో కూడిన రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వీటన్నింటినీ ఒక్కమాటతో తిరస్కరిస్తారా! ప్రాణత్యాగాలను విస్మరించి, స్వాతంత్య్రాన్నే కించపరుస్తారా!

అవును, మీరు రాజుల కాలంనాటి బానిస భావాల వారసులు. నేటి ఆధునిక ప్రజాస్వామిక విలువలంటే చిర్రెత్తుకొస్తారు. మనుధర్మం తప్ప రాజ్యాంగమంటే మీకు ద్వేషం. మొన్న మొన్నటి వరకూ మన మూడు రంగుల జెండాను కూడా ఎగరేయడానికి పూనుకోలేదు కదా! ఎందుకెగరేస్తారులే! అసలు స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొంటే కదా! కాదు కాదు, ఆ పోరాటానికి వ్యతిరేకంగా బ్రిటిష్ వారికి వంతపాడిన వారసులు మీరనే విషయం ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటున్నాం. పోరాడటం, త్యాగం చేయటం మీకు గిట్టని విషయం. ఒక్కసారి చరిత్రను చూడండి. లక్షలాది మంది ప్రజలు కుల, మత, ప్రాంత భేదాలేవీ లేక ఐక్యంగా పోరాడి పొందిన ఫలితాన్నే ఈ భగవత్, వారి వారసులూ అనుభవిస్తున్నారు. చరిత్రనూ తొక్కేయాలని చూస్తున్నారు. భిన్నమతాల వారు వీరులుగా పోరాడి మనకు స్వాతంత్య్రాన్ని ఇచ్చిపోయారు. మీరేమో మతతత్వ కళ్లతో చూసి మాట్లాడుతున్నారు. పాశ్చాత్య దేశాల ఫాసిస్టు ఉద్యమాల నుండి ప్రేరణ పొందిన సంఘ్ సేవకులు ప్రజాస్వామ్యాన్నీ, స్వేచ్ఛను భరించడం కష్టంగానే ఉంటుంది మరి! స్వేచ్ఛ కోసం జరిగిన సమరంలో అసలు పాల్గొనని వారి మాటలు ఇంతకన్నా గొప్పగా ఏం ఉంటాయి. చెప్పుకోవటానికి సచ్చరిత్రే లేనివాళ్లు హీనులుగా మిగిలిపోకతప్పదు.

మోహన్ భగవత్ మాటలు తేలికగా తీసుకుంటే మోసపోతాము. అవి వారి భవిష్యత్ ఆచరణలో భాగంగా చెప్పిన మాటలు. మన రాజ్యాంగాన్ని, దాని విలువలను పక్కనపెట్టి సనాతన ధర్మం పేర మనుధర్మాన్ని తీసుకురావాలనే ప్రయత్నంలోంచి వచ్చిన మాటలవి. దేశభక్తి గురించి పెద్ద పెద్ద మాటలు చెప్పే వీళ్ల అసలు దేశభక్తి ఇది. దేశం కోసం ప్రాణాలర్పించిన వారిని కించపరచడం, దేశ స్వాతంత్య్రాన్ని గుర్తించ నిరాకరించడం వీరి నైజం. ప్రజలు ఇలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి. చైతన్యంతో తిప్పికొట్టాలి.

1998లో వచ్చిన వాజ్‌పేయి ప్రభుత్వం చంద్రబాబు మద్దతువల్ల ఏడాది నడిచినా బలం లేక కూలిపోయింది. ఇంత రాజకీయ అస్థిరత్వం, అశాంతి ఎవరిది మరి? కానీ ఆ కాలంలోనూ రాజ్యాంగాన్ని తిరగదోడేందుకు జస్టిస్ వెంకట్రామయ్య కమిషన్ వేసి విఫలయత్నం చేశారు. అధ్యక్ష తరహా పాలన మెరుగైందని అద్వానీ బాహాటంగా మాట్లాడారు. కార్గిల్ నేపథ్యంలో వాజ్‌పేయి 1999లో మూడోసారి కాస్త స్పష్టమైన ఆధిక్యతతో వచ్చినా ఆ కాలంలోనే గుజరాత్ మారణకాండతో సహా అనేక దారుణాలు జరిగాయి. తెహల్కా టేపుల వంటివి వచ్చాయి. తాముగా ఏడాది ముందే ఎన్నికలకు వెళ్లి భంగపడ్డారు.ఈ అస్థిరత్వమంతా ఎవరి పుణ్యం?

మోడీ హయాంలో గుజరాత్ మారణకాండ దేశాన్ని కుదిపేసింది. ప్రపంచం నివ్వెరపోయింది.ఆయన్ను దింపేయాలని వాజ్‌పేయి, ఆయన్ను చూసి చంద్రబాబు అన్నారు గానీ తర్వాత తగ్గారు.ఇదిగో అలాంటి భయానక సమయంలో ముందస్తు ఎన్నికలకు వెళ్లారు మోడీ. 2002 జులై19న శాసనసభ తీర్మానం ఆమోదించిన గవర్నర్ భండారీ శాసనసభను రద్దు చేశారు. ఇప్పుడు 'ఒకేదేశం ఒకే ఎన్నిక' అంటున్న ఈ అధినేత అప్పుడు తొందరగా ఎన్నికలు జరిపించాలని ఎన్నికల సంఘంపై ఒత్తిడి తేవడమే గాక రాజకీయ లీగల్ పోరాటం కూడా చేశారు. కేసులు వేశారు, మారణ కాండ శరణార్థులు ఇంకా శిబిరాల్లో వుండగానే ఎన్నికలు పూర్తి చేసి గెలిచామనిపించుకున్నారు.అదో భయానక రాజకీయ క్రీడ.

అస్థిరతకూ అశాంతికి అసలు కారణమెవరు?



తెలకపల్లి రవి

మాటిమాటికీ ఎన్నికలతో అభివృద్ధికి ఆటంకమనీ, అస్థిరత్వమనీ ప్రధాని మోడీ ఆయన వత్తాసు దారులు అదే పనిగా చెబుతున్నారు. పార్లమెంటులో నిబంధనలకు విరుద్ధంగా జమిలి బిల్లు ప్రవేశపెట్టి బలం లేదని తెలుసు గనక వాయిదా వేసుకున్నారు.ఇందుకు సంబంధించిన భిన్న వాదోపవాదాలు ఒకటైతే అసలు ఈ హడావుడి చేసిన బీజేపీ వారి గతం ఎట్టిదనే ప్రశ్న చాలా ఆసక్తి కలిగిస్తుంది. గత ముప్పై ఏళ్లలో అత్యధికంగా అస్థిరత్వంతో అశాంతితో ఆటంకాలు కలిగించిన వారు ఎవరంటే వేలు బీజేపీవైపే చూపిస్తుంది.ఉంటే తాముండాలి లేకుంటే మరొకరిని ఉండనివ్వకూడదనేది వారి రాజకీయ తాత్వికత. ఇక అధికారం కోసం మతతత్వం ప్రకోపింప చేయడం వారి సైద్ధాంతిక తాత్వికత. ఇందుకు ఉదాహరణలు లెక్కలేనన్ని. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు 1959లో కేరళ నంబూద్రిపాద్ ప్రభుత్వంతో మొదలెట్టి ఇష్టం లేని సర్కార్లను వరుసగా కూలదోసిన మాట నిజమే. కానీ ఈ విషయంలో బీజేపీ రికార్డు మరో విధంగా హానికరమైందని గుర్తించవలసి వుంది.

స్వార్థం కోసం చిచ్చు

కాంగ్రెస్‌ను ఎదుర్కోవడమే తమ లక్ష్యమైనట్టు మాట్లాడే బీజేపీ దాని పూర్వరూపమైన జనసంఘం తాము లేనిచోట్ల మరెవరూ వుండకూడదనే స్వార్థపూరత వైఖరినే అనుసరించారు. ప్రతిపక్ష సంఘటన ప్రభుత్వాలు ఏర్పడిన చోట్ల కూడా తగవులతో మతకలహాలతో చిచ్చుపెట్టి పడగొట్టారు. 1967లో మొదటిసారి వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడగా బెంగాల్, కేరళలోనూ సీపీఐ(ఎం) నాయకత్వం వున్నచోట్ల తప్ప మిగిలిన చోట్ల ఇలాంటి సర్కార్లు ఏర్పడ్డాయి. అవేవీ పూర్తికాలం నిలిచింది లేదు.జనసంఘం నాయకులు రకరకాల పేచీలతో అస్థిరత్వం పాలుచేశారు. ఇక వామపక్ష సర్కార్లను కేంద్ర కాంగ్రెస్ రద్దు చేస్తూ వచ్చింది.ఈ నేపథ్యం చివరకు 1975లో ఇందిరాగాంధీ ఎమర్జన్సీ విధింపుతో పరాకాష్టకు చేరింది. దానికి తక్షణ ప్రత్యా మ్నాయంగా జనతా పార్టీ ఏర్పడి అధికారంలోకి వచ్చింది. జనతా పార్టీలో జనసంఘం కూడా వున్నా ప్రజాస్వామ్య పరిరక్షణ కోణంలో సీపీఐ(ఎం) కూడా మద్దతునిచ్చింది.అయితే పూర్తి మెజార్టీతో జనతా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఆరెస్సెస్ తరహా మతరాజకీయాలను పాఠ్యపుస్తకాల్లో జొప్పించడమనే అజెండాతో వివాదం ప్రారంభమైంది. ఈ క్రమంలో చివరకు ఆరెస్సెస్ ద్వంద్వ సభ్యత్వం వదులుకోవడానికి వాజ్‌పేయి, అద్వానీల నాయకత్వంలో జనసంఘ్ వర్గం నిరాకరించడం వల్ల ఆ ప్రభుత్వం పడిపోయే స్థితి వచ్చింది.ఆ సమయంలో చరణ్‌సింగ్‌ను బలపర్చి జనతా పార్టీ చీలికకు కారకులయ్యారు. రాష్ట్రాల్లోనైతే అన్నిచోట్లా ఈ ఇద్దరి తరపు నాయకులే చీలికలు తెచ్చి సగం సగం చొప్పున ముఖ్యమంత్రి పదవులు చేజిక్కించుకున్నారు.తర్వాత ఆయన్నూ జనసంఘం వర్గం ఆయన్నూ వెన్నుపోటు పొడిచింది.

ఎన్టీఆర్, చంద్రబాబు తేడా

1980లో ఇందిరాగాంధీ తిరిగి అధికారంలోకి రాగలిగారు. వచ్చీ రాగానే ఆమె రాష్ట్రాల్లో జనతా ప్రభుత్వాలను రద్దుచేసి ఎన్నికలకు వెళ్లి విజయం సాధించారు. 80వ దశకం పొడుగునా బీజేపీ లేకుండా కాంగ్రెస్ వ్యతిరేక కూటమి ఏర్పడాలన్నదే వామపక్షాల విధానంగా వుండేది. టీడీపీ వ్యవస్థాపకుడు ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వంటివారు అందరూ కలసి వుండాలన్నా వామపక్షాలు విడిగానే వుంటూ వచ్చాయి. 1986లో రాజీవ్‌గాంధీపై వీపీసింగ్ తిరుగుబాటు తర్వాత మరోసారి జనతా తరహా ప్రయోగం జరగకుండా అడ్డుకోగలిగాయి. నేషనల్ ఫ్రంట్‌లోనూ బీజేపీకి చోటు లభించలేదు. వీపీసింగ్ వామపక్షాలు తన సహజ మిత్రులంటూ వారితో వేదిక పంచుకోవడానికి నిరాకరించారు గానీ స్థానికంగా సర్దుబాటుకు అంగీకరించారు. కాంగ్రెస్ ఓటమితో వీపీ సింగ్ ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు తమకు స్థానం లభించకపోవడం బీజేపీకి మింగుడు పడలేదు. ఆయన మండల్ నివేదికను ఆమోదించడం అసలే నచ్చలేదు. దాంతో మండల్‌కు వ్యతిరేకంగా కమండల్ అంటూ అద్వానీ రథయాత్ర ప్రారంభించారు. ఆ అంశంపైనే ఆ ప్రభుత్వాన్ని పడగొట్టారు కూడా. వీపీసింగ్ తర్వాత కాలంలో వాజ్‌పేయి ఏ మాత్రం బలం లేకున్నా సర్కారు ఏర్పాటు సంకేతాలిచ్చారు, తలుపులు తెరుచుకుని కూచున్నామన్నారు. కానీ



> మధ్యంతర ఎన్నికల ద్వారా వచ్చిన ఒక నేత ఒకే తేదీన అన్ని ఎన్నికలు జరపాలని పట్టుపట్టడంలో రాజకీయమేమిటో ఎవరికైనా అర్థమవుతుంది. ఈ కాలంలో ఎన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మారాయో ఎన్ని ఫిరాయింపులు జరిగాయో దేశమంతటికీ తెలుసు.ఈ మధ్యలో మెజార్టీ మతతత్వాన్ని మసీదుల తగాదాలను రగిలించడం ఒకవైపు, కార్పొరేట్ దోస్తి మరో వైపు. కాంగ్రెస్ తరహాలో రాష్ట్ర ప్రభుత్వాల రద్దుకాగా దొడ్డిదోవన ఫిరాయింపులతో ఈడి, సిబిఐ, ఐటి త్రిశూల వ్యూహంతో ప్రభుత్వాలను కైవసంచేసుకోవడం మోడీ రాజకీయం. ఈ పూర్వరంగంలో ఒకేదేశం ఒకే ఎన్నిక అనే జమిలి మంత్రం ప్రయోగం అనైతిక అప్రజాస్వామిక రాజకీయాలకు ముసుగు మాత్రమేనన్నది స్పష్టం.

ఎవరూ కలవలేదు. అలా రెండోసారి కేంద్రంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని వారే అస్థిరత్వం పాలుచేశారు. పీవీ నరసింహారావు హయాంలో దాగుడు మూతలాడుతూ బాబరీ మసీదును కూలదోసి ప్రపంచవ్యాపితంగా నిరసనకు కారణయ్యారు. ఆ సమయంలో వారి ఆధ్వర్యంలోని నాలుగు రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయడం అనివార్యమైంది. మసీదు కూల్చివేత ఘటనల తర్వాత 1994లో బీజేపీతో పొత్తుకు ఎన్టీఆర్ నిరాకరించారు. ఎన్టీఆర్‌పై తిరుగుబాటుచేసిన చంద్రబాబు నాయుడు నిలదొక్కుకునే వరకూ, 1996 ఎన్నికలవరకూ వామపక్షాలు, లౌకిక పార్టీలతో వున్నారు. తర్వాత మాత్రం మారిపోయారు,

వాజ్‌పేయి ప్రహసనం

1996లో కాంగ్రెస్ బయటనుంచి ఇచ్చే మద్దతుతో ఈ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయగల స్థితి వున్నా.. అధికారం కోసం ఆరాటంలో వాజ్‌పేయి ఏమాత్రం మెజార్టీ లేకుండా కేవలం 160 సీట్లతో 1996లో సర్కారు ఏర్పాటు చేసి 13 రోజుల్లో అవమానకరంగా దిగిపోయారు. తర్వాత ఏర్పడిన యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని సహించలేక రెండేండ్లలోనే కాంగ్రెస్‌తో కలసి కూలదోశారు.1998లో వచ్చిన వాజ్‌పేయి ప్రభుత్వం చంద్రబాబు మద్దతువల్ల ఏడాది నడిచినా బలం లేక కూలిపోయింది. ఇంత రాజకీయ అస్థిరత్వం, అశాంతి ఎవరిది మరి? కానీ ఆ కాలంలోనూ రాజ్యాంగాన్ని తిరగదోడేందుకు జస్టిస్ వెంకట్రామయ్య కమిషన్ వేసి విఫలయత్నం చేశారు. అధ్యక్ష తరహా పాలన మెరుగైందని అద్వానీ బాహాటంగా మాట్లాడారు. కార్గిల్ నేపథ్యంలో వాజ్‌పేయి 1999లో మూడోసారి కాస్త స్పష్టమైన ఆధిక్యతతో వచ్చినా ఆ కాలంలోనే గుజరాత్ మారణకాండతో సహా అనేక దారుణాలు జరిగాయి. తెహల్కా టేపుల వంటివి వచ్చాయి. తాముగా ఏడాది ముందే ఎన్నికలకు వెళ్లి భంగపడ్డారు.ఈ అస్థిరత్వమంతా ఎవరి పుణ్యం?

ముందస్తు నేత మోడీ

ఇక ఇప్పుడు జమిలి సామ్రాట్ నరేంద్రమోడీ కార్యభూమి గుజరాత్ కథ చూద్దాం. వాజ్‌పేయి హయాంలోనే అక్కడ 1995లో కేశూభాయ్ పటేల్ ముఖ్యమంత్రికాగా మోడీ ఆరెస్సెస్ తరపున ప్రతినిధి. కేశూభాయ్‌తో శంకర్‌సింగ్ వాఘేలా విభేదించడంతో ఆ ప్రభుత్వం ప్రతిష్టంభనలో పడిన పరిస్థితిని తాను ఉపయోగించుకున్నారు. మధ్యలో రాజీ అభ్యర్థిగా సురేష్‌మెహతాను సీఎంను చేసినా పెద్దగా నడిచింది లేదు. వాఘేలా స్వంతంగా పార్టీ ఏర్పాటు చేసి చీలిపోవడమే అందుకు కారణమైంది.1998 ఎన్నికల నాటికి మళ్లీ కేశూభాయ్ పటేల్‌ను తెచ్చినా నిలిచే పరిస్థితి లేకపోయింది. భూకంపం సహాయ కార్యక్రమాల్లో అవినీతికి పాల్పడ్డారనే కారణంతో 2001లో ఆయన్ను తప్పించి మోడీని సీఎంగా చేశారు.ఇదంతా ఏపాటి స్థిరత్వమో చూడొచ్చు. మోడీ హయాంలో గుజరాత్ మారణకాండ దేశాన్ని కుదిపేసింది. ప్రపంచం నివ్వెరపోయింది.ఆయన్ను దింపేయాలని వాజ్‌పేయి, ఆయన్ను చూసి చంద్రబాబు అన్నారు గానీ తర్వాత తగ్గారు.ఇదిగో అలాంటి భయానక సమయంలో ముందస్తు ఎన్నికలకు వెళ్లారు మోడీ. 2002 జులై19న శాసనసభ తీర్మానం ఆమోదించిన గవర్నర్ భండారీ శాసనసభను రద్దు చేశారు. ఇప్పుడు 'ఒకేదేశం ఒకే ఎన్నిక' అంటున్న ఈ అధినేత అప్పుడు తొందరగా ఎన్నికలు జరిపించాలని ఎన్నికల సంఘంపై ఒత్తిడి తేవడమే గాక రాజకీయ లీగల్ పోరాటం కూడా చేశారు. కేసులు వేశారు, మారణ కాండ శరణార్థులు ఇంకా శిబిరాల్లో వుండగానే ఎన్నికలు పూర్తి చేసి గెలిచామనిపించుకున్నారు.అదో భయానక రాజకీయ క్రీడ. ఈ విజయం తర్వాత 2004 ఎన్నికల నాటికి జాతీయతారగా బీజేపీ ఆయన్ను ఊరేగించింది. అగ్రనేతలైన వాజ్‌పేయి,అద్వానీలు ఇద్దరినీ వెనక్కు నెట్టి నెమ్మదిగా తాను కేంద్రస్థానంలోకి వచ్చారు,

రాజకీయ ముసుగు

మధ్యంతర ఎన్నికల ద్వారా వచ్చిన ఒక నేత ఒకే తేదీన అన్ని ఎన్నికలు జరపాలని పట్టుపట్టడంలో రాజకీయమేమిటో ఎవరికైనా అర్థమవుతుంది.ఈ కాలంలో ఎన్ని రాష్ట్ర ప్రభుత్వాలు మారాయో ఎన్ని ఫిరాయింపులు జరిగాయో దేశమంతటికీ తెలుసు.ఈ మధ్యలో మెజార్టీ మతతత్వాన్ని మసీదుల తగాదాలను రగిలించడం ఒకవైపు, కార్పొరేట్ దోస్తి మరో వైపు. కాంగ్రెస్ తరహాలో రాష్ట్ర ప్రభుత్వాల రద్దుకాగా దొడ్డిదోవన ఫిరాయింపులతో ఈడి, సిబిఐ, ఐటి త్రిశూల వ్యూహంతో ప్రభుత్వాలను కైవసంచేసుకోవడం మోడీ రాజకీయం. ఈ పూర్వ రంగంలో ఒకేదేశం ఒకే ఎన్నిక అనే జమిలి మంత్రం ప్రయోగం అనైతిక అప్రజాస్వామిక రాజకీయాలకు ముసుగు మాత్రమేనన్నది స్పష్టం. ■

అదానీ - ఆర్థిక వ్యవస్థ



నజర్

చాయి తాగుతూ పేపర్ చదువుతున్న పుష్పకుమార్ ఒక్కసారిగా పెద్దగా నవ్వాడు. సరిగ్గా చెప్పాలంటే పాత సినిమాలో విలన్‌లా వికటాట్ట హాసం చేశాడు. వంటింట్లో పనిలో ఉన్న లక్ష్మి కంగారుపడి హాల్లోకి వచ్చింది.

"చూశావా! చివరికి మంచే గెలుస్తుంది!" అన్నాడు పుష్పకుమార్ భార్యతో.

"చివరికి మంచి గెలిచే మాట నిజం! అంతేకాని గెలిచిన ప్రతీదీ మంచి కాకపోవచ్చు. ఒక్కసారి చెడు కూడా గెలుస్తుంటుంది. అంత మాత్రాన అది అంతా మంచి కాదు!" అన్నది లక్ష్మి.

"మీ నాన్న ఇలా పెంచాడేమిటి? దేన్నీ ఓపట్టాన ఒప్పుకోవు!" అన్నాడు పుష్పకుమార్ చిరాగ్గా!

"మిమ్మల్ని ఇలా తయారు చేశారేమిటీ అని మా మామయ్య గారిని నేను అనలేను! ఇంతకూ మీ వికటాట్టహాసానికి కారణం సెలవియ్యండి మహా ప్రభూ!" అన్నది లక్ష్మి చేతులు జోడించి.

"హిండెన్‌బర్గ్ దుకాణం మూసేశారంట!" అన్నాడు పుష్పకుమార్ చిద్విలాసంగా.

"ఆ దుకాణం మూసేస్తే మీకెందుకింత ఆనందం!" ఆశ్చర్యంగా అడిగింది లక్ష్మి.

"మన దేశ ఆర్థికవ్యవస్థను దెబ్బతీయాలని ఎన్ని కుట్రలు చేసింది? చేసిన పాపం ఊరికే పోదు! సనాతన ధర్మం జోలికొస్తే పుట్టగతులుండవు!" అన్నాడు పుష్పకుమార్.

"నేను మీకు చాయి మాత్రమే ఇచ్చాను" అందులో మీరేదైనా కలుపుకున్నారా ఏమిటి? ఒకదానికొకటి సంబంధం లేకుండా మాట్లాడుతున్నారు? ఆర్థిక వ్యవస్థకూ, సనాతన ధర్మానికి లింకు ఏమిటండి?" అడిగింది లక్ష్మి.

"పిచ్చిదానా అదొక ధర్మసూక్ష్మం! అలాంటి లోతైన విషయాలు నీలాంటి అర్భకులకు అర్థం కావులే!" అన్నాడు పుష్పకుమార్ మరింత చిద్విలాసంగా!

"అర్థం అయ్యేలా చెప్పండి స్వామి!" అన్నది లక్ష్మి

"మునిగిపోతున్న దేశ ఆర్థికవ్యవస్థను నిలబెడుతున్నది ఎవరో తెలుసా? అదానీ, అంబానీలే! వారిద్దరినీ దెబ్బతీస్తే ఈ దేశ ఆర్థికవ్యవస్థ కుప్పకూలుతుంది! దేశ ఆర్థిక వ్యవస్థ కూలిపోతే పెద్దాయన కీర్తి, ప్రతిష్టలు దెబ్బతిని ప్రభుత్వం పడిపోతుంది! ఈ భూ ప్రపంచంలో సనాతన ధర్మాన్ని పరిరక్షించే ఏకైన ప్రభుత్వం అధికారం లేకపోతే, సైతానులు, రాక్షసులు అంధకారంలోకి వస్తారు. అప్పుడంతా అల్లకల్లోలం! వినాశనమే! సరిగ్గా చెప్పాలంటే ప్రళయమే వచ్చి సర్వనాశనం అవుతుంది!" అని పుష్పకుమార్ అంటూండగానే లక్ష్మి కళ్లు తిరిగి కింద పడిపోయింది!

నీళ్లు తీసుకొచ్చి లక్ష్మి మొహం మీద చల్లాడు. లక్ష్మి లేచి కూర్చున్నది.

"అదానీకి నష్టం జరిగితే ప్రపంచం సర్వనాశనం అవుతుందా? అప్పుడెప్పుడో ఇందిరే ఇండియా అనే వారంటూ. ఇప్పుడు అదానీయే ఆర్థిక వ్యవస్థ అయ్యిందన్నమాట!" అన్నది లక్ష్మి.

"అదానీ అంటే మరేమిటనుకున్నావు!" అన్నాడు పుష్పకుమార్.

"హిండెన్‌బర్గ్ సంస్థ మూసేస్తే, ఆ సంస్థ చెప్పినవి అబద్దాలు అయిపోతాయా?" అడిగింది లక్ష్మి.

"అంతేకదా! అదానీ, మోదీని, మన దేశాన్ని దెబ్బతీయడానికి ఆ హిండెన్‌బర్గ్ సంస్థ పెట్టి, అబద్దాలు ప్రచారం చేసి, అది నిరూపించలేక, ఇప్పుడు దుకాణం మూసేసి, తెరవెనక్కి పోతున్నారు!" అన్నాడు పుష్పకుమార్.

లక్ష్మి చిన్నగా నవ్వింది.

"ఎందుకు నవ్వుతావు!" చిరాగ్గా అడిగాడు పుష్పకుమార్.

"హిండెన్‌బర్గ్ సంస్థ, అదానీ మీద కూడా ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆరోపణలు చేసింది. అనేక సాక్ష్యాధారాలున్న పత్రాలు కూడా బయటపెట్టింది. అవన్నీ అబద్ధమని అనవచ్చు! కాని ఆ అక్రమాల మీద పూరిస్థాయిలో విచారణ జరిపించి, విచారణలో ఆరోపణలు రుజువు కాకపోతే అప్పుడు అదానీని, దెబ్బతీయటానికి కుట్రపన్నారని అనవచ్చు. మనదేశంలో ఇప్పటి వరకూ అదానీపై అలాంటి విచారణ ఏదీ జరగలేదు కదా!" అన్నది లక్ష్మి.

"అదానీ మీద ఎలాంటి విచారణ అవసరం లేదు! ఆయన మచ్చలేని చంద్రుడు!" అన్నాడు పుష్పకుమార్.

"ఆయన మచ్చలేని చంద్రుడే కావచ్చు. కాని చంద్రుడిని చూసిన శ్రీకృష్ణుడికి తిప్పలు తప్పలేదు. అదానీకి అంతగా అవకతవకలు చేస్తున్నా విచారణ కూడా జరిపించలేదంటే విదేశాల్లో అంతా నవ్వుకుంటున్నారు! ఇదే అమెరికా, న్యూజిలాండ్ లాంటి దేశాల్లో జరిగితే అధికారంలో ఉన్న ప్రభుత్వం రాజీనామా చేసి ఉండేది! మీరేమో సనాతన ధర్మం అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు!" అన్నది లక్ష్మి.

"ఇదుగో నన్నేమైనా అను! కాని అదానీని, సనాతన ధర్మాన్ని ఏమైనా అంటే సహించను!" అన్నాడు పుష్పకుమార్ కోపంగా.

"మీరు చేస్తున్నది గవర్నమెంటు ఉద్యోగం! తింటున్నది ప్రజల సొమ్ము! ఆదాని పాట పాడటానికి సిగ్గుగా లేదు! అదాని లేనపుడు ఈదేశ ఆర్థికవ్యవస్థ అభివృద్ధి చెందింది! కాని పెద్దాయన అమలు చేస్తున్న విధానం వల్ల మనలాంటి వాళ్ల రెక్కల కష్టం అదానీ జేబు ల్లోకి వెళుతుందని తెలుసుకోండి!" ఈ దోపిడీ మనకు అర్థం కాకూడ దని సనాతన ధర్మాన్ని అడ్డుపెడు తున్నారు. ఇది అర్థం చేసుకోవటం మీలాంటి వాళ్లకి మరీ అవసరం!" అని ముగించింది లక్ష్మి.

- ఉషాకిరణ్

విద్యార్థి సంఘాల ఎన్నికలు - ఆవశ్యకత



నాదెండ్ల శ్రీనివాస్
9676407140



విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘాల రాజకీయాలు చారిత్రక అవసరమని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ఓ సభలో మాట్లాడారు.ప్రస్తుత రాజకీయాల్లో సైద్ధాంతిక భావజాలం ఉన్నవారు లేకపోవడం వల్లే పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయని,విద్యార్థి రాజకీయాల్లో సిద్ధాంతపరంగా రాణించిన వారుంటే ప్రజాప్రతినిధులుగా అధికారంలో ఉన్నా, లేకపోయినా నమ్మిన సిద్ధాంతం కోసం దశాబ్దాలపాటు జీవితాలను త్యాగం చేస్తారని చెప్పుకొచ్చారు. ప్రజా సమస్యలపై విద్యార్థి సంఘాలు పోరాటాలు చేయడం వల్లనే చైతన్యం వస్తుందని, దాని ద్వారానే ఆయా సమస్యలు పరిష్కారమవుతాయంటూ మాట్లాడారు.ఇదొక ఆహ్వానించదగ్గ పరిణామమే.అయితే ఇవి కేవలం మాటలకు మాత్రమే పరిమితం కాకుండా ఆచరణలో అమలయ్యే విధంగా ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆశిద్దాం.

అంతకన్నా ముందు ఓ విషయాన్ని కూడా గుర్తుచేయాల్సివుంది. సుప్రీంకోర్టు 2005 డిసెంబర్ 2న ఇచ్చిన ఆదేశాల ప్రకారం కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ, కేంద్ర మాజీ ముఖ్య ఎన్నికల అధికారి జేఎం లింగ్డో అధ్యక్షతన విశ్వవిద్యాలయాలు, కాలేజీల్లో విద్యార్థుల యూనియన్ ఎలక్షన్లను సమీక్షించి తగిన సూచనలు చేయాలని కమిటీని నియమించింది. కమిటీ 2006 మే 26న రిపోర్ట్‌ను అందజేసింది. అదే ఏడాది సెప్టెంబర్ 22న సుప్రీంకోర్టు కమిటీ ప్రతిపాదించిన రిపోర్టును అమలు చేయాలని యూనివర్సిటీలకు, కాలేజీలకు సూచించింది. విద్యార్థి ఎన్నికల నిర్వహణకు సంబంధించి కమిటీ చాలా సూచనలు చేసింది. విద్యాసంవత్సరం మొదలైన ఆరు నుంచి ఎనిమిది వారాల మధ్యలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, ఈ ప్రక్రియ మొత్తం పది రోజుల వ్యవధి మించకుండా పూర్తి చేయాలని, దేశంలో ఉన్న యూనివర్సిటీల్లో విద్యార్థి ఎన్నికలు నిర్వహించడానికి శాంతి,స్వేచ్ఛాయుతమైన వాతావరణం ఏర్పాటు చేయాలని, పరిస్థితులు ప్రతికూలంగా ఉంటే ఆయా వర్సిటీల్లో నామినేషన్ పద్ధతిలో విద్యార్థి ప్రతినిధులను ఎన్నుకోవాలని పేర్కొంది. ఐదేండ్ల తర్వాత నామినేషన్ పద్ధతి నుంచి నిర్మాణాత్మకమైన ఎన్నికల విధానానికి రావాలని, అంటే పార్లమెంటరీ తరహాలో పరోక్షంగా లేదా అధ్యక్ష తరహాలో ప్రత్యక్షంగా లేదా రెండు కలిపిన ఎన్నికల విధానం అనుసరించాలని, విద్యార్థి సంఘాల్లో ప్రతినిధులుగా రెగ్యులర్ విద్యార్థులు మాత్రమే ఉండాలని, విద్యార్థి సంఘాల ప్రతినిధులు రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా పనిచేయాలని చెప్పింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జేఎం లింగ్డో కమిటీ ఇచ్చిన రిపోర్ట్ ప్రకారం ఐదేండ్లు నామినేషన్ పద్ధతిలో విద్యార్థి నాయకులను ఎన్నుకుని,ఆ తర్వాత విద్యార్థి యూనియన్ ఎలక్షన్స్ నిర్వహించాలి.

కానీ, కోర్టు ఆదేశించి పదిహేడేండ్లు గడిచినా అంటే ఉమ్మడి ఏపీ, ప్రస్తుత తెలంగాణతో సహా చాలా రాష్ట్రాల్లో అది ఆచరణలోకి రాలేదు. కేంద్ర విశ్వవిద్యాల యాలైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ,జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, రాష్ట్రస్థాయిలో కేరళ, పశ్చిమ బెంగాల్, అస్సాం, రాజస్థాన్, పంజాబ్ తదితర వర్సిటీల్లో కొన్నిచోట్ల మాత్రమే విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మిగిలిన రాష్ట్రాల్లో ఇప్పటివరకు ఎన్నికలకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీనివల్ల విద్యార్థుల్లో ఆర్థిక, సామాజిక,రాజకీయ చైతన్యం లేకుండా పోతోంది. విద్యలో కాషాయికరణ,ప్రయివేటీకరణ, ఫీజుల దోపిడీ, ప్రయివేటు యూనివర్సిటీల ఏర్పాటు, నిరుద్యోగం, కులం, మతం,ప్రాంతాల పేరుతో విద్వేషాలు సృష్టించడం ఇలా విద్యార్థుల భవిష్యత్తును అంధకారం చేసే అనేక వైపరీత్యాలు జరుగుతున్నా విద్యార్థులు కనీసం వారి హక్కుల కోసం గళమెత్తలేని అచేతన స్థితిలో ఉంటున్నారు.దీనివల్ల ప్రశ్నిం చేతత్వం తగ్గిపోతోంది.ఒకవైపు చదువుకుంటూనే మరోవైపు సామాజిక,ఆర్థిక,రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకొని సంఘ విద్రోహ శక్తులపై చదువుతూ పోరాటం – చదువుకై పోరాటం చేసేవాడే విద్యార్థి.అలాంటి విద్యార్థుల నిస్వార్థపు ఆలోచనలు,చర్యలు దేశ నిర్మాణానికి,ప్రగతికి దోహదం చేస్తాయి.ఇలా యూనివర్సిటీల్లో విద్యార్థి సంఘాల నేతలుగా ఎదిగిన అనేకమంది నేడు దేశం కోసం,ప్రజల కోసం నిర్విరామంగా అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్నారు.ఇలా నిస్వార్థంగా పనిచేసేందుకు ఒక్క వామపక్షాలు తప్ప మిగతా రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తగ్గిపోతున్నారు. విద్యార్థి సంఘాల ఎన్నికలు జరిగిన కాలంలో విద్యావ్యవస్థను పరిశీలిస్తే నాయకులు, విద్యార్థులందరూ సామాజిక స్పృహతో చైతన్యంగా ఉండేవారు. అందువల్లనే ప్రాథమిక పాఠశాల నుండి యూనివర్సిటీల దాకా విద్యార్థి,టీచర్ నిష్పత్తి ప్రకారం నిరంతరం అధ్యాపకుల నియామకాలు జరిగాయి. నాణ్యమైన విద్యాబోధన డిమాండ్ చేయడంతో పాటు కాలేజీ, హాస్టల్ ఫీజులు సామాన్యుడికి కూడా అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వంతో పోరాడేవారు. అంతేకాకుండా ప్రశ్నించేతత్వం ప్రతి విద్యార్థిలో ఉండటంతో విద్యాసంస్థలు కూడా బాధ్యతా యుతంగా, జవాబుదారీతనంతో పనిచేసేవి. ఒక్క విద్యాసంస్థలకే పరిమితం కాకుండా సామాజిక ఉద్యమాల్లో కూడా విద్యార్థులు కీలకపాత్ర పోషించారు.ఉదాహరణకు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం రాజకీయ పార్టీల పోరాటంకంటే ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు ముందుండి వీరోచితంగా ఉద్యమించడం వల్లనే రాష్ట్ర ఏర్పాటు కల సాకారమైంది. ఈ పోరాటాలు సమాజం పట్ల విద్యార్థి నాయకులకు, విద్యార్థులకు ఉన్న నిబద్ధతను తెలియజేస్తాయి.

దేశంలో ప్రస్తుతం విద్య,ఉపాధి రంగాల్లో రాజకీయ ప్రభావం లేని వ్యవస్థ అంటూ లేదు. 2014లో మోడీ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే ఆరెస్సెస్ సంస్థలు హిందూత్వ రాజకీయాల కోణంలో చరిత్రను రాయాలని పట్టుబట్టాయి. ఇప్పటికే మూఢ నమ్మకాలను జొప్పించే అలహాబాద్ లేదా గోరఖ్‌పూర్ విశ్వ విద్యాలయం కావచ్చు,అనేక కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో జ్యోతిష్యం, వాస్తు, ఆచారాలు మొదలైన విభాగాలు ప్రారంభించ బడ్డాయి. వాల్యూ ప్రమోషన్ ప్రోగ్రాం పేరుతో యూనివర్శిటీల్లో మూఢ నమ్మకాలకు పెంచి పోషిస్తున్నారు. హాస్యాస్పదమైన విషయమేమిటంటే, యువతకు ఇది ఉపాధి అవకాశంగా కూడా ప్రచారం చేస్తున్నారు.ఈ పదేండ్ల విద్యా రంగాన్ని కాషాయీకరణ చేయడం వల్ల ఇప్పటివరకు జరిగిన నష్టం ఊహించలేనిది. దీన్ని తిప్పికొట్టడం ప్రధాన సవాల్. కేవలం ఆరెస్సెస్– బీజేపీ ప్రభుత్వాన్ని అధికారం నుండి తొలగించడం ద్వారా దీనిని సరిదిద్దలేము. అది కాంగ్రెస్ కావచ్చు, ఇంకేదైనా కావచ్చు ప్రజారాజకీయ జీవితంలో మతపరమైన ఆచారాలను ఉపయోగించడం, మెజారిటీ మతపరమైన గుర్తింపును ప్రసన్నం చేసుకునే ధోరణి సర్వసాధారణం. అటువంటి పరిస్థితిలో, మతతత్వానికి వ్యతిరేకంగా చేతన పోరాటం, ప్రజా చైతన్యాన్ని విస్తరించడం శాస్త్రీయ, విమర్శనాత్మక ఆలోచనను అందించడానికి ఏకైక మార్గం. ■

అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు

- గ్రామ సభల్లో దరఖాస్తుల స్వీకరణ
- రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ :

జిల్లా కలెక్టర్లతో మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతర ప్రక్రియని, చివరి లబ్దిదారుల వరకు అందిస్తామని ప్రకటించారు. ఇందులో ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న రేషన్ కార్డుల లబ్దిదారుల జాబితా కులగణన (సామాజిక) సర్వే ఆధారంగా తయారు చేసిందనీ, ఇది తుది జాబితా కాదని పేర్కొంది. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, గ్రామ సభల నిర్వహణ, తదితర అంశాలపై శనివారం డాక్టర్.బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టబోతుందని తెలిపారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామ సభల్లో దరఖాస్తులను స్వీకరించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా కూడా కొత్త రేషన్ కార్డులకు లేదా కొత్త సభ్యుల చేర్పులకు దరఖాస్తులు కూడా స్వీకరించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే , గతంలో జరిగిన ప్రజాపాలన సదస్సులలో స్వీకరించిన దరఖాస్తుల జాబితాలో అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియ పురోగతిలో ఉందని తెలిపారు. ఈ నెల 26న ప్రారంభించే నాలుగు పథకాలపై 21వ తేదీ నుంచి ప్రారంభమయ్యే గ్రామసభల్లో ప్రజా అభిప్రాయాలు/ ఫీడ్ బ్యాక్‌లను తీసుకోవడంతో పాటు ఈ గ్రామ సభలు, ప్రజా పాలన సేవా కేంద్రాలలో కొత్తగా తీసుకున్న దరఖాస్తులు, ఎండీఓ కార్యాలయంలో ఇప్పటికే ఉన్న దరఖాస్తులను తగు రీతిలో పరిశీలించిన తర్వాత మాత్రమే అర్హులైన లబ్ధిదారుల తుది జాబితాను ప్రకటించనున్నట్టు మంత్రులు స్పష్టం చేశారు. అర్హులైన తుది జాబితాలను ప్రకటించడానికి ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు జారీ చేస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఇంటి స్థలం ఉన్న వారి జాబితా, ఇంటి స్థలం లేని వారి జాబితాతో కలిపి రెండు జాబితాలను గ్రామ సభల్లో ప్రదర్శించాలనీ, అలాగే కొత్తగా గ్రామ సభల్లో వచ్చే దరఖాస్తులను కూడా పరిశీలించాలని సూచించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులను ఇవ్వనున్నట్టు స్పష్టం చేశారు. రేషన్ కార్డుల మంజూరుకు దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతీ భూమికి రైతు భరోసా కల్పించనున్నట్టు తెలిపారు. గతంలో వివిధ ప్రాజెక్టులకు, రహదారులకు, ఇతర ప్రభుత్వ అవసరాలకు ప్రభుత్వం సేకరించిన భూముల వివరాలు తహసీల్దార్ల వద్ద ఉన్నాయని అన్నారు. వ్యవసాయ అధికారులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా రైతు భరోసా లబ్దిదారులను గుర్తించాలని ఆదేశించారు. ఉపాధి హామీ చట్టంలో కనీసం 20 రోజుల పాటు కూలి పనికి వెళ్లిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపజేయనున్నట్టు తెలిపారు. ప్రతీ కుటుంబంలో మహిళల బ్యాంకు ఖాతాలకే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొత్తాన్ని బదిలీ చేయనున్నట్టు స్పష్టం చేశారు. ఇటీవల రాష్ట్రంలో 156 గ్రామాలను మున్సిపాల్టీల్లో కలపగా, ఈ

కోల్ కార్మికులకు రూ. కోటి ఇన్సూరెన్స్

అధ్యక్ష పదవికి రెండు క్రియాశీల సభ్యత్వాలు తప్పనిసరి

మూసీ సుందరీకరణ చేయాల్సిందే

హైడ్రా కొత్తదేం కాదు..పాతదే

చెరువులు కబ్జా చేస్తే చర్యలు తప్పవని ముందు నుంచే ఉంది

మెట్రో ఫేస్-2కు ఆర్థిక సహాయం మా బాధ్యత

తనకు జాతీయ అధ్యక్ష పదవి అనేదానిపై పార్టీదే నిర్ణయం

ఉచితాలకు మేం వ్యతిరేకం కాదు..ఆర్థిక వనరుల ఆధారంగా హామీలుండాలి :

మీడియాతో చిట్‌చాట్‌లో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తన శాఖ పరిధిలోని ఆరు లక్షల మంది కార్మికులకు ఒక్కొక్కరికి కోటి రూపాయల ఇన్సూరెన్స్‌ను త్వరలో ఇవ్వబోతున్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. గనులు జాతీయ సంపద కాబట్టి రాష్ట్రాలకు హక్కు ఉండదనీ, త్వరలో వాటిని కేంద్రం పరిధిలోకి తీసుకుంటామని చెప్పారు. రాజకీయంగా తమ ప్రధాన శత్రువు కాంగ్రెస్ పార్టీ అని స్పష్టం చేశారు. 'మూసీ సుందరీకరణ చేయాల్సిందే. కానీ, పేదల ఇండ్లను కూలగొట్టొద్దన్నదే మా డిమాండ్. ఇప్పుడున్న కాల్వల్లో కృష్ణా, గోదావరి నీళ్లు పారించాల్సిందే. నల్లగొండ జిల్లాకు సాగునీరు అందించాల్సిందే. విధివిధానాలు, ఫ్రేం వర్క్ రూపొందించిన తర్వాత అది ఆమోదం పొందితే మూసీ సుందరీకరణకు తప్పనిసరిగా నిధులు ఇస్తాం' అని చెప్పారు. 'హైడ్రా కొత్తదేం కాదు..పేరు మారిస్తే అది కొత్త చట్టమా? చెరువులను కబ్జా చేస్తే చర్యలు తప్పవనేది ముందు నుంచే ఉంది' అని అన్నారు. తమ పార్టీలో అధ్యక్ష పదవి చేపట్టాలంటే రెండుసార్లు క్రియాశీల సభ్యత్వం పొందటం తప్పనిసరని తేల్చారు. ఆ నిబంధన ప్రకారం ఈటలకు అధ్యక్ష పదవి లేనట్టేనా అని అడగ్గా.. ఆయన ఇప్పటికే హుజూరాబాద్ బైపోల్, గజ్వేల్, హుజూరాబాద్ అసెంబ్లీ, మల్కాజిగిరి ఎంపీ ఎన్నికల్లో పోటీ చేశారు కాబట్టి ఆయన అర్హుడే అని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో కిషన్‌రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మండల, జిల్లా, రాష్ట్ర కమిటీల్లో మహిళలకు 33 శాతం పదవులు ఇవ్వబోతున్నామనీ, కొన్ని చోట్ల ఒకటెండ్రు శాతం అటూఇటూగా ఉండొచ్చని కూడా చెప్పారు. 50 శాతం కంటే ఎక్కువ మంది బీసీలకు మండల కమిటీ అధ్యక్షులుగా నియమిస్తున్నామనీ, మండలాధ్యక్షులు 45 ఏండ్లలోపు వారే ఉండాలనే నిబంధన పెట్టుకోవడంతో యువరక్తం తమకు ప్లస్ కాబోతున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ ఒంటరిగా పోటీ చేస్తామనీ, వీలైనన్ని ఎక్కువ స్థానాలు గెలుస్తామని చెప్పారు. జీతాలిచ్చేందుకే డబ్బుల్లేని కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీలను ఏ విధంగా అభివృద్ధి చేస్తుందని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీలో ఏడు నెలలుగా వీధిదీపాల ఏర్పాటుకు నిధుల కొరత ఉందన్నారు. ఢిల్లీలో బీజేపీ ఉచితాల హామీలపై ప్రశ్నించగా...ఉచిత పథకాలకు వ్యతిరేకమని తమ పార్టీ ఎప్పుడూ చెప్పలేదనీ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆధారంగా హామీలు ఇవ్వాలన్నదనే తమ విధానం అని చెప్పారు. జీఎస్టీ నిబంధనల ప్రకారమే రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తున్నామనీ, ఎక్కువ, తక్కువ ఇవ్వడం, వివక్ష చూపడం వంటిదానికి తావేలేదని స్పష్టం చేశారు. విభజన చట్టం ప్రకారమే ఏపీకి నిధులిస్తున్నామనీ, స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,445 కోట్లు ఇచ్చామని వివరించారు. తెలంగాణకు విభజన చట్టం హామీలపై అడగ్గా..ఆర్ఆర్ఆర్ ఇచ్చాం...టెక్స్‌టైల్స్ పార్కులిచ్చాం..పసుపు బోర్డు తెచ్చాం..డిఫెన్స్‌లో పెద్ద ఎత్తున నిధులు ఖర్చుపెట్టాం..అంటూ దాటవేశారు. మెట్రో తొలిదశకు రూ.1250 కోట్లు ఇచ్చామనీ, బీఆర్ఎస్ మజ్లీస్ నేతలు కలిసి అడ్డుకున్నారని విమర్శించారు.

రెండో దశకు నిధులు తెప్పించే బాధ్యత తనదే అని నొక్కి చెప్పారు. ట్రైబల్ యూనివర్సిటీకి సంబంధించిన 211 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా హ్యాండ్ ఓవర్ చేయలేదన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల అధినేత మల్క కొమురయ్య ఎమ్మెల్సీగా పోటీ చేసే అవకాశం ఎలా ఇచ్చారు? ప్రభుత్వ ఉపాధ్యాయులే పార్టీకి దొరకలేదా? అని ప్రశ్నించగా...'కరీంనగర్ స్థానం నుంచి పోటీచేసే మల్క కొమురయ్య కార్పొరేట్ వ్యక్తి కాదు విద్యాసంస్థలు పెట్టి పేదలకు విద్య అందిస్తున్నారు..దశాబ్దాలుగా విద్యారంగంలో ఉన్నారు.. మా పార్టీ క్యాండిడేట్ నియామకం మా ఇష్టం' అని దాటవేశారు. ఒన్ నేషన్..ఒన్ ఎలక్షన్‌కు కట్టుబడి ఉన్నామనీ, వచ్చే ఎన్నికల్లో సాధ్యమా? కాదా? అనేదాన్ని ఇప్పుడే చెప్పలేమని తెలిపారు.

టీచర్లపై అరాచక శక్తుల దాడులు అరికట్టాలి

హెచ్‌ఎం రాములుపై దాడికి పాల్పడ్డ వారిని శిక్షించాలి

ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలి :

సీఎస్ శాంతికుమారికి టీఎస్‌యూటీఎఫ్ వినతి

రేపు పాఠశాలల్లో నిరసన ప్రదర్శనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులపై అరాచక శక్తుల దాడులను అరికట్టాలని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్‌ఎం) కె రాములుపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరింది. పాఠశాలల్లో అరాచక శక్తుల జోక్యం పట్ల కఠినంగా వ్యవహరించి ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని సూచించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితోపాటు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణాను శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి, ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ వేర్వేరుగా కలిసి వినతిపత్రం సమర్పించారు. గతనెల 21న సాయంత్రం పాఠశాల ఆవరణలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు బోధన చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు కె రాములు మోకాలు పొరపాటున అయ్యప్పమాల వేసుకున్న విద్యార్థికి తగిలిందనే కారణంతో అదేనెల 23న ఉదయం 11 గంటల సమయంలో పాఠశాలతో ఏమాత్రం సంబంధం లేని భక్తుల ముసుగులో ఉన్న అసాంఘిక శక్తులు సుమారు 50 మంది (కొందరు అయ్యప్పమాల ధారులు, మరికొందరు ఇతరులు) చొరబడి హెచ్‌ఎం రాములుపై దాడి చేసి అసభ్యకర పదజాలంతో దూషించడంతోపాటు విచక్షణా రహితంగా కొట్టారని తెలిపారు.

ఆయన వేసుకున్న బట్టలను చింపి వేశారని పేర్కొన్నారు. ఆ విద్యార్థి కాళ్లు మొక్కించి అవమానించారని వివరించారు. ప్రధానోపాధ్యాయుని విధులకు ఆటంకం కల్పించడమే కాకుండా పాఠశాల కార్యాలయంలో ఉన్న ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారని పేర్కొన్నారు. దాడి జరిగిన రోజు ప్రధానోపాధ్యాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారనీ, దాడి చేసినవారు బెదిరించి ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకునేటట్టు చేశారని తెలిపారు. ఆ తర్వాత హెచ్‌ఎం రాములు తనకు జరిగిన అవమానాన్ని సహించలేక ధైర్యం కూడగట్టుకుని తిరిగి గతనెల 29న పహాడీషరీఫ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఎఫ్ఐఆర్ నెంబర్ 682/2024 నమోదు అయ్యిందని వివరించారు. కానీ నెల రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు నిందితులను పోలీసులు అరెస్టు చేయలేదని తెలిపారు. గతంలో నిజామాబాద్ జిల్లా కోటగిరి ఉన్నత పాఠశాలలో సైతం మతం ముసుగులో కొందరు అరాచకవాదులు మల్లికార్జున్ అనే ఉపాధ్యాయునిపై ఇదే విధంగా దాడి చేసి అవమానించారని గుర్తు చేశారు. ఇలాంటి సంఘటనలు ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు. పాఠశాలల్లో ప్రశాంత వాతావరణాన్ని భగ్నం చేస్తున్నాయని తెలిపారు. కనుక పాఠశాలల్లో ఉపాధ్యాయులపై అరాచక శక్తుల దాడులను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తుక్కుగూడ పాఠశాల హెచ్‌ఎం రాములుపై జరిగిన దాడి ఘటనకు నిరసనగా సోమవారం అన్ని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో జరిగే నిరసన ప్రదర్శనల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

నాగోబా జాతర, వసంత పంచమి ఉత్సవాలకు రండి

మంత్రి కొండా సురేఖకు దేవాదాయ శాఖ ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో నిర్వహించనున్న నాగోబా జాతరకు, నిర్మల్ జిల్లా బాసరలోని జ్ఞాన సరస్వతి దేవస్థానంలో చేపట్టనున్న వసంత పంచమి ఉత్సవాలకు రావాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను దేవాదాయ శాఖ ఆహ్వానించింది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో మంత్రి నివాసంలో ఆమెను దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, బాసర ఆలయ ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారి ఎన్. నవీన్ కుమార్, సహాయ కార్యనిర్వహణాధికారి ఆర్. సుదర్శన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆహ్వానపత్రిక అందజేశారు. జనవరి 28 నుంచి 31 వరకు నాగోబా జాతరను, ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు వసంత పంచమి ఉత్సవాలను నిర్వహించనున్నట్టు వివరించారు. ఆలయ సిబ్బంది, అర్చకులతో కలిసి బాసర జ్ఞాన సరస్వతి వసంత పంచమి ఉత్సవాల పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాసర దేవస్థానం అర్చకులు నవీన్ శర్మ, సంజయ్ ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

హార్ట్ అటాక్స్ నుంచి ప్రజలను రక్షించుకోవాలి

ప్రతి 10-20 నిమిషాల దూరంలో సీపీఆర్ సెంటర్లు ఏర్పాటు చేయాలి

ఇండో-యూఎస్ సైంటిఫిక్ కన్వెన్షన్‌లో వైద్యనిపుణులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశవ్యాప్తంగా పెరుగుతున్న హార్ట్ అటాక్ కేసుల నుంచి ప్రజలను రక్షించుకోవాల్సిన అవసరముందని పలువురు వైద్య నిపుణులు అభిప్రాయపడ్డారు. శనివారం హైదరాబాద్‌లోని ఎఐజి ఆస్పత్రిలో అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ (ఏఏపీఐ),అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ఐఎంఏ, ఎఐజీల ఆధ్వర్యంలో - ఇండో-యూఎస్ సైంటిఫిక్ కన్వెన్షన్ జరిగింది. ఈ సందర్భంగా ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ద్వారకానాథరెడ్డి, అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ వేమూరి మూర్తి, అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ (ఆపి) అధ్యక్షులు డాక్టర్ సతీష్ కత్తుల, ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ అశోక్, ఎఐజీ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ జీపీ రావు, కార్డియాలజీ డైరెక్టర్ డాక్టర్ నరసింహన్‌లు దేశంలోని ప్రజలు గుండెపోటుకు గురై సకాలంలో సీపీఆర్ అందక మరణిస్తున్న ఘటనలు ప్రమాదకరంగా మారాయని తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రతి 10-20 నిమిషాల ప్రయాణ దూరంలో దేశవ్యాప్తంగా సీపీఆర్ సెంటర్లు రావాల్సిన అవసరముందని సూచించారు. అలాగే విద్యాలయాల్లో విద్యార్థులకు, పరిశ్రమల్లో ఉద్యోగాల్లో చేరే సమయంలో ప్రతి ఒక్క ఉద్యోగికి సీపీఆర్‌పై శిక్షణ, న్యూట్రిషన్ విలువల గురించిన అవగాహన కల్పించాలని కోరారు. అమెరికన్ కాన్సులేట్ కౌన్సిల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్ మాట్లాడుతూ ఇండో-అమెరికన్ శాస్త్ర సాంకేతిక భాగస్వామ్యం, ప్రజల ఆరోగ్యం, వాతావరణ మార్పులు, స్థిరమైన అభివృద్ధి వంటి గ్లోబల్ సమస్యలను పరిష్కరించడానికి దోహదపడు తుందని తెలిపారు.

సైఫ్‌పై దాడి కేసు నిందితుడు చిక్కాడు

- ఛత్తీస్‌గఢ్‌లో పట్టుకున్న రైల్వేపోలీసులు



ముంబయి: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్‌లో అతడిని గుర్తించిన రైల్వే పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. జ్ఞానేశ్వరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా నిందితుడిని పట్టుకుని, వీడియో కాల్ ద్వారా ముంబయి పోలీసులతో మాట్లాడి, అతడేనని ధ్రువీకరించుకున్నారు. రైల్వే పోలీసుల అదుపులో ఉన్న నిందితుడిని తీసుకొచ్చేందుకు ముంబయి పోలీసులు బయలుదేరి ఛత్తీస్‌గఢ్‌కు వెళ్తున్నారు.

గురువారం సైఫ్‌పై ఈ దాడి ఘటన చోటుచేసుకుంది. సైఫ్, అతడి కుటుంబసభ్యులు నిద్రలో ఉండగా.. ఇంట్లోకి చొరబడిన దుండగుడు చోరీకి యత్నించాడు. సైఫ్ అడ్డుకునేందుకు ప్రయత్నించగా దాడి చేసి పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ముంబయి పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

ఆయన సైఫ్ అని తెలీదు : ఆటో డ్రైవర్



తన ఆటోలో లీలావతి ఆస్పత్రికి తరలించిన వ్యక్తి బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ అనే విషయం తనకు తెలియదని డ్రైవర్ భజన్ సింగ్ చెప్పారు. ఖర్ (ఈస్ట్)లోని పైప్‌లైన్ రోడ్డులో ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న భజన్ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ రక్తస్రావంతో గాయపడిన వ్యక్తిని దగ్గరి దారిలో ఆస్పత్రికి తీసికెళ్లి ప్రాణాలు కాపాడేలా చేయాలన్నదే తన ఆలోచన అని, ఆయన ఓ సెలబ్రిటీ అనే విషయం తనకు అప్పుడు తెలియదని చెప్పారు. ఆటోలో సైఫ్ స్పృహలోనే ఉన్నారని, ఆస్పత్రికి చేరుకోవడానికి ఎంత సమయం పడుతుందని పదే పదే ప్రశ్నించారని తెలిపారు. 'రెండు నిమిషాలు పడుతుందని నేను చెప్పాను. సైఫ్ వెంట ఆయన కుమారుడు తైమూర్, సహాయకుడు హరి ఉన్నారు. ఆయన భయపడడం లేదు. అయితే ఆయన బట్టలన్నీ రక్తంతో తడిసిపోయాయి. తీవ్రంగా గాయపడిన ఆ వ్యక్తి బాలీవుడ్ నటుడని మొదట్లో నాకు తెలీదు. సాధ్యమైనంత త్వరగా లీలావతి ఆస్పత్రికి చేరుకోవాలన్నదే నా లక్ష్యం. వారు అలాంటి అత్యవసర పరిస్థితిలో ఉన్నారు. ఆటో బీవర్జీ అడగకుండా నన్ను అడ్డుకున్నారు కూడా. వాస్తవమేమంటే...అలాంటి పెద్ద నటుడు నా వాహనంలో కూర్చోవడమే నాకు పెద్ద సంతృప్తి' అని భజన్ సింగ్ వివరించారు.

ఉద్యోగ విరమణ వయస్సు పెంపు ఆలోచన విరమించుకోవాలి : డీటీఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉద్యోగ విరమణ వయస్సు పెంపుపై మీడియాలో వస్తున్న ప్రచారంపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనివ్వాలని డీటీఎఫ్ డిమాండ్ చేసింది. ఒక వేళ పెంచే ఆలోచన ఉంటే విరమించుకోవాలని కోరింది. ఈ మేరకు డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల ఉద్యోగ విరమణ వయస్సు 61 ఏండ్ల నుంచి 63 ఏండ్లకు పెంచనున్నారంటూ మీడియాలో విస్తృతంగా వార్తలు వస్తున్నాయని తెలిపారు. ఒకవేళ ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉంటే వెంటనే విరమించుకోవాలని కోరారు. గత ప్రభుత్వం 58 నుంచి 61 ఏండ్లకు పెంచడం ద్వారానే అనేక మంది నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని తెలిపారు. వేలాది మంది ఉపాధ్యాయ ఉద్యోగులకు పదోన్నతుల అవకాశాలు దెబ్బతిన్నాయని వివరించారు. వయస్సు రీత్యా ఉద్యోగులకు అనారోగ్య సమస్యలు, పనిలో మందకొడితనం వంటి అనేక సమస్యలు ఉత్పన్నమయ్యాయని పేర్కొన్నారు. ఇలాంటి సమస్యలను సరిదిద్దాల్సిందిపోయి మళ్లీ ఉద్యోగ విరమణ వయస్సు పెంపు ప్రయత్నాలు సరికాదని తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు ఇవ్వాల్సిన వివిధ చెల్లింపుల భారం తగ్గించుకోవడం వంటి కారణాలతో ఈ నిర్ణయం తీసుకుంటే అది భవిష్యత్తు తరాలకు గొడ్డలిపెట్టు వంటిది అవుతుందని హెచ్చరించారు.

హెచ్‌ఎం రాములుపై దాడి చేసిన దుండగులను శిక్షించాలి

- రేపు బడుల్లో నల్లబ్యాడ్జీలతో టీచర్ల నిరసన : ఉపాధ్యాయ సంఘాల పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు (హెచ్‌ఎం) కంబాలపల్లి రాములుపై గతనెల 23న కొందరు వ్యక్తులు బడిలోకి చొరబడి విచక్షణా రహితంగా మూకదాడికి పాల్పడటాన్ని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఆ దాడిని నిరసిస్తూ సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చాయి. ఈ మేరకు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, పుల్గం దామోదర్‌రెడ్డి (పీఆర్టీయూటీఎస్), చావ రవి, ఎ వెంకట్ (టీఎస్‌యూటీఎఫ్), ఎం పర్వత్‌రెడ్డి, జి సదానందం గౌడ్ (ఎస్టీయూటీఎస్) , సిహెచ్ అనిల్ కుమార్, నన్నెబోయిన తిరుపతి (టీపీటీఎఫ్), ఎం సోమయ్య, టి లింగారెడ్డి (డీటీఎఫ్), ఎస్ యాదగిరి, ఈ రవీందర్ (బీటీఎఫ్) ఆర్ రాజగంగారెడ్డి, ఎస్ గిరిధర్ గౌడ్ (టీఎస్‌జీహెచ్‌ఎంఏ), కటకం రమేష్, ఎం అంజిరెడ్డి (టీఆర్టీఎఫ్), మణిపాల్ రెడ్డి, ఆదర్శన్ రెడ్డి (టీటీయూ), కొమ్ము రమేష్, సైదులు (బీటీఎఫ్), కొంగల వెంకట్, చవాన్ సుభాన్, కిషన్ నాయక్, గిరిమల్ల చిట్టిబాబు, సత్యనారాయణ, ప్రభాకర్, శాగ కైలాసం, అంజయ్య, దానయ్య (ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘాలు), కె మహిపాల్ రెడ్డి, ఏ వెంకటేశం (ఎస్టీటీయూ), జగదీష్, నర్సింలు (ఆర్‌యూపీపీటీఎస్), ఉమాకర్ రెడ్డి, పార్వతి సత్యనారాయణ (పీఆర్టీయూ తెలంగాణ), ఎండి అబ్దుల్లా, కాంతి కృష్ణ (టీఆర్‌యూపీపీ), కె కృష్ణుడు, లక్ష్మణ్ గౌడ్ (టీసీటీపీఏ), సిహెచ్ రాజిరెడ్డి, అబ్దుల్లా (టీఎస్టీయూ), చైతన్య, గంగరాజు (బీటీఏ), మామిడి నారాయణ, మధుసూదన్ (గురుకుల జేఏసీ), ఆర్ వెంకటేశ్వర్లు, లచ్చుమల్ల వెంకన్న తదితరులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులకు రక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాలలను కుల, మత, వర్గ రహిత కేంద్రాలుగా ఉండేటట్టు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని అన్ని రకాల పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగుల పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి

- ఉప ముఖ్యమంత్రి భట్టికి పీఆర్టీయూటీఎస్ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని పీఆర్టీయూటీఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని సచివాలయంలో శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆ సంఘం అధ్యక్షులు, ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఏడాది కాలంగా ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు, జీపీఎఫ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, టీఎస్‌జీఎల్‌ఐ, సరెండర్ లీవులు, వేతన బిల్లులు, సప్లిమెంటరీ బిల్లులు, రెగ్యులర్ వేతన బిల్లులను చెల్లించాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారనీ, పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

ఎలక్ట్రిక్ బస్సులపై చర్చించని ఆర్టీసీ బోర్డు

- పొంచిఉన్న ప్రయివేటీకరణ ముప్పు
- కొత్త డిపోలు, బస్టేషన్లకు అనుమతి
- ఆర్టీసీ సొంత బస్సులపై స్పష్టత కరువు
- 'మమ' అనిపించిన పాలకమండలి సమావేశం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ)లో ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశం, దాని పర్యవసనాలు, సంస్థ మనుగడ, కోల్పోతున్న ఉద్యోగాలు వంటి అంశాలపై పాలకమండలి (బోర్డు) సమావేశంలో ఎలాంటి చర్చ జరగలేదు. ఆర్టీసీనే సొంతంగా ఎలక్ట్రిక్ బస్సుల తయారీ, నిర్వహణపైనా చర్చ జరగలేదు. ప్రయివేటుగా ఆర్టీసీలోకి వస్తున్న ఎలక్ట్రిక్ అద్దె బస్సుల పార్కింగ్ కోసం కొత్త డిపోలు, కొత్త బస్టేషన్లను నిర్మించేందుకు బోర్డు ఆమోద ముద్రవేసింది. శనివారంనాడిక్కడి బస్‌భవన్‌లో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఆర్టీసీ పాలకమండలి సమావేశం జరిగింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ సహా డైరెక్టర్లు, రవాణాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మహాలక్ష్మి పథకం వల్ల ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగిందనీ, దానికి అనుగుణంగా కొత్త బస్టేషన్ల నిర్మాణంతో పాటు ఉన్నవాటిని విస్తరించాలని నిర్ణయించారు. పైకి మహాలక్ష్మి కారణాన్ని చెప్తున్నా...అంతర్గతంగా సంస్థలోకి కొత్తగా వస్తున్న ప్రయివేటు ఎలక్ట్రిక్ బస్సుల కోసమే ఈ విస్తరణ అని ప్రచారం జరుగుతున్నది. అయితే ఈ విషయంపై రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. రాష్ట్రంలో కొత్త డిపోల ఏర్పాటుతో పాటు ప్రస్తుతమున్న 97 డిపోలు, బస్టేషన్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. రాష్ట్ర ప్రజలకు రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా కొత్త బస్సులు కొనుగోలు చేస్తూనే, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెడతామన్నారు. బోర్డు అనుమతి లభించిన నూతన డిపోలు, బస్టేషన్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారుల్ని ఆదేశించారు.

పెద్దపల్లి జిల్లా, పెద్దపల్లిలో కొత్త బస్ డిపో నిర్మాణం కోసం రూ.11.70 కోట్లు కేటాయిస్తూ బోర్డు ఆమోద ముద్ర వేసింది. ములుగు జిల్లా ఏటూరునాగారంలో కొత్త బస్ డిపో నిర్మాణం కోసం రూ.6.28 కోట్లు, ములుగులో కొత్త బస్టేషన్ నిర్మాణం కోసం రూ. 5.11 కోట్లు, మంగపేటలో కొత్త బస్టేషన్ నిర్మాణం కోసం రూ.51 లక్షలు, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో కొత్త బస్ స్టేషన్ కోసం రూ. 3.75 కోట్లు, కోదాడలో కొత్త బస్టేషన్ నిర్మాణం కోసం రూ.17.95 కోట్లు, ఖమ్మం జిల్లా మధిరలో కొత్త బస్ స్టేషన్ నిర్మాణం కోసం రూ.10 కోట్లు, పెద్దపల్లి జిల్లా మంథని బస్టేషన్ విస్తరణ కోసం రూ.95 లక్షలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో బస్టేషన్ నిర్మాణం, రానున్న 'సరస్వతి పుష్కరాలు' కోసం రూ.3.95 కోట్లు కేటాయిస్తూ ఆర్టీసీ పాలకమండలి అనుమతులు ఇచ్చింది.

కబ్జారాయుళ్లను వదిలిపెట్టం

హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జగద్గిరిగుట్టలో పర్యటన
- శ్రీవారి ఆలయ భూముల కబ్జాలపై పరిశీలన
- పరికి చెరువును కాపాడాలని పలు పార్టీ నేతల వినతి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కబ్జారాయుళ్లను వదిలిపెట్టే ప్రసక్తే లేదని హైడ్రా కమిషనర్ ఏవి.రంగనాథ్ అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ పరిధి సర్వే నెంబర్ 348/1లోని జగద్గిరిగుట్టపై కొండకిరువైపులా ఉన్న ఆలయ భూముల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో శనివారం కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. శ్రీవారి ఆలయ ప్రాంగణంలో గల గోవిందరాజుల స్వామి ఆలయ కొలను కబ్జా అవుతున్నట్టు పూజారి నరహరిశర్మ సోషల్ మీడియా ద్వారా వీడియోలు పోస్ట్ చేశారు. దాంతో హైడ్రా కమిషనర్ వివిధ విభాగాల అధికారులతో పర్యవేక్షించారు. సమీపంలో ఉన్న పరికి చెరువు కబ్జాపై కూడా స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకురావడంతో ఆ ప్రాంతాన్ని, ఆలయ సముదాయాలను, ప్రభుత్వ భూములను అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ మాట్లాడుతూ.. 2024 జులైలో హైడ్రా ఏర్పాటైందని, అంతకు ముందు నిర్మించిన నివాసుల జోలికి హైడ్రా వెళ్లదని స్పష్టం చేశారు. హైడ్రా ఏర్పడిన తర్వాత జరిగిన కబ్జాలపై మాత్రం తప్పక చర్యలు ఉంటాయని తెలిపారు. కుల సంఘాల పేరిట ఆలయ భూములను కబ్జా చేసి సొంతంగా వాడుకోవడాన్ని తీవ్రంగా పరిగణించారు. సదరు కుల సంఘాల పేరిట కబ్జా చేసి ప్లాట్లు చేసి అమ్ముకుంటున్నారని వస్తున్న వార్తలపై సీరియస్ అయ్యారు. గూగుల్ మ్యాప్ పరిశీలించి కబ్జాలను గుర్తిస్తామన్నారు. వచ్చే బుధవారం జగద్గిరిగుట్ట ఆలయ భూములతో పాటు పరికి చెరువు కబ్జాలపై స్థానికులతో హైడ్రా కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. పరికి చెరువు పరిరక్షణ కోసం ఒక గ్రూప్ తయారు చేసి ఎప్పటికప్పుడూ చెరువు పూడ్చివేతపై సమాచారం ఇవ్వాలని కోరారు. పరికి చెరువును బాలకృష్ణ అనే వ్యక్తి కబ్జా చేస్తున్నాడని పలువురు కమిషనర్ దృష్టికి తీసుకురాగా.. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కబ్జాదారులకు నోటీసులు పంపిస్తామన్నారు. 15 రోజుల్లో హైడ్రా పోలీస్ స్టేషన్ పనులు మొదలు కానున్నాయన్నారు. కబ్జాదారులపై నాన్ బెయిలబుల్ కేసులు పెడతామని హెచ్చరించారు. దీంతోపాటు స్థానిక సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్టు చెప్పారు. అన్ని ఆధారాలతో హైడ్రా కార్యాలయానికి వచ్చి అందజేయాలని సూచించారు. ఎలాంటి ఒత్తిడులు వచ్చినా తగ్గేదే లేదని, కబ్జాదారులను జైలుకు పంపించడం ఖాయమని అన్నారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జగద్గిరిగుట్ట సీఐ కేతూరి నరసింహ, ఎస్‌ఐ శంకర్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్, శ్రీవారి ఆలయ చైర్మెన్ కె.నరేందర్ రెడ్డి, బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జెకె.శేఖర్ యాదవ్, నాయకులు మేకల సురేష్‌రెడ్డి, సిరుసాని మహేందర్, అరుణ్, పిల్లి ఆంజనేయులు, యాదగిరి, వంశీ, సాయికుమార్ పంతుల, కె.మహేష్,రాయి విగ్నేష్ ఉన్నారు.

అంతా అదానీ గ్రూపు కనుసన్నల్లోనే..

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న వారిని మాత్రమే అభిప్రాయ సేకరణకు ఆహ్వానించి వారితో సమ్మత జపం చేయించుకుంది. ప్రశ్నించేందుకు సిద్ధమైన సీపీఐ(ఎం), ప్రజాసంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్లోనే ఉంచారు. ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి అయ్యేవరకు వారిని స్టేషన్లో ఉంచి ఆ తర్వాత విడుదల చేశారు. వందలాది మంది పోలీసు బందోబస్తు నడుమ ప్రజాభిప్రాయ సేకరణ చేసి ప్రశాంతంగా ముగిసిందని ప్రకటించుకున్నారు.

నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని గణేష్‌పాడు వద్ద గల పెన్నా సిమెంట్ (అంబుజా) కంపెనీ గనుల విస్తరణ, సున్నపురాయి ఉత్పత్తి పెంపుపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో శనివారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించింది. 2002లో పెన్నా సిమెంట్స్‌ను నెలకొల్పగా నాలుగు నెలల కిందట ఈ ప్లాంట్‌ను అదానీ గ్రూప్ కొనుగోలు చేసింది. అనధికారికంగా గనుల విస్తరణ జరిగినప్పటికీ వివిధ కారణాల వల్ల పీసీబీ ప్రజాభిప్రాయ సేకరణను రెండుసార్లు వాయిదా వేశారు. ప్రభుత్వానికి ఫిర్యాదులు చేయడంతో పరిశ్రమ సమీపంలో అధికారులు సమావేశాన్ని నిర్వహించి ప్రజల అభిప్రాయాలు స్వీకరించారు. అభిప్రాయాలు తెలిపిన వారిలో ఒక్కరు కూడా ఆ కంపెనీ వల్ల జరిగే నష్టాలను, వ్యర్థాలను, ప్రజలకు కలిగే హానిని ప్రస్తావించకపోవడం విశేషం.

సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం శూన్యపహాడ్ పరిధిలో 50 హెక్టార్లలో మైనింగ్ లీజు ఉంది. అయితే గణేష్‌పాడు పరిధిలో 304 హెక్టార్ల భూమిలో సున్నపురాయి గనులను విస్తరించి ఉత్పత్తి సామర్థ్యాన్ని ఏడాదికి 1.5మిలియన్ టన్నుల నుంచి 1.8 మిలియన్ టన్నులకు పెంచేందుకు అనుమతి కోసం పరిశ్రమ యాజమాన్యం దరఖాస్తు చేసుకుంది. దానికోసం శనివారం భారీ పోలీసు బందోబస్తు నడుమ గణేష్‌పాడులో పెన్నా(అంబుజా) సిమెంట్ పరిశ్రమ కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. కాగా, లగచర్లలో ఫార్మాసిటీకి వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంతోపాటు ఇటీవల రామన్నపేటలో అదానీ గ్రూప్ నూతన పరిశ్రమ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణలో ఏర్పడిన ఉద్రిక్తతలను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సూర్యాపేట, నల్లగొండ జిల్లాల ఎస్పీలు సన్‌ప్రీత్ సింగ్, శరత్ చంద్రపవార్ ఆధ్వర్యంలో ఐదుగురు డీఎస్పీలు, పదిమంది సీఐలు, 30 మంది ఎస్‌ఐలతో కూడిన సుమారు 500 మంది పోలీసులు మోహరించారు.



ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలి- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

పరిశ్రమ యాజమాన్యం సమీప గ్రామాల ప్రజల మౌలిక వసతులకు పూర్తి స్థాయిలో కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చెప్పారు. పెన్నా(అంబుజా) సిమెంట్ పరిశ్రమ ప్రజాభిప్రాయ సేకరణలో ఆయన మాట్లాడారు. మండలంలోని గణేష్‌పాడు, వాడపల్లి, శూన్యపాడు గ్రామాల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి సీఎస్ఆర్ నిధులతో విద్యుత్, తాగునీరు, విద్య, వైద్యం తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం పరిశ్రమ యాజమాన్యం నడుచుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా కాలుష్యరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. తాగునీరు కల్పించాలని కోరగా.. పరిశ్రమ యాజమాన్యం అన్ని వసతులూ కల్పిస్తామని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చింది. సభలో 12 మంది తమ అభిప్రాయాలు తెలపగా, 50 మంది లిఖితపూర్వకంగా అభిప్రాయాలను అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాసులు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ విజయలక్ష్మి, సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిర్బంధించారు...! సామాజిక కార్యకర్త నక్క శ్రీనివాస్

హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ పెన్నా సిమెంట్ యాజమాన్యానికి తలొగ్గి పోలీసులు తనను అక్రమంగా నిర్బంధించారని సామాజిక కార్యకర్త నక్క శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దామరచర్ల మండలం గణేష్‌పాడు వద్ద నెలకొల్పిన పెన్నా సిమెంట్స్ యాజమాన్యం చేస్తున్న అక్రమాలపై శూన్యంపాడు గ్రామానికి చెందిన స్థానికుడినైన తాను ఏండ్ల తరబడి పోరాటాలు చేస్తున్నానని చెప్పారు. కోర్టులో కేసు వేసి న్యాయపోరాటం చేస్తున్నానని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా పెన్నా సిమెంట్స్‌ను కొనుగోలు చేసిన అదానీ గ్రూప్ గనుల విస్తరణ కోసం ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో తన వాదనలు, అభిప్రాయాలూ వినాలని, వాటిపై తనకు పూర్తి వివరాలు అందజేయాలని, వాటిని రికార్డు చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్పష్టంగా ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ పట్టించుకోలేదన్నారు. ప్రజాస్వామ్యంలో కోర్టు ఉత్తర్వులను అమలు చేయాల్సిన వారే బేఖాతరు చేయటం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై తాను మళ్లీ హైకోర్టును ఆశ్రయించనున్నట్టు తెలిపారు.

ముందస్తు అరెస్టులు సరికాదు



ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా ముందస్తు అరెస్టులు చేయడం సరికాదని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి మాలోతు వినోద్ నాయక్ అన్నారు. తెల్లవారుజామున ఆయనతోపాటు సీఐటీయూ నాయకులు దయానందం, సీపీఐ(ఎం) నాయకులు ఎర్ర నాయక్‌ను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో పెన్నా సిమెంట్స్ యాజమాన్యం చెప్పిన మాటలు నీటి మూటలై కృష్ణానదిలో తేలుతున్నాయని ఎద్దేవా చేశారు. ఇప్పుడు పరిశ్రమ గనుల విస్తరణకు ఈ ప్రాంత ప్రజలకు అనేక రకాల మాయమాటలు చెప్పి.. ఎక్కడా గ్రామ సభ పెట్టకుండా, అవగాహన కార్యక్రమాలు నిర్వహించకుండా ప్రజాభిప్రాయ సేకరణ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. పరిశ్రమలో పనిచేస్తున్న లోకల్ ఉద్యోగులను వేరే ప్రాంతానికి మార్చాలని ఆలోచన చేస్తున్నారని విమర్శించారు. అలా చేస్తే పరిశ్రమ గేటు వద్ద పోరాటాలు చేసేందుకు వెనకాడబోమని హెచ్చరించారు.

గాంధీ ఆస్పత్రికి ఆండాలి మృతదేహం అప్పగింత

- సంతాపం తెలిపిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింగరావు, పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-కాప్రా



సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఎండీ అండాలి(82) శుక్రవారం అనారోగ్యంతో కన్నుమూసిన సంగతి తెలిసిందే. శనివారం వారి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి దానం చేశారు. అంతకుముందు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డాక్టర్ ఏఎస్ రావు నగర్‌లోని స్వగృహంలో ఆయన భౌతిక ఖాయాన్ని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నర్సింగరావు, పాలడుగు భాస్కర్‌లు సందర్శించి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండాలి అనేక పోరాటాలలో పాల్గొని నేడు జనవిజ్ఞాన వేదికలో పనిచేస్తూ మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన అందరికీ ఆదర్శప్రాయాలనీ, ఆయన మృతి పార్టీకి తీరనిలోటన్నారు. అనంతరం అండాలి మృతదేహాన్ని ఊరేగింపుగా ఏఎస్‌రావు నగర్‌లో ప్రదర్శన జరిపి గాంధీ హాస్పిటల్‌కు ప్రయోగాల నిమిత్తం కుటుంబ సభ్యులు దానం చేశారు.



ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణపై లోకేష్ అసంతృప్తి

- సొంత నిధులతో మరమ్మతులకు నిర్ణయం
- వర్థంతి నేపథ్యంలో పలువురి నివాళి
- తెలంగాణలో టీడీపీ పున:నిర్మాణం : లోకేష్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ నిర్వహణపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించేందుకు ఎన్టీఆర్ ఘాట్‌కి లోకేష్ వెళ్లారు. ఘాట్ గోడలు, పైకప్పు పెచ్చులూడిపోవడం, గార్డెన్‌లో ఏర్పాటు చేసిన లైట్లు విరిగిపడి ఉండటాన్ని పరిశీలించారు. అవసరమైన అనుమతులు తీసుకుని వీలైనంత త్వరగా ఘాట్ మరమ్మతులు సొంత నిధులతో చేపట్టాలని నిర్ణయించారు. వెంటనే పనులు ప్రారంభించాలని తన సిబ్బందిని ఆదేశించారు. ఘాట్ నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన హెచ్‌ఎండీఏ తీరు పట్ల ఎన్టీఆర్ అభిమానులు సైతం శనివారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘాట్ నిర్వహణ బాధ్యతలను ఎన్టీఆర్ ట్రస్ట్‌కు అప్పగించాలని పలుమార్లు గత తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని లోకేష్ తెలిపారు.

భారతరత్న వస్తుంది :లోకేష్

ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పలువురు నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ మనవడు, ఏపీ మంత్రి నారా లోకేష్‌తోపాటు ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ఘాట్ వద్ద నివాళి అర్పించారు. నాయకుడిగా, సీఎంగా ప్రజలకు ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు. అనంతరం లోకేష్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ప్రభంజనంతో టీడీపీని అధికారంలోకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. అనేక సంస్కరణలు తెచ్చారని అభిప్రాయపడ్డారు. టీడీపీలో కోటి మంది సభ్యత్వాలు తీసుకోవడం గర్వకారణమని వ్యాఖ్యానించారు. తెలుగుజాతి ఎక్కడ ఉన్నా అగ్రస్థానంలోకి ఎదగాలని ఆకాంక్షించారు. 'ఎన్టీఆర్ రాజకీయాల్లో మహానాయకుడిగా రాణించారు. ఎన్టీఆర్ అనేది ఒక పేరు కాదు. ఒక ప్రభంజనం. రెండు రూపాయలకు కిలో బియ్యం, మహిళలకు ఆస్తుల్లో సమాన వాటా తదితర సంస్కరణలను తీసుకొచ్చారు. ఆయనకు తప్పనిసరిగా భారతరత్న వస్తుందని ఆశిస్తున్నాం. తెలుగు ప్రజల కోసం అహర్నిశలు పనిచేస్తాం. విశాఖ ఉక్కును కాపాడుకుంటున్నాం. తెలంగాణలో పార్టీ పునర్నిర్మాణంపై చర్చిస్తున్నాం. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం. తెలంగాణలో 1.60 లక్షల మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. టీడీపీపై తెలంగాణ ప్రజలకు పేమ, ఆశ ఉంది' అని వ్యాఖ్యానించారు.

బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్

ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు నందమూరి బాలకృష్ణ, రామకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్‌రామ్ నివాళి అర్పించారు. నటుడిగా, నాయకుడిగా, సీఎంగా ఆయన సేవలను గుర్తు చేశారు. బసవతారకం ఆస్పత్రిలోనూ బాలకృష్ణ ఎన్టీఆర్‌కు నివాళి అర్పించి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నటనలో ప్రయోగాలు చేసిన నటనా ప్రావీణ్యుడు ఎన్టీఆర్ అని బాలకృష్ణ తెలిపారు. ఆయన విప్లవాన్ని తీసుకొచ్చారని అన్నారు. కష్టజీవులు కన్నీళ్లు, అన్నార్తుల ఆకలి నుంచి టీడీపీ పుట్టిందన్నారు. పేదలకు ఉపయోగపడే పథకాలను ఎన్టీఆర్ ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. ఆయన అంటేనే నటనకు నిర్వచనం, నవరసాలకు అలంకారమని కొనియాడారు. ఆయన ఒక వర్సిటీ, జాతికి మార్గదర్శకమని చెప్పారు. ఎన్టీఆర్ అంటే యువతకు ఆదర్శం. నాడు 330కిపైగా తాలుకాలను 1000కి పైగా మండలాలుగా విభజించి పాలనను క్షేత్రస్థాయికి చేర్చారని చెప్పారు.

ట్రస్టు ద్వారాసేవలు: భువనేశ్వరి

ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానటుడు ఎన్టీఆర్ అని నారా భువనేశ్వరి అన్నారు. రాజకీయ రంగంలో ఆయన చెరగని ముద్ర వేశారని చెప్పారు. ఎన్టీఆర్ ప్రజలకు చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని గుర్తు చేశారు. ఆయన సేవలను ముందుకు తీసుకెళ్లేందుకు ఎన్టీఆర్ ట్రస్టును ఏర్పాటు చేసినట్టు గుర్తు చేశారు. దీనిద్వారా పలు సేవల కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్టు చెప్పారు. ఎన్టీఆర్ సిద్ధాంతాలను ట్రస్టు పాటిస్తున్నది. ఆయన వర్థంతికి ఏటా లెజెండరి బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహిస్తున్నాం. మీరు ఇచ్చే ప్రతి రక్తపు బొట్టు, మరొకరి జీవితంలో సంతోషాన్ని ఇస్తుందన్నారు.

మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు కింద వేతనాలివ్వాలి

- ఉప ముఖ్యమంత్రి భట్టికి పీఎంటీఏటీఎస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలను చెల్లించాలని పీఎంటీఏటీఎస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను శనివారం హైదరాబాద్‌లో పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డితో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తరాల జగదీశ్ కలిసి వినతిపత్రం సమర్పించారు. 010 పద్దు కింద వేతనాలు చెల్లించే దస్త్రాన్ని త్వరితగతిన ప్రభుత్వం ఆమోదించేలా చూడాలని కోరారు. నోషనల్ సర్వీస్ కల్పించాలని తెలిపారు. డీఏ బకాయిలు చెల్లించాలని పేర్కొన్నారు. 28 మంది మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు మరణించారనీ, వారి కుటుంబాలకు సీపీఎస్ డెత్ గ్రాట్యుటీ, కుటుంబ పెన్షన్ వెంటనే అందించాలనీ, కారుణ్య నియామకాలను చేపట్టాలని వివరించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దుపై తగు చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

మత్స్యకారులపై కేంద్రం వివక్ష

- ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్
- మత్స్య మహిళల జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-మెహిదీపట్నం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణలోని మత్స్యకారులపై వివక్ష చూపుతోందని ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ అన్నారు. ఫిబ్రవరి 8న హైదరాబాద్‌లో జరిగే మత్స్య మహిళల జాతీయ సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను శనివారం మాసబ్‌ట్యాంక్‌లోని మత్స్య శాఖ రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమయ్యే మత్స్య మహిళల జాతీయ సదస్సు నగరానికి గర్వకారణం అని చెప్పారు. సదస్సుకు మంత్రులు సీతక్క, కొండ సురేఖ, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. తెలంగాణ నలుమూలల నుంచి పెద్దఎత్తున మహిళా మత్స్యకారులు హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు. దేశంలోనే ముఖ్యమైన ఎస్ఎఫ్‌డీపీ, ఎన్‌సీడీసీలకు కేంద్రం నిధులు కేటాయించడం లేదన్నారు. ఎన్‌సీడీసీకి ఇవ్వాల్సిన నిధులు రద్దు చేశారని, దాని వల్ల వేలాది మంది మత్స్యకారులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎన్‌సీడీసీ స్కీమ్‌ను పునరుద్ధరించాలని, ఎస్ఎఫ్‌డీపీకి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఏఐఎఫ్ఎఫ్‌డబ్ల్యూఎఫ్ జాతీయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ మాట్లాడుతూ.. దేశంలో లక్షలాది మంది మత్స్య మహిళలు చేపలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారని చెప్పారు. కానీ వారికి చేపల మార్కెట్లలో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్లలో సరైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సదస్సు జయప్రదం కావడానికి మత్స్యకార పెద్దలు, శ్రేయోభిలాషులు సహకరించాలని కోరారు. మత్స్య మహిళా ఆర్గనైజింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ కొప్పు పద్మ మాట్లాడుతూ.. మత్స్య మహిళలకు దేశవ్యాప్తంగా ఒకే సంక్షేమ విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార్మిక సంఘం మహిళా ఆర్గనైజింగ్ రాష్ట్ర కో కన్వీనర్ బక్కి బాలమణి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోకన్వీనర్ కర్రెల్లి నవనీత, హైదరాబాద్ జిల్లా డైరెక్టర్ కాడబోయని అరుణ, శ్రీను స్వరూప, గౌటి అరుణ తదితరులు పాల్గొన్నారు.

'నేడు కుల, ప్రజా సంఘాలతో సమావేశం'

నవతెలంగాణ - ఎల్బీనగర్

కర్మన్‌ఘాట్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అన్ని కుల సంఘాలు, ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహించనున్నట్టు ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జి బత్తిన సుధాకర్ మాదిగ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ రిజర్వేషన్లు, వర్గీకరణ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ నియోజవర్గంలో అన్ని ప్రజా సంఘాలు, బీసీ సంఘాలతో ఈ నెల 19న ఆదివారం(నేడు) ఉదయం 10 గంటలకు నుండి 4 గంటలకు కర్మన్ ఘాట్‌లోని గ్రీన్ పార్క్ కాలనీ కమాన్‌లో ఉన్న శిల్పి గ్రాండ్ కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం నిర్వహిస్తున్నట్లు బత్తిన సుధాకర్ మాదిగ వివరించారు. ఈ సమావేశంలో ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇచ్చే ఎల్బీనగర్‌లోని అన్ని కుల సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు.

వడ్డెర సంఘం నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-హయత్ నగర్

భరత్ నగర్ ఫేజ్ 1, 2, రాజీవ్ గాంధీ నగర్, ఎన్‌టీఆర్ నగర్ వడ్డెర సంఘం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. వడ్డెర సంఘం నూతన కమిటీ అధ్యక్షుడుగా శివరాత్రి అశోక్, ఉపాధ్యక్షుడుగా మాదరం ఎల్లయ్య, కమిటీ సభ్యులుగా లింగయ్య, సంతోష్, వెంకన్న, రవి, యాదగిరి, వినోద్, వీరయ్య, రాజు, అంజయ్య, బాలరాజు నియామకం అయ్యారు అనంతరం నూతన కమిటీ సభ్యులను కాలనీ అధ్యక్షుడు మామిడి రామ్ చందర్ కలిసి, శాలువాలతో సత్కరించారు.

'22న జరిగే ధర్నాను జయప్రదం చేయండి'



నవతెలంగాణ-హస్తినాపురం

ఈ నెల 22న చలో జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ హస్తినాపురం చౌరస్తాలో జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య శనివారం కార్మికులతో కలిసి కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీహెచ్ఎంసీ మున్సిపల్ కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. బయోమెట్రిక్ హాజరు పట్టికలో జరుగుతున్న అవకతవకలను అరికట్టాలని, జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సిబ్బందిని హైకోర్టు తీర్పు ప్రకారం పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పారిశుద్ధ్య సేవలో ప్రైవేటీకరణ చర్యలను ఉపసంహరించుకోవాలని, రామ్కీ తదితర ప్రైవేట్ ఇంజనీరింగ్ కంపెనీలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. జీహెచ్ఎంసీ సూపర్వైజర్లకు ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలను రూ.35 వేలకు పెంచాలని పెట్రోల్ అలవెన్స్ ఇవ్వాలన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథ కాన్ని ప్రవేశపెట్టాలని, దహన సంస్కారాలకు రూ.30000 ఇవ్వాలన్నారు. స్వచ్ఛ ఆటో కార్మికులను మున్సిపల్ కార్మికులుగా గుర్తించి, వారి సేవలను కొనసాగించాలని, ఆదివారాలు పండగలు సందర్భంగా అందరికీ వర్తించేలా సెలవులు ఇవ్వాలన్నారు. ఈ నెల 22వ తేదీన హెడ్ ఆఫీస్ ట్యాంక్ బండ్ దగ్గర జరిగే ధర్నాలో కార్మికులం దరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీను, భాగ్యమ్మ, లక్ష్మి, రేణుక, ముత్తమ్మ, చంద్రమ్మ, ముత్యాలమ్మ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ఏర్పాట్లపై నిర్లక్ష్యం వద్దు

- బ్యాంకులు భద్రతా ఏర్పాట్లను సమీక్షించుకొని మెరుగుపరుచుకోవాలి
- టెక్నాలజీతో బ్యాంకు దోపిడీలు, దొంగతనాలను నివారించవచ్చు
- రాచకొండ సీపీ సుధీర్ బాబు



నవతెలంగాణ-సిటీబ్యూరో

బ్యాంకర్లు భద్రతా ఏర్పాట్లపై నిర్లక్ష్యం వహిచొద్దని రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. రాయపర్తి, బీదర్, మంగళూరులో ఇటీవల జరిగిన బ్యాంక్ దోపిడీ సంఘటనల నేపథ్యంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలో బ్యాంకర్లను సీపీ సుధీర్ బాబు అప్రమత్తం చేశారు. నేరనివారణ చర్యలలో భాగంగా బ్యాంకులకు తగిన విధంగా భద్రత ఏర్పాట్లతోపాటు, బ్యాంకుల పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టడానికి బ్యాంకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా పరమైన ఏర్పాట్లపై శనివారం నేరేడ్మెట్‌లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో సీపీ సుధీర్ బాబు రాచకొండ పరిధిలోని అన్ని రకాల బ్యాంకుల ప్రధాన అధికారులు, ఇతర సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగం అనేది సొసైటీ మనుగడకు, పలు రకాల వ్యాపార వాణిజ్య కార్యకలాపాల గమనానికి మూలస్తంభం వంటిదని పేర్కొన్నారు. ప్రజలు తమ కష్టార్జితాన్ని ఎంతో నమ్మకంతో బ్యాంకులో దాచుకుంటారన్నారు. వ్యాపార వాణిజ్య కార్యకలాపాల ద్వారా తమ ఎదుగుదల కోసం బ్యాంకులపైనే ఆధారపడతారని తెలిపారు. అటువంటి బ్యాంకులకు తమ వంతు బాధ్యతగా తగిన రక్షణ కల్పించడానికి పోలీసుశాఖ చేస్తున్న దైనందిన పెట్రోలింగ్ గస్తీ విధులలో భాగంగా బ్యాంకుల పట్ల ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించడం జరుగుతోందని పేర్కొన్నారు. అయితే రాయపర్తి, బీదర్, మంగళూరులో ఇటీవల జరిగిన బ్యాంక్ దోపిడీ సంఘటనలు బ్యాంకుల భద్రత యొక్క బలహీనతలను బయటపెట్టాయని, పోలీసు శాఖ ఎన్ని భద్రతాపరమైన చర్యలు చేపడుతున్నప్పటికీ, తమవంతుగా గస్తీ విధులు నిర్వహిస్తున్నప్పటికీ బ్యాంకుల భద్రతాపరమైన ఏర్పాటు, అజాగ్రత్త చర్యల మూలంగా కొన్ని బ్యాంకులు దోపిడీకి గురవుతున్నాయన్నారు.

ఇటీవల రాచకొండ కమిషనరేట్ పరిధిలోని 489 బ్యాంకులను పోలీస్ అధికారులు సందర్శించి భద్రతా చర్యలను సమీక్షించినట్టు పేర్కొన్నారు. నాణ్యత లేని బ్యాంకు భవనాలు, బలహీనమైన భద్రతా ఏర్పాట్లు, లాకింగ్ వ్యవస్థ, సెక్యూరిటీ గార్డులు అప్రమత్తంగా లేకపోవడం గుర్తించినట్టు తెలిపారు. కొన్ని బ్యాంక్‌లు సెక్యూరిటీని నియమించుకోకపోవడం, పాత కాలం నాటి అలారం వ్యవస్థ, సీసీటీవీలు లేకపోవడం, డేటా ఫుటేజ్ సింగిల్ బ్యాకప్ మాత్రమే ఉండడం వంటి లోపాలున్నాయని బ్యాంకుల ప్రతినిధుల దృష్టికి సీపీ తీసుకొచ్చారు.

బ్యాంకుల ప్రతినిధులకు భద్రతా పరమైన మౌలిక సదుపాయాల గురించి పలు విలువైన సూచనలు చేశారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, సీసీటీవీ ఫుటేజ్ అతి ముఖ్యమైన సాక్ష్యంగా నిలుస్తుందని పేర్కొన్నారు. బ్యాంకు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు, క్యాష్ కౌంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌లతో సహా అన్ని ముఖ్యమైన ప్రాంతాలను కవర్ చేసేలా 24/7 పనిచేసే సీసీటీవీ కెమెరాలు అమర్చాలని, ఫుటేజ్ క్లౌడ్ నిల్వ (ప్రత్యామ్నాయ నిల్వ) ఉండేలా చూసుకోవాలన్నారు. బ్యాటరీతో పనిచేసే స్టోరేజ్ కలిగిన రహస్య కెమెరాలను అమర్చాలని సూచించారు. చొరబాట్లను నిరోధించడానికి కిటికీలకు గ్రిల్స్ ఉండాలని, వాహన దాడులను నిరోధించడానికి కంచెలు, గేట్లు, బొల్లార్డ్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, నూతన భద్రతాపరమైన పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ సూచించారు. తమ బ్యాంకులను సైబర్ నేరగాళ్ళ నుంచి రక్షించుకోవడానికి తమ సాఫ్ట్వేర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఏటీఎంలలో డబ్బు నింపే వాహనాలకు రక్షణగా నిర్దేశిత నియమాలకు అనుగుణంగా శిక్షితులైన సిబ్బందిని కాపలాగా పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు రాజేష్ చంద్ర, ఎల్బీనగర్ ప్రవీణ్ కుమార్, పద్మజ, అరవింద్ బాబు, సునీత రెడ్డి, డీసీపీ ఎస్ఓటి 1 రమణా రెడ్డి, ఎస్ఓటి 2 మురళీధర్, ఏసీపీ ఐటీ సెల్ నరేందర్ గౌడ్, ఏసీపీ సీసీఆర్బి రమేష్‌తోపాటు తదితర అధికారులు పాల్గొన్నారు.

బొగ్గు పింఛన్ దారుల సమస్యలు పరిష్కరించాలి

సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు



నవతెలంగాణ-నాగోల్

సింగరేణి ఫింఛన్‌దారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రామచంద్రరావు, ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందారు వేణు మాధవ్‌లు కోల్ మంచితశాఖ కార్యదర్శి సిఎంపిఎఫ్ ట్రస్ట్ బోర్డు చైర్మెన్ విక్రమ్ దేవదూతకు విన్నవించారు. సింగరేణి భవన్ హైదరాబాద్‌లో జరుగుతున్న 183వ కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ బోర్డ్ ఆఫ్ ట్రస్ట్ సమావేశానికి విచ్చేసిన ఆయనతోపాటు ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షులు రమేంద్ర కుమార్ రాకేష్ కుమార్ ఎచ్ఎంఎస్,డి.రామానందన్ సీఐటీయూ,బోర్డు ఆఫ్ ట్రస్ట్ సభ్యులకు కోల్ మైన్స్ పెన్షన్ స్కీం 1998 నుండి ప్రారంభించినప్పటి నుండి బొగ్గు కార్మికులకు రిటైర్డ్ అయిన రోజు నుంచి ఎంత మంజూరు చేయబడిందో అంతే చెల్లించడం వలన అతి తక్కువ పెన్షన్‌తో జీవించలేక పోతున్నారని వారు తెలిపారు. పెన్షన్ నిధి బలోపేతం చేస్తూ రిటైర్డ్ ఉద్యోగి గౌరవప్రదమైన జీవితం గడపడానికి వారి అవసరాలకు అనుగుణంగా నెలవారి పెన్షన్ సవరించాలని అధికారులకు, మంత్రులకు, రాజకీయ నాయకులకు వినతి పత్రాలు అనేక వేదికల ద్వారా విన్నవించుకున్న నేటి వరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. అన్ని పత్రాలు ఆన్‌లైన్ కంప్యూటరైజేషన్ చేసిన తరువాత కూడా పెన్షన్ మంజూరు చేయడానికి రెండు మూడు నెలలు ఎదురు చూడాల్సి వస్తుందన్నారు.

కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్, బ్యాంకుల వద్ద ఉన్న ఉద్యోగుల సమాచారం మేరకు సవరించిన పెన్షన్ పే ఆర్డర్లు జారీ చేయాలని కోరారు. రివైజ్ పెన్షన్ పే ఆర్డర్ పొందినప్పటికి పెన్షన్ పొందడానికి అధికారుల సంతకాల కోసం వృద్ధాప్య, వితంతువులు తిరగాల్సి వస్తుందన్నారు. బ్యాంక్ అధికారులకు తగిన మార్గదర్శక సూత్రాలు ఉన్నప్పటికీ అమలు కావడం లేదని తెలిపారు. 2024 మార్చి 8న ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం అందరికీ కనీస పెన్షన్ వెయ్యి రూపాయలు చెల్లించే చర్యలు తీసుకోవాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దండంరాజు రాంచందర్ రావు, ఉప ప్రధాన కార్యదర్శి ఆళ వందార్ వేణు మాధవ్ వినతి పత్రంలో పేర్కొన్నారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళులు



నవతెలంగాణ-హయత్‌నగర్

మాజీ ముఖ్యమంత్రి, విశ్వ విఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని హయత్ నగర్ ప్రభుత్వ హాస్పిటల్‌లో తెలంగాణ తెలుగు యువత మాజీ అధికార ప్రతినిధి మల్కాజ్గిరి పార్లమెంట్ అడాప్ కమిటీ మెంబర్ సింగిరెడ్డి మురళీధర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. తర్వాత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు మరాటి బిక్షపతి, మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షులు దుర్గం మల్లేష్ యాదవ్, ఎల్బీనగర్ తెలుగు యువత అధ్యక్షులు కాటేపాక ప్రవీణ్, సీనియర్ నాయకులు బాతుకుల శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ గౌడ్, కుమార్ యాదవ్ జనగ మహేందర్, సామ జాన్ రెడ్డి, సుధాకర్ గౌడ్ రమేష్ గౌడ్, సాహిత్ కొమ్మర్ల, శివా నాయక్ , రాజు నాయక్ వినోద్ నాయక్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - ఎల్బీనగర్

స్వర్గీయ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా లింగోజిగూడ డివిజన్ సాయినగర్ కాలనీ నందు మాజీ కౌన్సిలర్ చిత్తలూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కుమారుడు దేవిరెడ్డి ప్రీతమ్ రెడ్డి హాజరయ్యారు. తర్వాత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రీతమ్ రెడ్డి మాట్లాడుతూ భూమీ ఆకాశం ఉన్నంతకాలం స్వర్గీయ నందమూరి తారకరామారావును ప్రజలు గుర్తుపెట్టుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, రాకేష్, శేఖర్, సుధాకర్, ఏడుకొండలు, గంగపుత్ర భాస్కర్, మధుసాగర్, ఇంద్రజి, పార్వతి, లక్ష్మీదుర్గ, నరేష్, శ్రీనివాస్, ఆనంద్, శోభారాణి, దేవి, సుజిత్, రుద్రాల శ్రీనివాస్, బొంబాయి, అశోక్, సరళ, అనూష తదితరులు పాల్గొన్నారు.





నవతెలంగాణ - సిటీబ్యూరో

మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారి పనామా గోడౌన్ చౌరస్తా వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేలపాటి రామారావు, బుడ్డ సత్యనారాయణలు శనివారం పలువురితో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పేద ప్రజలకు రెండు రూపాయలకు కిలో బియ్యం పథకాన్ని పెట్టిన అన్నదాత అఖిలాంధ్ర ప్రేక్షకుల ఆరాధ్య దైవం ఎన్టీఆర్.. నేటికీ కోట్లాదిమంది గుండెల్లో కొలువై ఉన్నాడని వారు కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికీ ఎన్టీఆర్‌ను అభిమానంతో గౌరవిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మ సంఘం సభ్యులు కర్నాటి కృష్ణమూర్తి, నూతి శ్రీనివాస్, ఉప్పలపాటి బాబు, ఎన్టీఆర్ అభిమానులు పద్మారెడ్డి, బీజేవైఎం రెడ్డి, గాడిపర్తి గోవర్ధన్, నర్సయ్య, అనిల్, సుధాకర్, శ్రీను, విష్ణు, సుధీర్, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులు
సభ్యత్వ నమోదు చేసుకోవాలి

సీఐటీయూ మండల కన్వీనర్ శేఖర్ యాదవ్



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న భవన నిర్మాణ కార్మికులు విధిగా సభ్యత్వ నమోదు చేసుకావాలని బాలాపూర్ సీఐటీయూ మండల కన్వీనర్ వి.శేఖర్ యాదవ్ అన్నారు. శనివారం బడం గ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో భవన నిర్మాణ కార్మికులతో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు కార్మిక చట్టం ప్రకారం విధిగా సభ్యత్వ నమోదు చేసుకున్న వారికి ప్రభుత్వం నుండి అన్ని రకాలుగా సౌకర్యం లభిస్తుందన్నారు. భవన నిర్మా ణ సమయంలో ప్రమాదం జరిగిన వారికి భీమా పాలసీలు లభిస్తాయన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నకిలీ కరెన్సీ సరఫరా చేసే వ్యక్తి అరెస్ట్



నవతెలంగాణ-హయత్ నగర్

నకిలీ కరెన్సీ సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని హయత్‌నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..కామెరూన్ దేశానికి చెందిన జాక్సన్ డీవోలిస్ కిటిల్. రెండు నెలల కిందట బెంగుళూరుకు వచ్చి స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. జల్సాలకు అలవాటు పడి దొంగ నోట్ల తయారీ చేయడం అలవాటు చేసుకుని అసలు నోట్లకు బదులు 1:2గా మాట్లాడుకుని అతనితో పాటుగా అతని స్నేహితుడు అయిన ల్యాండ్రితో కలిసి నకిలీ నోట్లను మార్కెట్ లో చెలామణి చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు శనివారం హయత్ నగర్‌లోని ఓయో గదిలో హయత్‌నగర్‌కు చెందిన రసూల్ అనే వ్యక్తికి 5లక్షల ఒరిజినల్ నగదుకు బదులుగా 10లక్షల రూపాయల నకిలీ కరెన్సీ ఇస్తుండగా పోలీసులు అతన్ని పట్టుకున్నారు. అతని వద్ద నుండి ఒక ఫోన్, 500 రూపాయల ఒరిజినల్ 4నోట్లు స్వాధీనం చేసుకున్నారు. ల్యాండ్రి పరారీలో ఉన్న ట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. జాక్సన్ డీవోలిస్ కిటిల్ పాత నేరస్తుడుగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

ఎమ్మెల్సీ రహమత్ బేగ్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న కాలనీలలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ రహమత్ బేగ్ అన్నారు. ఎంఐఎం అధినేత అసోద్దీన్ ఓవైసి పిలుపు మేరకు జల్ పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న నాబిల్ కాలనీలో శనివారం మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి అహమ్మద్ సాది, జల్ పల్లి మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్, మున్సిపల్ చైర్మెన్ అబ్దుల్లా బిన్ సాది, కౌన్సిలర్ అహమ్మద్ కసాదితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేస్తుందన్నారు. ముఖ్యంగా కాలనీల్లో నెలకొన్న సమస్యలు రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, తాగునీటి తదితర సమస్యలను పరిష్కారం చేయడం కోసం తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సరూర్ నగర్ మండల మాజీ వైస్ ఎంపీపీ ఉమర్ బాం, కౌన్సిలర్ దస్తగిర్, సిబ్బంది, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు కంటిచూపు ప్రధానం

జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్

నవతెలంగాణ- నాగోల్

వాహనాలు నడిపే ప్రతి డ్రైవర్‌కూ కంటిచూపు ప్రధానమని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్ తెలిపారు. జాతీయ రోడ్డు భద్రత మహోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం నాగోల్ ట్రాన్స్పోర్ట్ కార్యాలయంలో ఇంచార్జ్ ఆర్టీవో అమర్నాథ్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఏర్పాటు చేసిన ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎలాంటి సమస్యలు లేకుండా డ్రైవర్లకు కంటిచూపు ప్రధానమని, కంటి చూపులో ఎలాంటి సమస్యలున్నా నిర్లక్ష్య వైఖరిని అవలంబించకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. పలు దశల్లో రోడ్డు భద్రతలపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామని, వాటిని సక్రమంగా వినియోగించుకొని రోడ్డు ప్రమాదాల నుండి తమ ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు. ప్రమాదం జరిగిన సమయంలో ప్రమాదానికి కారకులతో పాటు అమాయకులు కూడా బలి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 1నుండి 31వరకు జరువుతున్న రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగ నాగోల్ ఇంచార్జ్ ఆర్టీఓ అమర్నాథ్ ఆధ్వర్యంలో శనివారం 160 మంది డ్రైవర్లకు కంటిపరీక్షలు నిర్వహించి అవసరం అయిన వారికి కళ్ళజోడు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగోల్ ఇంచార్జ్ ఆర్టీఓ కె అమర్నాథ్, అధికారులు అనిత, శీతల్, బలరాం, జ్ఞానేశ్వర్, అభిలాష్, ప్రసాద్, వేణు, నాగేశ్వర్ రావు, ప్రతీష్ రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.



తెలంగాణ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ (టిఈఏఈఏ)-2025 డైరీ, క్యాలెండర్‌ను డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.రామకృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీష్, చీఫ్ అడ్వైజర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం శనివారం భట్టి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించిన అనంతరం డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అసిస్టెంట్ ఇంజినీర్లు ఎదుర్కొంటున్న ముఖ్య సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ సీఎంను కోరినట్టు తెలిపారు. ముఖ్యంగా ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 61 నుంచి 60 ఏండ్లకు తగ్గించాలనీ, పదోన్నతులకు ప్రణాళిక బద్ధంగా నియమిత కాల పరిమితిలో అంటే ఆరేండ్లకుగాను (టైం బౌండ్) ఇవ్వాలనీ, టీజీ జెన్‌కోలో ఇటీవల పదోన్నతులు ఇచ్చిన ఏడీలకు ఏడీఈలుగా పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. కింది స్థాయి ఉద్యోగులకు ఉన్నత స్థాయికి పదోన్నతులు ఇచ్చే క్రమంలో పరీక్ష నిర్వహించి పదోన్నతులు ఇవ్వాలని కోరారు. వీటన్నింటికీ విన్న డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించి త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఇమ్రాన్, యాదగిరి, నరోత్తం కుమార్, రాజా రవిచంద్ర, మజహర్, ప్రియాంక, అనిల్ రెడ్డి, ప్రవీణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



'ఆర్ఆర్ఆర్'ను ప్రారంభించిన కార్పొరేటర్

నవతెలంగాణ-చంపాపేట్

ప్రజలకు ఉపయోగపడే ఆర్ఆర్ఆర్ సెంటర్‌ను కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఐ ఎస్ సదన్ డివిజన్ లక్ష్మీ నగర్ పార్కులో జీహెచ్ఎంసీ శానిటేషన్ అధికారులు ఆర్ఆర్ఆర్ (రెడ్యూస్), తగ్గించు (రియూజ్), పునర్వియోగం (రీసైకిల్) రీసైకిల్ కేంద్రాల ద్వారా అవసరమైన వారికి అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ జోన్ శానిటేషన్ డిప్యూటీ కమిషనర్ శంకర్ సింగ్, డీఈ వెంకట రాజు, శానిటేషన్ ఎస్సై అర్జున్, ఎస్సై ఫక్రుద్దీన్, యుసిడి యాదయ్య, జవాన్ కృష్ణ, జవాన్లు, శానిటేషన్ సిబ్బందులు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్ ఎఫ్ చెక్కు అందజేత



నవతెలంగాణ -శామీర్‌పేట

మండల పరిధిలోని మజీద్‌పూర్ గ్రామానికి చెందిన అబ్బగౌని శంకరమ్మకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.52500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి శనివారం లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు వంగ వెంకట్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు అబ్బగౌని శ్రీకాంత్ గౌడ్, అబ్బగౌని వెంకటయ్య గౌడ్, భిక్షపతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ దమ్మాయిగూడ మున్సిపల్ మహిళా అధ్యక్షురాలిగా జూపల్లి శోభారాణి



నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా జూపల్లి శోభారాణి రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావు, జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా జూపల్లి శోభారాణి మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జీ తోటకూర వజ్రేష్ యాదవ్, జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మిలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి



- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- రామంతాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను రాజకీయాలకు తావు లేకుండా అభివృద్ధి చేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం రామంతపూర్ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావుతో కలిసి రూ.40 లక్షలతో చేపడుతున్న వరద నీటి కాలువ పనులను, ప్రగతి నగర్‌లో పార్క్‌ను ప్రారంభించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. రామంతపూర్ డివిజన్‌లో 80శాతం అభివృద్ధి పనులు పూర్తి చేశామని, త్వరలోనే పెండింగ్ పనులను పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షులు బండారు వెంకట్ రావు, పసుల ప్రభాకర్ రెడ్డి, బీజేపీ ప్రధాన కార్యదర్శులు సంకురి కుమార్ స్వామి, నారాయణ దాసు, నగేష్, ప్రగతినగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎ. కృష్ణమూర్తి, ముఖ్య సలహాదారులు బి. వెంకట్ రెడ్డి, కోశాధి కారి మురళీధర్, సంయుక్త కార్యదర్శి ప్రవీణ్, సభ్యులు వెంకటేశ్వరరావు, రాజగోపాల్, శ్రీకాంత్, ప్రభాకర్ యాదవ్, పరమేశ్వర్, వెంకట్ రెడ్డి, సత్యం, సాగర్, గంగాధర్, రమేష్ రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, చిన్నబాబు, ఇంద్రసేనారెడ్డి, తదితరులున్నారు.

సీపీఐ(ఎం) నాయకులు ఆండాలి సంతాప సభ

- హాజరైన పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శవర్గ సభ్యులు డీజీ నర్సింగరావు, పాలడుగు భాస్కర్





నవతెలంగాణ-కాప్రా

సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో సీపీఐ(ఎం) నాయకులు మహమ్మద్ ఆండాలి సంతాప సభను డాక్టర్ ఏఎస్ రావు నగర్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రశేఖర్ అధ్యక్షత నిర్వహించారు. ఈ సభకు సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యదర్శవర్గ సభ్యులు డీజీ నర్సింగరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ హాజరై మాట్లాడుతూ.. ఆండాలి అనేక పోరాటాలలో పాల్గొని నేడు జనవిజ్ఞాన వేదికలో పనిచేస్తూ మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన అందరికీ ఆదర్శప్రాయాలనీ, ఆయన మృతి పార్టీకి తీరనిలోట్టన్నారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి పి.సత్యం, కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి, మాజీ ఎమ్మెల్యే దాసు, శ్రీమన్నారాయణ, ఏఎస్ రావు నగర్ సొసైటీ కార్యదర్శి సోమయాచారి, హైదరాబాద్ జిల్లా మాజీ కార్యదర్శి పిఎస్ఎన్ మూర్తి, డాక్టర్ ఏఎస్‌రావు నగర్ హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ పి రామ్మూర్తి, గొడుగు యాదగిరిరావు , పార్టీ నాయకులు వెంకట్, సీఐటీయూ రాష్ట్ర నాయకులు వెంకటేష్, సుదర్శన్ ఆండాలి కుటుంబ సభ్యులు ప్రసంగించారు. కామ్రేడ్ మహమ్మద్ ఆండాలి ఈసీఐఎల్‌లో పార్టీ మొదటి శాఖ కార్యదర్శిగా పని చేశారని, ఈసీఐఎల్ కన్స్యూమర్ సొసైటీ కార్యదర్శిగా పనిచేసి కార్మికులకు ఎంతో సేవ చేశారని చెప్పారు. అనంతరం ఆండాలి పార్థివ శరీరంతో ఊరేగింపుగా ఎస్‌రావు నగర్‌లో ప్రదర్శన జరిపి ఆయన శరీరాన్ని గాంధీ హాస్పిటల్‌కు ప్రయోగాల నిమిత్తం కుటుంబ సభ్యులు దానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ఉన్నికృష్ణన్, ఎన్.శ్రీనివాస్, ఏ.అశోక్, ఎం.వినోద, గౌస్య, వెంకటేశ్వరరావు, శోభ, శ్రీనివాస్, నాగరాజు, సిహెచ్ ప్రసాదు, నరసయ్య, పి.బి చారి, శరత్, శివన్నారాయణ, దేవి రెడ్డి, జయరాజ్, వెంకన్న, సత్యనారాయణ, గుమ్మడి హరిప్రసాద్, కేసీఆర్ దాస్, కర్రె మల్లేశం, పార్థసారథి, చంద్రశేఖర రావు, జేవీవీ రాజా తదితరులు పాల్గొన్నారు.





జనప్రియ టౌన్‌షిప్‌లో ఉచిత వైద్య శిబిరం





నవతెలంగాణ - చర్లపల్లి

మల్లాపూర్ జనప్రియ టౌన్‌షిప్ కమ్యూనిటీ హాల్‌లో ట్రినిటీ హాస్పిటల్ నిర్వహణలోని అమృత్ రాజ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మంది ఉచిత వైద్య సేవలను పొందారు. మందులు, ల్యాబ్ పరీక్షలు, ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. రక్తపోటు, చక్కెర స్థాయి, కొలెస్ట్రాల్ పరీక్షలతో పాటు ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఎస్‌డీఎస్ రాజు, డాక్టర్ ప్రగతి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా స్థానికులు ట్రినిటీ హాస్పిటల్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పేదల ఇండ్ల జోలికొస్తే ఊరుకోం

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



నవతెలంగాణ-జవహర్‌నగర్

పేదల ఇండ్ల జోలికి వస్తే ఉరుకోబోమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం జవహర్ నగర్‌లోని అరుంధతి నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..1998లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకున్న వారికి కేటాయించిన స్థలాల్లో నిర్మాణం చేసుకున్న వారిని రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారులు, కూల్చేస్తామంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. పేదవారికి మరియు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకున్న వారికి ఏదైనా నష్టం జరిగితే ఊరుకోబోమన్నారు. ఏదైనా ఉంటే ల్యాండ్ సర్వే చేసుకొని ఎవరికైతే కేటాయించారో వాళ్లకి న్యాయం జరిగేలా చేయాలన్నారు. అన్యాయం జరిగితే బీజేపీ ఆధ్వర్యంలో ఊరుకునే పరిస్థితి లేదని ప్రజా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. హెచ్ఎండీఏ, హుడా, రెవెన్యూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ మంత్రితో మాట్లాడి సమస్యకు పరిష్కారం దిశగా ప్రయత్నం చేస్తానని ప్రజలకు భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో పటోళ్ల విక్రమ్ రెడ్డి, కార్పొరేటర్ పానుగంటి బాబు, రంగుల శంకర్ నేత, మహేందర్ యాదవ్, కమల్, బిజెపి నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

చిల్కానగర్‌లో వైకుంఠధామాలకు మహర్దశ



- అన్ని కులమతాలకు సమన్యాయం
- డివిజన్‌లో రూ.55 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- కార్పొరేటర్ బన్నాల

నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లోని అన్ని వైకుంఠధామాలకు మహర్దశపట్టిందని డివిజన్‌లోని రూ.55 లక్షల వ్యయంతో పలు వైకుంఠధామ అభివృద్ధి పనులకు కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చిల్కానగర్ డివిజన్‌ను అభివృద్ధిలో నంబర్ వన్ తీర్చిదిద్దుతానని, అన్ని కులాలకు, మతాలకు సమన్యాయం చేస్తామన్నారు. డివిజన్ మైనార్టీ గ్రేవ్ యార్డ్‌లోని పెద్ద బండరాలను తొలగించుటకు, కురుమ కులస్తుల వైకుంఠధామంలో మోడరన్ టాయిలెట్స్, ప్రహరీ గోడ పనులకు, రెడ్డి కులస్తుల వైకుంఠధామంలో ప్రహరీ గోడతోపాటు వాచ్‌మెన్, స్టోర్ రూమ్ వసతుల పనులను ప్రారంభించినట్టు తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీఈ వెన్నెల గౌడ్, ఏఈ వినీత్ రావు, బీఆర్ఎస్ నాయకులు ఏదుల కొండల్ రెడ్డి, కోకొండ జగన్, ముద్దం శ్రీనివాస్, అశోక్‌చారి సుందర్, శ్యామ్, అప్సర్ భాయ్ రాజ్యలక్ష్మి, ఆండాలు, సత్యవతి లక్ష్మి శారద, ఉమా, జయమ్మ, మైనారిటీ అధ్యక్షులు అబ్బు బాయ్, మహమూద్, కురుమ సంఘం చలో చిందం వెంకటేష్, బర్ల కృష్ణ, కొండ్రు హనుమంతు, జెన్నీ రఘు, ఐలయ్య , గొరిగే ఐలేష్, తదితరులున్నారు.

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం

- జై భీమ్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బక్క నరేందర్



నవతెలంగాణ- మేడ్చల్

సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరం లాంటిదని జై భీమ్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బక్క నరేందర్ అన్నారు. మేడ్చల్ మండల పరిధిలోని పూడూరు గ్రామానికి చెందిన నీరుడి శ్రీకాంత్‌కు మంజూరైన రూ.28500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు బక్క నరేందర్ చేతుల మీదుగా లబ్దిదారుడికి అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ నిధుల విడుదలకు సహకరించిన ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ సేవా సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఏర్పుల హరి పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్‌లోని శ్రీరామ్ నగర్ కాలనీలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ సమస్యతో విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తింది. విషయం తెసులుసుకున్న కాంగ్రెస్ నాయకులు, మేడ్చల్-మల్కాజిగిరిజిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ విఠల్ నాయక్, ఎలక్ట్రికల్ ఏఈ సత్యనారాయణకు తెలపడంతో లైన్‌మెన్ మురళీ, సిబ్బందితో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేయించారు.ఈ సందర్భంగా శ్రీరామ్ నగర్, బంజారా ఎస్టీ కాలనీల వాసులు విఠల్ నాయక్‌కు ధన్యవాదాలు తెలిపారు.

బడి బయటి పిల్లలపై విద్యాశాఖ స్పెషల్ డ్రైవ్



నవతెలంగాణ-మేడ్చల్

బడి బయటి పిల్లలపై మేడ్చల్ జిల్లా విద్యాధికారి విజయకుమారి ఆదేశాల మేరకు మండల విద్యాధికారి రంగాచారి ఆధ్వర్యంలో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటుక బట్టీలు, పౌల్ట్రీ ఫామ్‌లలో నివసిస్తున్న కుటుంబాల వద్దకు వెళ్లి చదువుకు దూరమైన పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఎంఈవో రంగాచారి మాట్లాడుతూ 14ఏండ్ల లోపు పిల్లలకు ఉచిత నిర్బంధ తప్పనిసరని, విద్యాహక్కు చట్టం ప్రకారం 14ఏండ్లలోపు పిల్లలకు ప్రాథమిక ఉచిత నిర్బంధ విద్య కల్పిస్తామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 6నుండి 14ఏండ్లలోపు పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను అమలు చేస్తున్నాయని తెలిపారు. మునీరాబాద్ గ్రామంలోని పౌల్ట్రీ ఫామ్‌లో బడి బయట పిల్లలను గుర్తించి వాళ్లను స్థానిక ప్రాథమిక పాఠశాలలో చేర్పిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు మల్లేష్, రాకేష్, బి.మల్లేశం, ఎంఐఎస్ కోఆర్డీనేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై 21నుంచి 24 వరకు గ్రామ సభలు

- అర్హులైన లబ్దిదారుల ఎంపిక
- ఎంపీడీఓ మమతాబాయి

నవతెలంగాణ - శామీర్‌పేట

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఈ నాలుగు పథకాలపై ఈ నెల 21 నుంచి 24 వరకు శామీర్ పేట్ మండలంలోని 7 గ్రామ పంచాయతీలలో అర్హులైన లబ్దిదారుల ఎంపికపై గ్రామసభలు, తూంకుంట మున్సిపాలిటీలో విలీనమైన బాబాగూడ, బొమ్మరాసిపేట్, శామీర్ పేట్‌లలో వార్డు సభలు నిర్వహిస్తున్నట్టు శామీర్ పేట ఎంపీడీఓ మమతాబాయి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 21న 8గంటలకు అలియాబాద్, 10గంటలకు బొమ్మరాసిపేట (వార్డుసభ), మధ్యాహ్నం 2గంటలకు బాబాగూడ (వార్డు సభ)లో నిర్వహిస్తామని తెలిపారు. 22న 10గంటలకు పొన్నాల, లాల్‌గడిమలక్‌పేట, 23న 9గంటలకు యాడారం, 10గంటలకు తుర్కపల్లి, మధ్యాహ్నం 2గంటలకు మురహరిపల్లి, 24న 10గంటలకు శామీర్ పేట (వార్డు సభ), మజీద్‌పూర్‌లో గ్రామసభలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

వర్ల ఎన్‌క్లేవ్ సాకేత్ ఫేజ్-2లో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-కాప్రా

కాప్రా డివిజన్‌లోని వర్ల ఎన్‌క్లేవ్ సాకేత్ ఫేజ్-2ఎక్స్ టెన్షన్‌లో కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, మేడ్చల్ మల్కాజిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ విట్టల్ నాయక్‌లు వర్ల ఎన్‌క్లేవ్ సాకేత్ ఫేజ్-2 ఎక్స్ టెన్షన్ కాలనీ రెసిడెంట్స్ అసోసియేషన్ ఆహ్వానం మేరకు శనివారం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తాగునీటి సదుపాయం, సీసీరోడ్ల నిర్మాణం చేపట్టాలని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను అధికారులకు తెలిపి పరిష్కారానికి కృషిచేస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. అనంతరం కాలనీవాసులు ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణిని, విఠల్ నాయక్‌లను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వర్ల ఎన్‌క్లేవ్ సాకేత్ ఫేజ్-2 ఎక్స్ టెన్షన్ కాలనీ రెసిడెంట్స్ అసోసియేషన్ సభ్యులు, కాప్రా డివిజన్ కాంగ్రెస్ నాయకులు పవన్ కుమార్, పడమటి మల్లారెడ్డి, పీ బాబూరావ్, సంతోష్ చారి, టి శ్రీహరి, రిజ్వాన్ ఖాన్, సత్యనారాయణ, డివిజన్ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ అరుణ్, కిరణ్, విజయ్ , అభి వర్మ , మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ - చర్లపల్లి

అర్హులైన వారందరికీ రేషన్ కార్డు లభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశించారు. శనివారం సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రేషన్ కార్డు లబ్దిదారుల సర్వేను కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డితో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్క దరఖాస్తు దారునికి రేషన్ కార్డు లభించేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిల్ కలెక్టర్ ముఖేష్, స్థానిక నాయకులు నెమలి రవి, తండా వాసుగౌడ్, తిగుళ్ల శ్రీనివాస్ గౌడ్, ధర్మరాజు, శ్రీనివాస్ రెడ్డి, ఉస్మాన్, పరమేష్ రెడ్డి, గణేష్, శ్రీశైలం, రాపోలు శ్రీనివాస్, రఘు, శశి, శ్రీనివాస్ ఉన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి - కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్



నవతెలంగాణ - చర్లపల్లి

బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అన్నారు. శనివారం నాచారం అంబేద్కర్ విగ్రహం వద్ద నాచారం పెద్ద నాలా పై ఉన్న పాత బ్రిడ్జి స్థానంలో రూ.94 లక్షలతో నిర్మించనున్న నూతన బ్రిడ్జి నిర్మాణ పనులకు సంబంధించిన నాలా డైవర్షన్ పనులను కాప్రా ఈఈ నాగేందర్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. భవానీ నగర్ రోడ్డు చాలా రద్దీ గా నాచారంలోని చాలా కాలనీలకు, మల్లాపూర్‌లోని కొన్ని కాలనీలకు వెళ్లేవారు ఉపయోగించే, రోడ్డు కావడంతో బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సాయిజెన్ శేఖర్, కట్ట బుచ్చన్న గౌడ్, భూపాల్ రెడ్డి, ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, దాసరి కర్ణ, మక్బూల్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కంఠం భూమిని కాపాడండి

- కీసర తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన శ్రీబంగారు మైసమ్మ ఆలయ కమిటీ



నవతెలంగాణ-కీసర

కీసర గ్రామంలోని సర్వే నంబర్ 362లో గ్రామ కంఠ భూమిలో ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని శ్రీ బంగారు మైసమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ అశోక్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీబంగారు మైసమ్మ ఆలయ కమిటీ చైర్మెన్ తుడుం యాదగిరి మాట్లాడుతూ..1500 గజాల గ్రామ కంఠ భూమిని కొంతమంది అక్రమంగా ఆక్రమించి, అనధికారిక నిర్మాణాలు చేపడుతున్నారని తహశీల్దార్‌కు వివరించారు. ఈ అంశంపై గతంలో పంచాయతీ అధికారి, రెవెన్యూ అధికారి కార్యాలయానికి పలు మార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరూ చర్యలు తీసుకోలేదని తెలిపారు. గ్రామ ప్రజల తరపున సంబంధిత భూమి మీద సర్వే నిర్వహించి, అక్రమ నిర్మాణాలను తొలగించి, భూమిని గ్రామ అవసరాలకు కేటాయించాల తహశీల్దార్ అశోక్ కుమార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శీలం శ్రీనివాస్, కోశాధికారి చినింగని బాల్ రాజ్ సహా పలువురు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ పార్క్ అభివృద్ధి చేయాలి



- ఎంపీ ఈటలను కోరిన ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

నవతెలంగాణ - చర్లపల్లి

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని నెహ్రూ నగర్ కాలనీ సర్వే నెంబర్ 43,44,45 లోని ఎన్ ఎఫ్ సి కంపెనీ ప్రహరీ గోడకు ఆనుకొని ఉన్న టిఎస్ఐఐసి కీ చెందిన ఖాళీ స్థలంలో స్థానికుల కోసం కమ్యూనిటీ హాల్ పార్క్ అభివృద్ధి చేయాలని ఎంపీ ఈటల రాజేందర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం అక్కడికి వస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, నాయకులు భాస్కర్, లక్ష్మినారాయణ, బాబు, దుర్గయ్య, వాసు, అంజి పాల్గొన్నారు.



నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలను పొందడం కోసం డిపార్టుమెంటల్ పోర్టల్‌లో నమోదు చేసుకుని ప్రక్రియను శనివారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధి కల్పన అధికారి రాధిక పారిశ్రామిక తనిఖీ చేశారు. -నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎమ్మెల్యేకు పలు ఆహ్వానాలు, వినతులు..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌ని కలిసి పలు ఆహ్వాన పత్రికలు, వినతి పత్రాలు అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించారు.

బీఆర్ఎస్ నేత పవన్ కుమార్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పవన్ కుమార్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరా పాల్గొన్నారు. అనంతరం ఆయన చేత కేక్ కట్ చేయించి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్ రెడ్డి, నాగేశ్వరరావు, శరత్, చిక్కం వంశీ, లక్ష్మణ్, సత్య ప్రకాష్, అనిల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేలా చర్యలు..



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీ హెచ్‌బీ

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్‌లో ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, ఈఈ.శ్రీనివాస్, వాటర్ వర్క్స్ జీ.ఎం.ప్రభాకర్‌లతో కలిసి శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోర్టు నిర్మాణం వల్ల డ్రయినేజీ ఔట్ లెట్ పూర్తిగా కుంగిపోవడంతో మురుగు నీరు ఓవర్ ఫ్లో అయి కాలనీలలో భూగర్భ డ్రయినేజీతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. మురుగు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోయి ఇండ్లలోకి మురుగు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గమనించి భూగర్భ డ్రయినేజీ పైప్ లైన్, స్టార్మ్ వాటర్ డ్రెయిన్‌ని నిర్మించి.. సమస్య తొలగించి శాశ్వత పరిష్కారం జరిగేలా చూస్తామని ఆయన కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, కాలనీ ప్రెసిడెంట్ యాదయ్య, సాయి కిరణ్, అధికారులు డిఈ శంకర్, ఏఈ శ్రీనివాస్, మేనేజర్ సలోమీ, ఇతర సిబ్బంది, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/దుండిగల్

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రూపొందించిన నవతెలంగాణ-2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి శనివారం బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన సంవత్సరంలో నవతెలంగాణ పత్రికకు మంచి ఆదరణ లభించాలని, నేటి పోటీ ప్రపంచంలో మిగతా పత్రికల కంటే దీటుగా ఎదగాలని ఆకాంక్షించారు. నిజాలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడంలో నవతెలంగాణ పాత్ర ప్రత్యేకమైనదని అన్నారు. ఏ పార్టీకి కొమ్ము కాయకుండా, ప్రజల కష్టాలను, కార్మికుల సమస్యలను తెలుసుకుంటూ అధికారులకు, పాలకులకు వారధిగా పని చేసి ప్రజా సమస్యలు తీర్చేందుకు కృషి చేయాలన్నారు. ఎలాంటి అవరోధాలు, ఇబ్బందులు రాకుండా ప్రజలందరూ నూతన సంవత్సరములో సుఖసంతోషాలతో ఉండాలని, అలాగే నాయకులకు, అధికారులకు, ప్రజలకు, పత్రిక యజమాన్యానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ రిపోర్టర్ మన్నె వినోద్, ఎన్ఎంసీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, రాంచందర్ నాయక్, జెస్సి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఉరేసుకుని భర్త ఆత్మహత్య



నవతెలంగాణ-బాలానగర్

భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్య చేసుకున్న బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ మేరకు సీఐ టి.నర్సింహరాజు తెలిపిన వివరాల ప్రకారం సుచిత్ర బ్యాంక్ కాలనీ ప్రాంతానికి చెందిన సాయిబాబు(30) శ్రీలతకు నాలుగేండ్ల క్రితం పెళ్లయ్యింది. ఈ క్రమంలో వీరికి ఏడాది కుమారుడు ఉన్నాడు. సాయిబాబు ట్రాక్టర్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వచ్చే సంపాదన సరిపోకపోవడం, దానికి తోడు ఆర్థిక ఇబ్బందులు మరింత పెరగడంతో భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఇదే క్రమంలో గురువారం ఇరువురి మధ్య ఘర్షణ మరింత జరిగింది. వారిద్దరి మధ్య వాగివివాదం పెరగడతో సాయిబాబా ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలలో వెదికినా ఆచూకీ లభించలేదు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లోకుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఉదయం ఐడీపీఎల్ కాలనీ అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు. భార్యాభర్తల మధ్య గొడవలతోనే ఆత్మహత్య చేసుకు న్నాడా? ఇంకేదైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

క్రీడల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం.నరేందర్ రెడ్డి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

క్రీడల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం.నరేందర్ రెడ్డి అన్నారు. కేపీహెచ్ బీ కల్చర్,వెల్ఫేర్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సీఎం వాలీబాల్ టోర్నమెంట్ కప్ వాల్ పోస్టర్‌ని శనివారం ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేం. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ యువత క్రీడలలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బి.సంజీవరావు, ఏ బ్లాక్ ప్రెసిడెంట్ పి నాగిరెడ్డి, బి బ్లాక్ ప్రెసిడెంట్ తుమ్మా వేణు, అల్లాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ మొయినుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసును ఛేదించిన సూరారం పోలీసులు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

చోరీకేసును సూరారం పోలీసులు చేదించారు. సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుని (దొంగ) నుంచి సుమారు 8 తులాల బంగారు,15 తులాల వెండి ఆభరణాలు రికవరీ చేసినట్లు సీఐ ఎస్ భరత్ కుమార్ తెలిపారు. వివరాలలోకి వెళితే.. సూరారం వెంకటరామ్ నగర్ కాలనీకి చెందిన కావలి విజయ్ కుమార్ సంక్రాంతి సందర్భంగా తేదీ 14.01.2025 రోజు తన అత్తగారి గ్రామం విజయవాడకు వెళ్లాడు. అదేరోజు రాత్రి తన ఇంటిలో దొంగతనం జరుగగా.. ఇంటిలో నుంచి సుమారు 8 తులాలు బంగారు, 15 తులాలు వెండి ఆభరణాలు దొంగతనం జరిగినట్టు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా శనివారం తేదీ.18.01.2025 రోజు సూరారం సంతోష్ నగర్ కు చెందిన పాత నేరస్థుడు తస్నీరు సూరి, సూరారం సాయిబాబానగర్ బస్టాండ్ దగ్గర అనుమానాస్పదంగా కనబడడంతో అతనిని అదుపులోనికి తీసుకొని విచారించగా నేరము తానే చేసినట్టు ఒప్పుకున్నాడు. ఇతని వద్ద నుంచి పై వస్తువులన్నియు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇంటికి తాళం వేసి బయటికి వెళ్ళేటప్పుడు విలువైన వస్తువులను, నగదును ఇంట్లో ఉంచకుండా జాగ్రత్త పరుచుకోవాలని తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ భరత్ కుమార్ సూచించారు.

హైదరాబాద్‌లో భూగర్భ విద్యుత్ కేబుల్స్..

- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

నవతెలంగాణ-సిటీబ్యూరో



సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సూచనల మేరకు గ్రేటర్ హైదరాబాద్ అంతటా ఉన్న ఓవర్ హెడ్ (బహిరంగ) లైన్ల స్థానంలో భూగర్భ కేబుల్స్‌తో మార్చే ప్రక్రియను మొదలు పెట్టామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. అత్యుత్తమ అండర్ గ్రౌండ్ కేబుల్ విధానాన్ని తీసుకొచ్చేందుకుగాను ఆసక్తి గల, ప్రసిద్ధ సంస్థలను గుర్తించే ప్రక్రియను టీజీఎస్పీడీసీఎల్ ప్రారంభించింది. ఈ యూజీ కేబులింగ్ వల్ల ప్రజా భద్రత, పటిష్టమైన నెట్వర్క్, నగరం సౌందర్యం మెరుగుపడతాయని భావిస్తున్నారు. ఇది హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ నగరాల్లో ఒకటిగా నిలబెట్టడానికి మరింత వీలు కల్పిస్తుంది. వీటన్నింటినీ దష్టిలో ఉంచుకుని, ఇతర పెద్ద నగరాల్లో లేదా ఇతర దేశాల్లో విజయవంతంగా భూగర్భ కేబులింగ్ పనులను నిర్వహించిన ఆసక్తి గల పార్టీలు ముందుకొచ్చి టీజీఎస్పీడీసీఎల్ ద్వారా రూపొందించిన ఆసక్తి వ్యక్తీకరణలో పాల్గొనాలని టీజీఎస్పీడీసీఎల్ ఆహ్వానిస్తుంది. డిస్కామ్ తన వెబ్‌సైట్‌లో (tgsouthernpower.org) వివరణాత్మక గమనికను ఉంచింది.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి సందర్భంగా శనివారం కేపీహెచ్‌బీ కాలనీ వసంతనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు, మాజీ కార్పొరేటర్ బాబురావు, సాయి బాబా చౌదరి, శ్యామల రాజు, నాగేశ్వర రావు, తదితరులు పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తెలుగు ఖ్యాతిని పెంచిన మహనీయుడు ఎన్టీఆర్ ..

జగద్గిరిగుట్ట: తెలుగు ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని రంగారెడ్డినగర్ డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ మర్యంటి నర్సింగ్ రావు అన్నారు. శనివారం ఎన్టీఆర్ 29వ వర్ధంతి పురస్కరించుకొని డివిజన్ పరిధి ఆదర్శనగర్ చౌరస్తాలో గల ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహా నేత అని కొనియాడారు. సినీ రంగంలో, రాజకీయ రంగంలో మకుటం లేని మహారాజుల వెలిగిన ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ కటకం జయరాం, కుత్బుల్లాపూర్ టీడీపీ ఇన్‌చార్జి దోనే రామ్మోహన్ నాయకులు బాలరాజు, శ్రీనివాసు, నాయుడు, అనిల్, రామకృష్ణ, విజయ్ ఉన్నారు.

నందమూరి తారక రామారావుకు నివాళులర్పించిన కొలన్ హన్మంత్ రెడ్డి ..

దుండిగల్: ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వర్యులు కీ.శే.నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శని వారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సి పాలిటీ బహదురుపల్లి చౌరస్తాలో కమ్మ సేవ సంఘం వారి ఆధ్వర్యంలో.. ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కుత్బు ల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహా నికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కమ్మ సేవ సంఘం సభ్యులు బొడ్డు రవిశంకర్, మాజీ కౌన్సిలర్ రంగారావు, ఎస్.వీరబాబు, సురేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.



అక్రమ దోపిడిపై చర్యలు తీసుకోవాలి..



నవతెలంగాణ-దుండిగల్

ప్రభుత్వ భూముల అక్రమ దోపిడిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు ఆకుల సతీష్ అన్నారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ దుండిగల్ మండలంలో బీఆర్ఎస్ కార్యాలయంలో ప్రభుత్వ భూమి 20 గుంటల కబ్జాపై చర్యలు తీసుకోకుండా తాసిల్దార్ వారికి అనుకూలంగా రిపోర్టు ఇచ్చారు. వివిధ సర్వే నెంబర్లు నందు ప్రభుత్వ భూముల కబ్జాలపై చర్యలు తీసుకోకుండా సహకరిస్తున్న ఎంఆర్ఓను బదిలీ చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే,ఎంఎల్‌సి ప్రజా ప్రతినిధు లు, ఇతర కబ్జాదారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆకుల సతీష్ తెలిపారు. ఈ మేరకు శనివారం దుండిగల్ ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా చేశారు. అంతేకాకుండా ఓపెన్ లెటర్ కార్యాలయం డోర్ కట్టి నిరసన చేపట్టారు. దుండిగల్ మండలం పరిధిలో గత సంవత్సర కాలంగా ప్రస్తుతం పనిచేస్తున్న ఎమ్మార్వో వచ్చిన నాటి నుంచి గత ఎమ్మార్వోలో మాదిరిగానే ప్రభుత్వ భూముల ఆక్రమణలపై, అలాగే అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యాలయంలో 20 గుంటల ప్రభుత్వ భూమి రోడ్డు కోసం ఆక్రమించుకొని ఉన్న చర్యలు తీసుకోకుండా తప్పుడు రిపోర్టు ఇవ్వడం. బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చెప్పినట్టు రిపోర్ట్ ఇవ్వడం కొన్నిటిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కబ్జాదారులకు సహకరించడంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి తక్షణమే దుండిగల్ ఎంఆర్ఓనుపై చర్యలు తీసుకోవాలని బీజేపీ పార్టీ, మేము డిమాండ్ చేస్తుందని తెలిపారు. దుండిగల్ మున్సిపల్ పరిధిలో పలు సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురైనాయి. ముఖ్యంగా 120 డిపోచంపల్లి, 120 బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం, 156 డిపోచంపల్లి, 227 బహదూర్‌పల్లి ,131 బహదూర్‌పల్లి, 453,454,323 దుండిగల్ 214 చర్చి గాగిల్లాపూర్ 166/9(1) బౌరంపేట్, 472 బౌరంపేట, 170 మల్లంపేట్, 684 దుండిగల్ తాండ ప్రధానంగా ప్రభుత్వ భూములు ఆక్రమించుకొని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో 20 గుంటల ప్రభుత్వ భూమిని తక్షణమే స్వాధీనం చేసుకోవాలి. బాధ్యులైన ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీకిపై కేసు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలు అక్రమ నిర్మాణాలు నిరోధించాలి దోషులపై క్రిమినల్ కేసులు నమోదు పెట్టాలి. ప్రభుత్వ భూములు పరిరక్షించడంలో విఫలమైన ప్రస్తుత ఎమ్మార్వోని తక్షణమే బదిలీ చేయాలి డిమాండ్ చేశారు. నల్ల జయశంకర్, అమలేశ్వరి, చందు, అరుణ్ రావు, పులి బలరాం, సుహాసిని శక్తి, కవి తా రెడ్డి, శ్యాం కుమార్ రెడ్డి, రమేష్ తది తరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూను సందర్శించిన హిమాచల్ ప్రదేశ్ మంత్రి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్‌ను హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రం మంత్రి రాజేష్ ధర్మాణి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రెక్టర్ డా.కె.విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డా.కె. వెంకటేశ్వర రావు, మంత్రి బృందానికి సాదర స్వాగతం పలికారు. అనంతరం రిజిస్ట్రార్, విశ్వవిద్యాలయం యొక్క దిశ, లక్ష్యాలు, సాధనలపై వివరణాత్మక పవర్‌పాయింట్ ప్రదర్శన ఇచ్చారు. వైస్-చాన్సలర్ ఇన్‌చార్జి డా. వి. బాలక్రిష్టా రెడ్డి వివిధ విభాగాల అధిపతులను పరిచయం చేశారు. వారు విశ్వవిద్యాలయం అభివృద్ధికి అందిస్తున్న కీలక పాత్రల గురించి మంత్రి బృందానికి తెలియజేశారు. ఈ పర్యటనలో ముఖ్యంగా పరీక్షల శాఖ, జే-హబ్, ఇన్‌క్యుబేషన్ సెంటర్, ఇతర ముఖ్యమైన విభాగాల్లో విశ్వవిద్యాలయం చేపడుతున్న పురోగతిపై దృష్టి సారించారు. పరీక్షా విధా నాల్లో మార్పులు, ఆటోమేటెడ్ ప్రశ్నపత్రాల తయారీ, ఆధునిక మూల్యాంకన విధానాలు, రికార్డుల డిజిటలైజే షన్, పరీక్షల భద్రత వంటి అంశాలపై చర్చలు జరిగాయి. పరీక్షల ముందస్తు అనంతర కార్యకలాపాల్లో విశ్వవిద్యాల యం చూపిస్తున్న నూతనతను మంత్రి బృందం ప్రసంశిం చారు. జే-హబ్, ఇన్‌క్యుబేషన్ సెంటర్‌లో విద్యార్థులు, అధ్యాపకుల మధ్య నూతన ఆవిష్కరణలు, పారిశ్రామికత, సహకారంపై చేపడుతున్న కార్యక్రమాలను మంత్రి బృందం సమీక్షించింది. స్టార్టప్‌లకు మద్దతు, నూతన ప్రాజెక్టుల ప్రోత్సాహానికి తీసుకుంటున్న చర్యలను అభినందించారు. ఈ సందర్శన జేఎన్‌టీయూహెచ్‌కు విద్యా సాంకేతిక పురోగతులను ఆవిష్కరించే అద్భుతమైన వేదికగా నిలిచింది. తెలంగాణలో అగ్రగామి విద్యా సంస్థగా విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను మరింత బలపరిచింది.

రేపు జాబ్ మేళా

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధి కల్పన అధికారి రాధిక

నవతెలంగాణ-సిటీబ్యూరో



జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు అంతాయిపల్లిలోని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో సోమవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రాధిక తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ జాబ్ మేళా ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేళాలో క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్, హైదరాబాద్ కంపెనీ పాల్గొంటుందని తెలిపారు. ఈ కంపెనీలో ట్రైనీ కేంద్ర మేనేజర్ (ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్) (మేల్/ఫీమేల్) పోస్టుల ఖాళీగా ఉందనీ, ఇందుకు పది, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులనీ, నెలకు టేక్ హోమ్ కింద రూ.15వేల జీతం ఉంటుందనీ, బైక్‌తోపాటు డీఎల్, ఎల్ఎల్ఆర్ తప్పకుండా ఉండాలని తెలిపారు. అర్హత గల యువతీ యువకులు www.nic.gov.in portal రిజిస్టర్ చేసుకుని హాజరు కావాలని తెలిపారు. కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులతో ఇంట ర్వ్యూ ఉంటుందనీ, మరిన్ని వివరాలకు 9866465024, 7386809422 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

నేడు విద్యుత్ ఫీడర్ నిర్వహణ మరమ్మతు పనుల కారణంగా మిలీనియం ఇండస్ట్రీ ఫీడర్ పరిధిల ఉదయం 10:00 గం॥ల నుంచి మధ్యాహ్నం 2:00 గం॥ల వరకు ఇండస్ట్రీ ఏరియా, ఎస్ 2 ఇంజినీరింగ్, వి4 ఇండస్ట్రీ, ఎస్‌బివి కే ఫంక్షన్ హాల్, మొదలైన ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని బౌరంపేట విద్యుత్ శాఖ ఏఈ బి.సాయికిరణ్ తెలిపారు.

దుండిగల్: నేడు 11 కెవి ఫీడర్ మరమ్మతులు ఇంటర్‌పోల్‌లను ఏర్పాటు వార్షిక నిర్వహణ పనుల కారణంగా జీడిమెట్ల సబ్ స్టేషన్ 5 పరిధిలో ఉదయం 10.00 నుండి మధ్యాహ్నం 1.00 గం వరకు జీడిమెట్ల ఫేజ్ 4 పారిశ్రామిక ప్రాంతానికి,అలాగే ఆంధ్రా పాలిమర్స్ ఫీడర్ పరిధిలో ఉ 10:00 గం నుంచి మ: 1:00 గం వరకు జీడిమెట్ల ఫేజ్ 5 పారిశ్రామిక ప్రాంతానికి అలాగే సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 1.30 నుండి 4.30 గంటల వరకు 3%ఊ%4 పేస్‌లకు ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని షాపూర్ నగర్ విద్యుత్ శాఖ ఏఈ కృష్ణ తెలిపారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



నవతెలంగాణ-బాలానగర్

సీఎం సహయనిధి పేదలకు వరం అని కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ ఫిరోజ్ గూడ నివాసి చాకలి రాములు గత కొంత కాలంగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కార్యాలయంలో ముఖ్యమంత్రి సయహాయ నిధికి దరఖాస్తు చేసుకోవడంతో శనివారం వారికి ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.60 వేల చెక్కును వారి భార్యకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్ రవీందర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నిరుపేద ప్రజలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకోలేని వారికి ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న వారికి బాలానగర్ కార్పొరేటర్ కార్యాలయంలో భాదితు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, కార్పొరేటర్ రవీందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని సీఆర్‌పీ కృష్ణ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి, రంగారెడ్డినగర్ ప్రాంతంలో ప్రాథమిక పాఠ శాల ప్రధానోపాధ్యాయులు కల్పనా రెడ్డి సహాయంతో ఆయన బడిబయట ఉన్న పిల్లలను గుర్తించడానికి ఓఎస్సీ సర్వే నిర్వహించారు. అందులో భాగంగా అనుప్ అనే విద్యార్థి బీహార్ నుంచి వలస వచ్చి బడిలో ఇప్పటివరకు చేరకపోవడంతో ఆ విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి కారణాలు తెలుసుకొని పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలన్నారు. ఏ ఇతర పనుల్లో, కర్మాగారాల్లో పనికి పంపకూడదు అన్నారు. ఆ విద్యార్థిని రంగారెడ్డినగర్ పాఠశాలలో 5వ తరగతిలో చేర్పించారు. 6-15 ఏండ్ల పిల్లలు కచ్చితంగా పాఠశాలకు పంపాలని వారికి సూచించారు. చదువుతోనే ప్రతి ఒక్కరికీ ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.

శ్రీశైలంలో మల్లికార్జున స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

శ్రీశైలములో శ్రీ శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానాన్ని కూన శ్రీశైలం గౌడ్ శనివారం ఉదయం దర్శించుకున్నారు. అనంతరం వేద పండితుల అర్చనలు పొందారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ... హరహర మహదేవ శంభో శంకరుని ఆశీస్సులు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని వారు కోరుకున్నారు. ఈ సందర్శనలో రోయపల్లి మల్లేష్ గౌడ్, వినోద్ రావు, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గంలో 36 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే శ్రీ గణేష్ శనివారం ముఖ్యమంత్రి సహాయం నిధి చెక్కులను అందజేశారు. తన క్యాంపు కార్యా లయంలో ప్రత్యేకంగా ఒక కార్యక్రమం నిర్వహించి చెక్కు లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. పేదల ఆరోగ్యం పట్ల రేవంత్ రెడ్డి సర్కారు కట్టుబడి ఉందని, ప్రతి పేదవానికి కార్పొరేట్ వైద్యం అందిం చే దిశగా ప్రయత్నాలు చేస్తుందని తెలిపారు. అందులో భాగంగానే ఆరోగ్య శ్రీని 5 నుంచి 10 లక్షలకు పెంచి ందని చెప్పారు. అలాగే కొత్తగా, కొత్త టిమ్స్ హాస్పిటల్స్ నిర్మిస్తుందని అన్నారు. ఆస్పత్రి పూర్త యితే అందులో పేద ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

బ్రోచర్స్ విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యే



నవ తెలంగాణ-ఓయూ

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన సందర్భంగా యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెం పొందించాలనే ఉద్దేశంతో బీఆ ర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి నాగారం ప్రశాంత్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్న విషయం తెల్సిందే. టోర్నమెంట్‌కు సంబంధించి బ్రౌచరును తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు డా.గాదరి కిషోర్ కుమార్ తన నివాసంలో శనివారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పడాల సతీష్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు జిల్లా నాగయ్య, పవన్, మిథున్ ప్రసాద్, వేల్పుకొండ రామకృష్ణ, శ్రీకాంత్, వడ్డేపల్లి సందీప్, సాయి, అనిల్, నవీన్, శివ, ప్రేమ్ కుమార్, ఉదయ్ ప్రవీణ్ పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను అరికట్టాలి



నవతెలంగాణ-కంటోన్మెంట్

బాలకార్మిక వ్యవస్థను అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు, బాలల హక్కుల పరిరక్షణ సమితి ప్రతినిధులు సంయుక్తంగా శనివారం ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థలకు సంబంధించి వారు రూపొందించిన నివేదికను ఎమ్మెల్యేకు అందించారు. అనంతరం వారు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ.. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, మరి కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు సరిగా లేకపోవడం వల్ల విద్యార్థులు మధ్యలోనే పాఠశాలకు వెళ్లడం మానేస్తున్నారని, ఈ పరిస్థితిని మెరుగుపరచాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించడానికి కృషి చేస్తుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి సమాధానం ఇచ్చారు. కంటోన్మెంట్ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలను తాను స్వయంగా పరిశీ లిస్తానని, ఎలాంటి సమస్యలున్నా తాను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్వచ్ఛంద బాలల హక్కుల పరిరక్షణ సమితి ప్రతిని ధులు ప్రవీణ్, లక్ష్మీనారాయణ, సువర్ణ ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధులు దుర్గ, రమాదేవి, మదర్స్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ నుంచి జమున పాల్గొన్నారు.

అన్నానగర్‌లో డ్రయినేజీ పనులకు శంకుస్థాపన



- అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదు
- కంటోన్మెంట్ బోర్డ్ వైస్ ప్రెసిడెంట్ జన్యావుల రామకృష్ణ

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని మూడొవ వార్డ్ అన్నానగర్‌లో బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ శనివారం అండర్ గ్రౌండ్ డ్రయినేజి నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన బస్తీలో తిరిగి స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. కానీ ఏడాది కావస్తున్నా హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఎద్దేవా చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం నయా పైసా అభివృద్ధి చేయలేదని, కంటోన్మెంట్‌లో జరిగే అభివృద్ధి అంతా కూడా బోర్డు నిధులు, కేంద్ర ప్రభుత్వ నిధులతోనే జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహంకాళి సికింద్రాబాద్ జిల్లా స్పోక్స్ పర్సన్ బి.ఎస్ శ్రీనివాస్, వార్డ్ బీజేపీ అధ్యక్షులు ఐత అరుణ్, నాయకులు మధు, హరి కృష్ణ, శ్రీధర్, నరేష్, మల్లేష్, అనురాధ, రేణుక, భువనేశ్వరి, స్వాతి, దీప తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ కాలాన్ని తగ్గించాలి



- ఓయూ జేఏసీ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్

నవతెలంగాణ-ఓయూ

పదవి విరమణ వయసుని 62 నుంచి 58 కు తగ్గించి ఏటా తొమ్మిది వేల ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగులకు అండగా ఉండాలని ఓయూ జేఏసీ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్ అన్నారు. శనివారం ఆయన వయో పరిమితి పెంపు వద్దని ఫ్ల కార్డ్స్‌తో నిరసన వ్యక్తం చేశారు. వయోపరిమితిని తగ్గించకుంటే కాంగ్రెస్ ప్రభుత్వంకి వినతి చేస్తున్నామని లేని పక్షంలో సరూర్‌నగర్ స్టేడియంలో ఏ ప్రియాంక గాంధీ అయితే యూత్ డిక్లరేషన్ చెప్పి తెలంగాణ నిరుద్యోగులను మోసం చేసిందో అదే స్టేడియంలో నిరుద్యోగుల బహిరంగ సభ పెట్టి నిరుద్యోగుల సత్తా ఏందో చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు విశేష కృషి

- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి





నవతెలంగాణ-బంజారాహిల్స్

నగరంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు విశేష కృషి చేస్తున్నట్టు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. శనివారం మేయర్ వెంకటేశ్వర నగర్ కాలనీ, షేక్ పేట్ డివిజన్‌లోని పలు కాలనీలలో కార్పొరేటర్లు కల్పన రెడ్డి, మహమ్మద్ రషీద్‌లతో కలిసి వెంకటేశ్వర కాలనీ డివిజన్ లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలిసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ సింగిడి కుంట ప్రాంతంలో టి.ఆర్.ఎస్ భవన్ నుండి బంజారా లేక్ వరకు గల నాలా 2.5 కిలోమీటర్ల నాలా పై సుమారు 30 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన బాక్స్ డ్రెయిన్ పనులు పరిశీలించారు. డ్రెయిన్ నాలా పనులతో పాటుగా త్రాగు నీటి పైప్ లైన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మేయర్ వాటర్ వర్క్స్ శాఖ అధికారులను ఆదేశించారు. డ్రైన్ పూర్తయిన తర్వాత వాటర్ పైప్ లైన్ కోసం తిరిగి తవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పనులు చేపట్టే సందర్భంలో ప్రజలు సహకరించాలని ఆమె ప్రజలను కోరారు. బాక్స్ డ్రైన్ నిర్మాణంలో రోడ్డు చిన్నగా ఉన్న నేపథ్యంలో నిర్మాణ సమయంలో కాలనీ వాసులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. ఎవ్వరి ఇళ్లను కూడా ముట్టుకోరని ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే దానం నాగేందర్ కాలనీ వాసులను కోరారు. అదే వార్డులో గల ప్రతాప్ నగర్‌లో ప్రతిపాదించిన మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. మేయర్, తాను, అధికారులు కలిసి మరొక సారి క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. అదే కాలనీలో అంతర్గత రోడ్లు వాటర్ పైప్ లైన్ వేసే సందర్భంలో తవ్వి మరమ్మత్తులు చేయకుండా వదిలి పెట్టారని అందుకు సీసీ రోడ్లు వేయాలని కాలనీ వాసులు విన్నవించారు. ఈ సందర్భంగా మన్నె కవిత రెడ్డి మాట్లాడుతూ.. నిధులు మంజూరు అయిన నేపథ్యంలో ఎమ్మెల్యే వచ్చే సోమవారం శంకుస్థాపన చేయనున్నట్టు కార్పొరేటర్ వివరించారు. ప్రతాప్ నగర్ కాలనీలో ఖాళీ స్థలంలో చెత్తతో పాటుగా ద్విచక్ర వాహనాలు పడవేసి ఉండటంతో వెంటనే చెత్త తొలగించి ఫోటో పెట్టాలని ఏ ఎం అండ్ హెచ్ ఓ ఆదేశించారు. తిరిగి చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని ఖాళీ స్థలంలో వేసిన వారిపై జరిమానా విధించాలని మేయర్ ఆదేశించారు. అక్కడ నుండి షేక్ పేట్ డివిజన్‌లో కార్పొరేటర్ మహమ్మద్ రషీద్‌తో కలిసి పలు కాలనీలో పర్యటించి అక్కడికక్కడే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడికక్కడే అధికారులకు ఆదేశించారు. పార మౌంట్ కాలనీలో బలకపూర్ నాలా కంటే హైట్ తక్కువగా ఉన్న ప్రాంతంలో వర్షపు నీరు నిలిచిపోకుండా ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు మేయర్‌కు వివరించడంతో బలకపూర్ నాలా హైట్ కంటే తక్కువ ఉన్న నేపథ్యంలో వాటర్ హెూల్డింగ్ స్ట్రక్చర్ నిర్మించి నిలిచిన నీరును బల్కపూర్ నాలాలోకి పంపించేందుకు అవసరమైన అంచనా ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. సీ.సీ రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్నామని వెంటనే సీసీ రోడ్డుకు ఏర్పాటు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అక్కడ నుండి ఆదిత్య నగర్ రోడ్డు, రాహుల్ కాలనీలలో పర్యటించి స్టార్మ్ వాటర్ డ్రైన్‌లో పై నుండి డ్రైన్ లో మురుగు నీరు రావడం మూలంగా లోతట్టు ప్రాంతాలు మురుగు నీరు నిలిచి ప్రజలకు ఇబ్బందులు పడుతున్నారని, కాలనీ వాసులు మేయర్‌కు విన్నవించగా ఇట్టి సమస్యకు గల కారణాలను తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని మేయర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. కనీస వసతులు ప్రజలకు కల్పించాలనే ఉద్దేశ్యంతో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యటించి దీర్ఘ కాలిక సమస్యలను శాశ్వత పరిష్కారం చేయుటకు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేసి పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు మేయర్ పేర్కొన్నారు. నగర వ్యాప్తంగా అన్ని డివిజన్‌లో పర్యటించాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్టు, ముందుగా స్టాండింగ్ కమిటీ సభ్యుల వార్డుల్లో పర్యటించి తదుపరి అన్ని వార్డులో పర్యటింస్తామని మేయర్ తెలిపారు. ఎక్కువగా చెత్త వేసే ప్రదేశాలను గుర్తించి తిరిగి అక్కడ చెత్త వేయకుండా నివారించే ప్రక్రియలో భాగంగా బిన్ లను ఏర్పాటు చేసి తద్వారా క్లీన్ సిటీగా ఉండడానికి బిన్‌లో వేసే విధంగా నిర్దేశించిన ప్రదేశాలలో ఏర్పాటుకు జీహెచ్ఎంసీ చర్యలు తీసుకున్న నేపథ్యంలో బిన్‌లో చెత్త కుండీ నిండుతుండగా ఆటోమేటిక్‌గా కుండీ నుండి శబ్దం రావడంతో అట్టి సమాచారం కంట్రోల్ రూంకు సమాచారం పోతుంది. అక్కడి నుండి వాహనం నిండిన చెత్త కుండీ వద్దకు వచ్చి చెత్తను బిన్ నుండి మానవ రహితంగా యంత్రం డంప్ చేసుకొని పోతుంది. చెత్త రహిత సమాజం కోసం జీహెచ్ఎంసీ కసరత్తు చేసింది. నగర వ్యాప్తంగా ఈ చర్యలు తీసుకోనున్నట్టు మేయర్ వివరించారు. అదే విధంగా వేసిన చెత్త ను కూడా యంత్రాలు తొలగి ంచేందుకు చర్యలు తీసుకున్నారు. షేక్ పేట్ వద్ద అట్టి మిషన్ పనితీరును మేయర్ అధికారులతో పరిశీలించారు. మిషన్ పని తీరును గతంలో కంటే మెరుగైన పద్ధతి లో పని చేసే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికా రులను మేయర్ ఆదేశించారు. ఈ పర్యటనలో భాగంగా జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కమిషనర్ శివ కుమార్ నాయుడు, ఎస్.ఎన్.డీ.పీ.సీ.ఈ కోటేశ్వర రావు, జోనల్ ఎస్ ఈ రత్నాకర్, డీసీ రజనీ కాంత్ రెడ్డి, ఈ.ఈ విజయ్ కుమార్, జోనల్ యూబీడీ, యూసీడీ, ఏ.ఎం.అండ్.హెచ్.ఓ భార్గవ్ నారాయణ పాల్గొన్నారు.

ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అందుకు అనుగుణంగానే అభివృద్ధి పనులను చేపడతామని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం పద్మారావునగర్‌లోని వెంకటాపురం కాలనీలో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెంకటాపురం కాలనీ వాసులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తన హయాంలోనే పరిష్కరించిన విషయాన్ని గుర్తుచేశారు. రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థ సరిగా లేక ఇబ్బందులు పడుతున్న స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చిన వెంటనే అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టి ఇబ్బందులను దూరం చేసినట్టు వివరించారు. అదేవిధంగా కాలనీ వాసులు తమకు ఒక పార్క్ కావాలని కోరగ, త్వరితగతిన పార్క్‌ను అద్భుతంగా అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకొచ్చినట్టు గుర్తుచేశారు. వెంకటాపురం కాలనీలో పార్క్ పక్కనే శిధిలావస్థలో ఉన్న కమ్యూనిటీ హాల్ స్థానంలో నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.40 లక్షల మంజూరు చేయించడం జరిగిందన్నారు. కమ్యూనిటీ హాల్ కాలనీ వాసుల అవసరాల కోసమే నిర్మిస్తున్నామని దానిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యేను కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు. కమ్యూనిటీ హాల్ ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణం కూడా చేపట్టాలని కోరగా, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం న్యూ బోయగూడలోని ఉప్పలమ్మ దేవాలయం పరిధిలో అధికారులతో కలిసి పర్యటిం చి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆలయం పక్కనే ఉన్న బస్తీలకు సరైన రోడ్లు లేకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నామని, మురుగునీరు రోడ్లపై నిలిచిపోతుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందిం చిన ఆయన రోడ్ల నిర్మాణం చేపట్టడానికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అక్కడే ఉన్న డిప్యూటి మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యను ఆదేశిం చారు. దాదాపు అన్ని ప్రధాన రహదారులను ఇప్పటికే అభివృద్ధి చేయడం జరిగిందని, కొన్ని బస్తీలకు సంబంధించిన చిన్న చిన్న రహదారుల పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని, త్వరలోనే వాటిని కూడా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటామని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం బోయ గూడలోని టింబర్ డిపో లైన్‌లో రూ.20లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రయినేజీ పైప్ లైన్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, డీసీ సమ్మయ్య లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్, జీహెచ్ఎంసీ ఈఈ సుదర్శన్, వాటర్ వర్క్స్ జీఎం వినోద్, టౌన్ ప్లానింగ్ డీసీపీ సుష్మిత, నాయకులు ఏసూరి మహేష్, శ్రీకాంత్ రెడ్డి, వెంకటా పురం కాలనీ అధ్యక్షుడు వజీర్ మోహన్, సకినాల రాజు, చక్రధర్ యాదవ్, సుధాకర్, రమణ, పద్మిని, ఆశ, విజయలక్ష్మి గజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యా శాఖ కార్యదర్శిని కలిసిన ఓయూ వీసీ



నవతెలంగాణ-ఓయూ

ఓయూ వీసీ ప్రొ. కుమార్ ఇటీవలే ఉన్నత విద్యా శాఖ కార్యదర్శిగా నియామకమైన డాక్టర్ యోగితా రాణాను శనివారం సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛము అందించి అభినంద నలు తెలిపారు. ఈ సందర్భంగా ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. జి నరేష్ రెడ్డి, ఓఎస్డీ ప్రొ. జితేంద్ర నాయక్‌లను ఆమెకి ప్రొ. కుమార్ పరిచయం చేశారు.

ఇబ్బందులు లేకుండా ఆలయాలు తొలగించాలి

- కమిటీల అభిప్రాయం తీసుకోవాలి
- భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులు టీఎన్.మురారి



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో భాగంగా ఆలయాలను తొలగించే ప్రక్రియలో ఇబ్బందులు లేకుండా చూడాలని భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులు టీఎన్. మురారి అన్నారు. శనివారం తాడ్బండ్ చిన్న తోకట్ట హనుమాన్ దేవాలయంలో కమిటీ సభ్యులతో కలిసి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కారిడార్ నిర్మాణం వల్ల కంటోన్మెంట్‌లో అనేక పురాతన దేవాలయాలు కనుమరుగు కానున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయాలను సంరక్షిస్తూ అభివృద్ధి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. కంటోన్మెంట్ ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదని ఆలయాల పరిరక్షణకు ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని డిమాండ్ చేశారు. కంటోన్మెంట్ ప్రాంతంలో దాదాపు 50 నుంచి 100 ఏండ్ల చరిత్ర గల దేవాలయాలను ఎలాంటి అనుమతులు లేకుండా కూల్చివేస్తామంటే సరికాదన్నారు. ఎలివేటెడ్ కారిడార్ పరిధిలోని దేవాలయాల కమిటీలతో చర్చించకుండా ఆలయాలు కూల్చివేస్తే సహించేది లేదని పేర్కొన్నారు. చిన్న తోటలోని శ్రీ సంజీవిని ఆంజనేయస్వామి దేవాలయానికి 1971లోని దేవదాయ శాఖ గుర్తించిందని, ఆలయ పరిరక్షణార్థం కోర్టులో ఉన్నప్పటికీ కొంతమంది వచ్చి ఆలయ కూల్చివేతలో నోటీసులు అందజేయడం అలాంటి వారిపై కూడా చర్యలు తీసుకోవడానికి తామ సిద్ధమని తెలిపారు. ఇలాంటి ఎన్నో ఆలయాలు ఎలివేటెడ్ కారిడాడు నిర్మాణంలో భాగంగా కూల్చివేస్తామంటే తాము చట్ట ప్రకారం కోర్టు పరిధిలో ఉన్న ఆలయాల రక్షణకై సిద్ధమని అన్నారు. సుప్రీం కోర్టు నిబంధన ప్రకారం ఆగమశాస్త్రం నిబంధన మేరకు ఆలయాల రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలకు అతీతంగా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

బసవతారకం హాస్పిటల్‌లో ఎన్టీఆర్ వర్ధంతి

- ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు పుష్పాంజలి ఘటించిన బాలకృష్ణ



ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్స్టిట్యూట్‌లో శనివారం సంస్థ ఛైర్మెన్ నందమూరి బాలకృష్ణ ఘనంగా నివాళు లు అర్పించారు. ముందుగా హాస్పిటల్ ఆవరణలో ఉన్న ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ సామాన్య రైతు కుటుంభంలో పుట్టి సినిమా రంగం మహరాజులా పెరిగారనీ పౌరాణికాలు ప్రాణాలు పోసుకుంటే, జానపదాలు జావళిలు పాడాయి అన్న రీతిన ఆయన సినిమారంగంలో రాణించారని, దేశమంతా గాలించినా ఆయనలా నటనలో ప్రయోగాలు చేసిన వ్యక్తి లేరని కొనియాడారు. ఆయన సినిమా రంగంలో రాణిస్తూనే పలు సామాజిక కార్యక్రమాలు చెపట్టారని, తెలుగు రాష్ట్రాలు ఎదుర్కొన్న ఎన్నో సంక్షోభాలలో తన వంతు పాత్ర పోషించారని చెప్పారు. తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయమైన స్థానాన్ని పొందారన్నారు. తనను అభిమానించే తెలుగు ప్రజలకు ఏదో చేయాలనే కోరికతో ఆయన పని చేశారని, ఈ పనిలో ప్రాంతల మధ్యలో భేదాలు చూపకుండా అందరినీ కలుపుకుంటూ పని చేసిన వ్యక్తని బాలకృష్ణ అన్నారు. రాజకీయాలకు రావడమే కాకుండా ప్రజలలో రాజకీయాల పట్ల చైతన్యం తీసుకొనివచ్చిని వ్యక్తి అని, తెలుగుదేశం పార్టీని స్థాపించి అఖండ విజయంతో ప్రజలలో కూడా రాజకీయ హీరోగా గుర్తింపు సాధించారని చెప్పారు. మా తల్లి క్యాన్సర్‌లో భాదపడి మరణించిన పిదప, పేదవారందరికీ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్యాన్సర్ వైద్యం అందించాలనే సంకల్పంతో ఎన్టీఆర్ ఆశలకు రూపమే ప్రస్తుతం మనం చూస్తున్న బసవతారకం ఇండో అమెరికన్

ఘనంగా ఎన్టీఆర్ 29వ వర్ధంతి











నవతెలంగాణ-బంజారాహిల్స్/జూబ్లీహిల్స్

రంగం ఏదైనా కానీ ప్రజలా మెప్పు పొందిన మహనీయుడు అన్న ఎన్టీఆర్ అని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే గోపీనాథ్ అన్నారు. శనివారం జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిల్మ్‌నగర్ చౌరస్తాలో మాజీ సీఎం ఎన్టీఆర్ 29వ వర్ధంతి వేడుకలు జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్, స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, యూసఫ్ గూడ కార్పొరేటర్ రాజ్ కుమార్ పటేల్, పరుచూరి గోపాల కృష్ణ, నందమూరి కుటుంబ సభ్యులు ముఖ్య అతిధులుగా పాల్గొని విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఎమ్మెల్యే గోపినాద్ మాట్లాడుతూ.. రంగం ఏదైనా కానీ ప్రజలా మెప్పు పొందిన మహనీయుడు అన్న ఎన్టీఆర్ అని ప్రజల గుండెల్లో నిరంతరం బతికే ఉన్నారని, ఆయన పాలనలో అందించిన వివిధ పథకాల అమలు అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు, చేసిన సేవలు దానికి నిదర్శనం అన్నారు. కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ మాట్లాడుతూ.. సినీ, రాజకీయ రంగాల్లో తెలుగు ప్రజల కీర్తి ప్రతిష్టలు ప్రపంచానికి చాటిన మహానీయుడన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ఓయూ

సామాజిక న్యాయనికి ఆద్యుడు, వెండితెర రారాజు, మాజీ ముఖ్యమంత్రి టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు 29వ వర్ధంతిని శనివారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఎదుట చంద్రబాబు నాయుడు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పీహెచ్డీ స్టూడెంట్ తలారి. శ్రీనివాసరావు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయిన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిమ్న వర్గాలకు, యువకులకు రాజకీయ అవకాశాలు కల్పించిన గొప్ప రాజనీతిజ్ఞుడు అంటు కొనియాడారు. పటేల్ పట్వారీ వ్యవస్థను రద్దు చేసి రూ.2కి కిలో బియ్యం, పేద విద్యార్థుల ఉచిత మధ్యాహ్నం భోజన పథకం తీసుకు వచ్చిన సంక్షేమ స్వప్నికుడు అన్నారు. కేంద్ర ప్రభుత్వం జాప్యం చేయకుండా ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓయూ ఓటీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.మహేష్, రాము, సాయి, సింధు, వినయ్, బి.మహేష్, ప్రశాంత్, ప్రణీత్, తాన్వేష్, విష్ణు, మహేష్, రాకేశ్, రాము విద్యార్థులు పాల్గొన్నారు.

బౌద్ధనగర్‌లో...

బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షులు గరిగే ప్రవీణ్ కుమార్ వారాసిగూడ చౌరస్తాలో మాజీ సీఎం ఎన్టీఆర్‌కు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మంద వెంకటస్వామి, సుధాకర్, కత్తెర శ్రీనివాస్ యాదవ్, జోరు గల రాజు, టెంట్ హౌస్ శంకర్, ప్రవీణ్ ముదిరాజ్, శ్రీకాంత్ లక్ష్మణ్ లక్ష్మీరాజ్యం గౌడ్ పాల్గొన్నారు.

తార్నాకలో...

తార్నాక డివిజన్ అధ్యక్షులు గండికోట విజయ్ కుమార్ మాణికేశ్వరి నగర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అలకుంట బుచ్చయ్య, వరికుప్పల సహదేవా, గండికోట గిరిబాబు, వి.పవన్, జి.మహేష్, బి.రాము, ఎ.శ్రీను, లక్ష్మన్, కృష్ణ పాల్గొన్నారు.

సీతాఫల్‌మండిలో...

సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు జీవీ కృష్ణ ఆధ్వర్యంలో నామాలగుండు చౌరస్తాలో శనివారం ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేత వల్లారపు.శ్రీనివాస్, సీనియర్ నాయకులు చిరంజీవి రాజు, శేషిరేఖ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రేషన్ కార్డుల సర్వేలో దళారుల జోక్యాన్ని నివారించాలి



- మర్రి పురువ రెడ్డి

నవతెలంగాణ-బేగంపేట్

ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహిస్తున్న రేషన్ కార్డుల సర్వేతో పాటు వివిధ ప్రభుత్వ పథకాల సర్వేలో అక్కడక్కడ దళారులు జోక్యం చేసుకుంటున్నారని ఆయా ప్రాంత ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు, బీజేపీ రాష్ట్ర యువ నాయకులు మర్రి పురువ రెడ్డి సనత్‌నగర్ బీజేపీ ముఖ్య నాయకులతో కలిసి, సికింద్రాబాద్‌లోని బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య కలిసి సర్వేను నిష్పక్షపాతంగా జరిపించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. సర్వేలో నిజమైన లబ్ధిదారులకు ఎక్కడ అన్యాయం జరగకుండా చూడాలని, అందుకు అవసరమైతే ఆయా ప్రాంతాల్లో అఖిలపక్ష నాయకుల సహకారం తీసుకోవాలని సూచించారు. అలా కాకుండా సర్వే అధి కారులు దళారుల మాటలు విని నిజమైన లబ్ధిదారులకు అన్యాయము చేయా లని చూస్తూ ఊరుకోమని అవసరమైతే పార్టీ పరంగా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమములో బీజేపీ సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, కె.కృష్ణ, అంబాలా ఈశ్వర్ బాబు, ఎ. కుమార్, కిరీట, బి. వికాస్, కె. నరేష్, దొండే సురేష్, పార్శి పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మంచినీటి సరఫరా బంద్..

- సుల్తాన్ బజార్ సెక్షన్, హిందీ నగర్ సెక్షన్‌లో మంచినీటి సరఫరా బంద్

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

నారాయణగూడ డివిజన్ మంచినీటి సరఫరా 600 ఎంఎం ఇన్ లెట్ వాల్ మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం సుల్తాన్ బజార్ సెక్షన్, హిందీ నగర్ సెక్షన్ పరిధిలో మంచినీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు శనివారం జలమండలి అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. సుల్తాన్ బజార్ సెక్షన్ పరిధిలోని గుజరాత్ గల్లి, ప్రేమ్ బాగ్, చిల్ బండ, రఘునాథ్ బాగ్, గణేష్ టెంపుల్, ఇసామియా బజార్, సుల్తాన్ బజార్ , బడి చౌడి,కోఠి ప్రాంతాల్లో మంచినీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. హిందీ నగర్ సెక్షన్ పరిధిలో ఏక్ మినార్ మజీద్, పటేల్ నగర్, గౌస్ పుర, హెూమ్ నగర్, సేవక్ నగర్ ,స్వామి దయానంద్ నగర్, హిందీ నగర్, హజారి భవన్ ప్రాంతాల్లో మంచినీటి సరఫరా ఆదివారం నిలిపివేస్తున్నట్లు చెప్పారు. మంచినీటి వినియోగదారులు సహకరించాలని కోరారు.

లోకల్ క్యాడర్ గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ- సిటీబ్యూరో

లోకల్ క్యాడర్ గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా నూతన కార్యవర్గం జిల్లాలో కుచడి జ్యోతి ఆధ్వర్యంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకైంది. జిల్లా అధ్యక్షులుగా హెచ్ ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి యస్ నరేశ్ ,గౌరవ అధ్యక్షులు నడింపల్లి ఉమాదేవి , సహాధ్య క్షులు టీ. విజయకుమార్, కార్యదర్శి బక్షి ఆనంద్ , ఆర్థిక కార్యదర్శి సబితా రాణి , ఉపాధ్యక్షులుగా అనీలా మంజుల, మహిళా కార్యదర్శి ఏ పద్మా రెడ్డి, భీమేశ్వరిర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పడిన జిల్లా బాధ్యులను రాష్ట్ర అధ్యక్షులు మామిడోజు వీరాచారి , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల లక్ష్మీకాంత రెడ్డి , గౌరవ అధ్యక్షులు కే యాదగిరి , ఆర్థిక కార్యదర్శి నళిని , రాష్ట్ర మహిళా కార్యదర్శి కోట సుకన్య అభినందించారు. ఈ సందర్భంగా వారు హైదరాబాద్ జిల్లా సిటీ కేడర్ ను పునరుద్ధరించాలని, రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 రద్దు చేస్తూ దాని స్థానంలో 1975 లోఇందిరాగాంధీ ఇచ్చిన రాష్ట్రపతి ఉత్తర్వులు 1975ని పునరుద్ధరించాల్సిందిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయండి



- నిర్దేశించిన సమయానికి కులగణన సర్వే పూర్తి చేయడం ఉద్యోగుల సామర్థ్యానికి నిదర్శనం
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ- సిటీబ్యూరో

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వ ఉద్యోగులు ప్రధాన పాత్ర వహించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం హైదరాబాద్ జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం 2025 సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగ పడే సంక్షేమ పథకాలు అమలు చేయడంలో గెజిటెడ్ ఉద్యోగులు తమ వంతు కృషి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో చేపట్టిన కుల గణన కు ఎలాంటి ఇబ్బంధులు లేకుండా భాద్యతతో సమర్థవంతంగా పూర్తి చేశారన్నారు. కొత్త సంవత్సరంలో ఉద్యోగులు ఆరోగ్యపరంగా బాగుండాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో 42 వేల మంది గెజిటెడ్ అధికారులు ఉన్నారనీ , వారు ప్రభుత్వ ఉద్యోగులకు దిక్సూచిగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన టీజీఓ ఉద్యోగుల సంఘం 2025 డైరీ ని ఆవిష్కరించారు.

గెజిటెడ్ ఉద్యోగులసంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి ఉద్యోగులు వారధి లా పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయడం లో ఉద్యోగులు చిత్తశుద్ధి తో కృషి చేయాలన్నారు. రాష్ట్ర గెజిటెడ్ ఉద్యోగులందరు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం లో ఎప్పటికప్పుడు సంసిద్ధులుగా ఉంటారని, తమ ఉద్యోగులందరూ ప్రభుత్వనికి అన్ని వేళల సహ కరిస్తుంటామన్నారు. చిత్త శుద్ధితో పనిచేస్తు,, ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ జిల్లా టీజీఓస్ ప్రెసిడెంట్ ఎంబి. కృష్ణ యాదవ్ మాట్లాడుతూ ఉద్యోగుల సహకారంతో అన్ని సంక్షేమ పథకాలను అమలు పర్చడంలో, జిల్లా కలెక్టర్ ఆదేశాలను సారం మన జిల్లా అధికారులు ముందున్నారనీ కలెక్టర్ ప్రోత్సాహంతో మునుముందు ఇంకా మరింత రెట్టింపు ఉత్సాహంతో పని చేసి జిల్లాను రాష్ట్రం లోనే ప్రథమ స్థానం వచ్చేటట్లు పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఓస్ సెంట్రల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, బి శ్యాం. జగన్మోహన్రావు. పరమేశ్వర్ రెడ్డి. సుజాత హైదరాబాద్ కార్యదర్శి ఖాదర్, ఆశన్న. డాక్టర్ ఎన్ సురేందర్. కోటాజి. ఎన్జీలరెడ్డి. వెంకటరమణారెడ్డి. శ్రవణ్ కుమార్ శ్రీరాములు డాక్టర్ రమేష్ డాక్టర్ సందీప్ పసుపులేటి శ్రీనివాస్ ప్రభాకర్ డాక్టర్ సునీత జోషి టీఎన్జీవో జిల్లా నాయకుడు విక్రమ్ కుమార్, వివిధ డిపార్ట్మెంట్ల అధ్యక్ష కార్యదర్శులు జిల్లాలోని గెజిటెడ్ ఆఫీసర్లందరూ పాల్గొన్నారు.



మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- డీవైఎఫ్ఐ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ- సిటీబ్యూరో

భారత ప్రజాతంత్ర యువజన సమైక్య (డీవైఎఫ్ఐ) హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయం లో.రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతులు మీదుగా డీవైఎఫ్ఐ 2025 సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నేడు యువత డ్రగ్స్, గంజాయి ఇతర మాదకద్రవ్యాలకు అలవాటు పడి వారి జీవితాన్ని ఆగం చేసుకుంటున్నారని తెలిపారు. నేటి యువత భగత్ సింగ్ ఆశయాలను అయన స్ఫూర్తితో సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. మహనీయుల ఫొటోలతో వేసిన క్యాలెండర్ ను చూసి డీవైఎఫ్ఐ సంఘాన్ని అభినందించారు. యువతను చైతన్యం చేసే కార్యక్రమలకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు.డ్రగ్స్, గంజాయి మాదకధృవ్యాల పై ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతుందని అన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జావీద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మహనీయుల ఆశయాల స్ఫూర్తితో క్యాలెండర్‌ను తీసుకొస్తున్నామని అన్నారు. నేటి యువత కి, విద్యార్థుల కు భారత, తెలంగాణ రాష్ట్ర మహనీయుల గురించి తెలుసు కోవాలిన అవసరం ఉందని అన్నారు. డీవైఎఫ్ఐ సంఘం పోరాట కార్యక్రమలే కాకుండా ప్రజలకు అవసర పడే సేవ కార్యక్రమలు కూడా చేస్తుందని అన్నారు. గత ఐదు సంవత్సరాలుగా డ్రగ్స్, గంజాయి నిర్మూలన కోసం నిరంతరం పోరాడుతుందని అన్నారు. చైతన్యవంతమైన కార్యక్రమాలకు ప్రభుత్వం నుండి సహకారం ఉందంటున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం లో డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు రాజయ్య, హస్మిత తదితరులు పాల్గొన్నారు.

మిషన్ మోడ్‌లో ఫైల్స్ ను పరిష్కరించాలి

- 3 నెలలకు పైగా పెండింగ్ లోని ఫైల్స్ ను ప్రత్యేక డ్రైవ్ ద్వారా క్లియర్ చేయాలి : కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- సెక్షన్‌ల వారీగా సమీక్షించిన కలెక్టర్

నవతెలంగాణ- సిటీ బ్యూరో



కలెక్టర్ కార్యాలయంలో వివిధ సెక్షన్ లలో పెండింగ్ లో ఉన్న ఫైల్స్ ను మిషన్ మోడ్ లో పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సెక్షన్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మీటింగ్ హాల్లో కలెక్టరేట్ లోని అన్ని డిపార్ట్మెంట్లతో సెక్షన్ ల వారీగా సమీక్షించారు. ఒక్కొక్క సెక్షన్ ను సమీక్షిస్తూ ఎన్ని ఫైల్స్ పెండింగ్ లో ఉన్నాయి అని అడిగి తెలుసుకున్నారు.ఫైల్స్ ను సమయానికి సమర్థవంతంగా పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ ఫైల్స్ ను ట్రాక్ చేసి చర్యలు తీసుకోవాలని, ఫైల్స్ ను ఎక్సెల్ షీట్ లో నమోదు చేసి ఏ ఫైల్స్ పెండింగ్ ఉన్నాయి వాటి పరిష్కారం కోసం ప్రతి వారం సంబంధిత సెక్షన్ సిబ్బందితో సూపరింటెండెంట్ లు సమీక్షించి ఫైల్ లు క్లోజ్ అయ్యే వరకు ఫాలో అప్ చేయాలన్నారు. 3 నెలలకు పైబడిన ఫైల్స్ ను స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ముకుంద రెడ్డి,జిల్లా రెవిన్యూ అధికారి ఈ. వెంకట చారి, సెక్షన్ సూపరింటెండెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాల్పుల నిందితులెక్కడ..?

- విస్తృతంగా గాలిస్తున్నా లభించని ఆచూకీ
- చాకచక్యంగా రాష్ట్రాలు దాటేస్తున్నారా...?



నవతెలంగాణ-సిటీబ్యూరో

అఫ్జల్ గంజ్ కాల్పుల కేసులో మూడు రోజులైనా నిందితుల ఆచూకీ లభించక పోవడంతో సంచలనం రేపుతోంది. కొద్ది రోజుల క్రితం ఛత్తీస్‌గడ్‌లో ఏటీఎం సిబ్బందిని బెదిరించి రూ.70లక్షలు కాజేసిన మనీష్ గ్యాంగ్ ఆ తర్వాత, గురువారం (జనవరి 16)న బీదర్‌లో ఏటీఎం సెక్యూరిటీ గార్డును హత్యచేసి రూ.93లక్షలు ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. నిందితుల కోసం ఇరు రాష్ట్రాల పోలీసులు జల్లెడపడుతున్నా నిందితులు ఛాకచక్యంగా తప్పించుకుని తిరుగుతున్నారు. రాష్ట్రంలోని వివిధ ఏరియాలతోపాటు హైదరాబాద్‌లో సైతం పోలీసులు అప్రమత్తమైనా నిందితులు నగరంలో పలు చోట్ల సంచరించడం సంచలనంగా మారింది. అంతేకాకుండా అఫ్జల్‌గంజ్ నుంచి రాయ్‌పూర్ వెళ్లేందుకు రోశన్ ట్రావెల్స్‌లో అమిత్‌కుమార్ పేరుతో టిక్కెట్ బుక్ చేసుకొని పారిపోయే క్రమంలో అఫ్జల్‌గంజ్‌లో ట్రావెల్స్ సిబ్బందిపై కాల్పులకు పాల్పడడం సంచలనం రేపింది. తెలంగాణ, బీహార్, కర్ణాటకా రాష్ట్రంతో పాటు తదితర రాష్ట్రాల్లో సంచలనంగా మారిన కాల్పుల కేసులో నిందితులు పోలీసుల కండ్లుగప్పి ఛాకచక్యంగా రాష్ట్రాలు దాటేస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. దోపిడీ దొంగలు రాష్ట్రాన్ని దాటేశారా? లేక హైదరాబాద్‌లోనే మకాం వేశారా? అనేది ప్రశార్థకంగా మారింది.

ఒకో రూట్‌లో... ఒకో బృందం

నిందితుల ఆచూకీ కోసం రంగంలోకి దిగిన 10 ప్రత్యేక బందాలు ఒకో రూట్‌లో ఒక్కో బృందం దొంగల కోసం జల్లెడపడుతున్నాయి. ఇదిలా వుండగా నిందితులు టికెట్ బుక్‌చేసుకునే సమయంలో యూపీకి చెందిన ఫోన్ నెంబర్ ఇచ్చారని పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. ముందు నుంచి అనుమానిస్తున్న అమిత్‌కుమార్ పేరుతో పాటు ఫోన్ నెంబర్ కూడా తప్పేనని పోలీసుల విచారణలో బయటపడింది. కొత్తగా దోపిడీ దొంగల ముఠా నాయకుడి పేరు మనీష్ అంటూ శనివారం మరో పేరు తెరపైకి వచ్చింది. సీసీ కెమెరాలలో అనుమానితుల ఫోటోలు సేకరిస్తున్న పోలీసులు అన్ని కోణాలల్లో విచారిస్తూ ముందుకు సాగుతున్నారు. అయితే పోలీసులు తమను అనుసరించకుండా ఉండేందుకు దుండగులు ఫోన్ వాడలేదని పోలీసులు అనుమానిస్తున్నట్లు తెలిసిందిఏ.

నేర స్వభావాన్ని పరిశీలిస్తున్న పోలీసులు...

నేరాలల్లో ఆరుతేరిన నిందితులు దోపిడీ సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవడం సహజంగా జరుగుతుంది. ఒక్కో ముఠా ఒక్కో తీరులో దోపిడీలకు, నేరాలకుపాల్పడుతుంటాయి. నేరం జరిగిన సమయంలో పోలీసులు ఆ దోపిడీని చూసి ఎవరు చేశారనేది పసిగట్టే ఆవకాశం ఉంటుంది. అయితే అన్ని కోణాలల్లో విచారిస్తున్న పోలీసులు బీదర్‌లో ఏటీఎం సిబ్బందిపై తుపాకీ కాల్పులు జరిపి, దోపిడీకి పాల్పడిన నిందితులు పాత ముఠా సభ్యులేనని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందు లో భాంగానే దేశ వ్యాప్తంగా బ్యాంకులు, ఏటీఎం కేంద్రాలలో గతంలో జరిగిన దోపిడీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఆయా ఘటనలలో నేర స్వభావాన్ని బీదర్‌లో జరిగిన ఏటీఎం దోపిడీతో సరిపోల్చి చూస్తున్నారు. ఇలాంటి ఘటనలలో జైల్లో ఉన్న వారెవరు, జైల్లో నుంచి బయటకు వచ్చిన వారెవరు, ఎప్పుడు బయటకు వచ్చారు, ప్రస్తుతం వాళ్లెక్కడున్నారనే విషయాన్ని ఆయా రాష్ట్రాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సమాచారాన్ని సేకరిస్తున్నారు. గతంలో ఇలాంటి దోపిడీలు హత్యలు, లూటీలు చేసిన వారు పోలీసులకు చిక్కకుండా పక్క రాష్ట్రాలకు పారిపోయి ఆ తర్వాత తిరిగి వచ్చి దోపిడీలు, దొంగతనాలకు చేసిన వారి వారి వివరాలను సైతం పోలీసులు సేకరిస్తున్నారు. నిందితులు బీహార్‌కు చెందిన వారిగా అనుమానిస్తున్న పోలీసులు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర గ్యాంగ్‌లపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. .వారి కదలికలపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు..



ఘనంగా శ్రీ త్యాగరాజ ఆరాధన ఉత్సవం...

- సితార్ విద్వాంసులు, ప్రిన్సిపాల్ పాండురంగ ముతాలిక్

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

శ్రీ త్యాగరాజ ఆరాధన ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ శ్రీ త్యాగరాజ ప్రభుత్వ సంగీత నత్య కళాశాల ఆధ్వర్యంలో శనివారం రాంకోఠిలోని శ్రీ త్యాగరాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సితార్ విద్వాసులు, కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగ్ ముతాలిక్ ఉత్సవాలను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వ అధ్యాపకులు హైదరాబాద్ సిస్టర్స్‌లో ఒకరు హరిప్రియ, వెంకట్రావు గోపీనాథ్, శ్రీ అన్నమాచార్య ప్రభుత్వ నత్య కళాశాల ప్రధానాచార్యులు వరలక్ష్మి, మంతిని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ శారద, లావణ్య లత, వీణ జయలక్ష్మి, మదంగం సహకారం రాజగోపాలచారి, జై కుమార్ ఆచార్య, వయోలిన్ సహకారం పవన్ కుమార్ రెడ్డి, పవన్ సింగ్, డోల్ రవిచంద్రబాబు సహకారంతో అధ్యాపకులు అద్భుతంగా పంచరత్న కీర్తనలను పాడారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం సంగీతం, కలలను ఎంతో ప్రోత్సాహం ఇస్తుందని అన్నారు. కళాశాలలో విద్యార్థులు క్రమశిక్షణతో సంగీతాన్ని నృత్యాలను నేర్చుకుం టున్నారని తెలిపారు. త్యాగరాజ ఆరాధన ఉత్సవాలను ప్రతి సంవత్సరం ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం పూర్వ అధ్యాపకులను శాలువాతో ఘనంగా సన్మానించారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

- గ్రామ సభల్లోనూ దరఖాస్తు తీసుకుంటాం
- మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-సీటీబ్యూరో



అర్హత ఉన్న వారందరికీ రేషన్ కార్డులు అందజేస్తామని, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ కార్డు జారీకి అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు కార్డులు అందజేస్తామని అన్నారు. గ్రామ సభల్లో, వార్డుల్లో, ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖా స్తులు సమర్పించినా, వాటిని పరిశీలించి అర్హులకు రేషన్ కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు. ప్రజాపాలన ఫారములతో పాటు ఇచ్చిన దరఖాస్తులను కూడా పరిగణలోకి తీసుకుంటామని తెలిపారు. కుటుంబంలో విభజన అయిన వారు కొత్త కార్డు కావాలని తీసుకున్న దరఖాస్తును కూడా పరిశీలిస్తామన్నారు. గతంలో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలిస్తామని అన్నారు. ఇది వరకు ఎప్పుడూ దరఖాస్తు సమర్పిం చకపోయినా గ్రామా సభల్లో, వార్డు సభల్లో వచ్చే అధికారులకు దరఖాస్తులు ఇవ్వాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హైదరాబాద్
12
ఆదివారం | జనవరి 19, 2025 | www.navatelangana.com

కేజ్రీవాల్‌పై రాళ్ల దాడి గర్హనీయం

- ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్



నవతెలంగాణ-ముషీరాబాద్/హిమాయత్ నగర్

ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ పై బీజేపీ గుండాలు రాళ్ల దాడి చేయడం గర్హనీయమని ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ బీజేపీకి భయం పట్టుకుని ఆప్ ప్రచారాన్ని అడ్డుకునేందుకు ఈ విధంగా నీచమైన దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.బీజేపీ పిరికిపంద చర్యలకు కేజ్రీవాల్ భయపడరని, ఢిల్లీ ప్రజలు ఆప్ వెంటనే ఉన్నారని, ఈ అసెంబ్లీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు.అరవింద్ కేజ్రీవాల్ పై బీజేపీ గుండాల రాళ్ల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలి పారు. ఆప్‌ను గద్దె దించడానికి బీజేపీ, కాంగ్రెస్ లు ఎన్ని విశ్వ ప్రయత్నాలు చేసిన ఢిల్లీ ప్రజల సంక్షే మం, అభివృద్ధికి ఏనలేని కృషి చేసిన ఆప్ కే మళ్లీ పట్టం కడుతారని దిడ్డి సుధాకర్ ధీమా వ్యక్తం చేశారు.

ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా రక్తదానం



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఎన్టీఆర్ 29 వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి టీడీపీ రాష్ట్ర వాణిజ్య శాఖ సెక్రెటరీ కేడి దినేష్ ఘనంగా నివాళ్లర్పించారు. అనంతరం బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 2లో ఉన్న టీడీపీ సెంట్రల్ పార్టీ కార్యాలయంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. కేడి దినేష్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు సర్టిఫికెట్ అందజేసి టీడీపీ పోలిట్ బ్యూరో మెంబర్ బక్కనేని నర్సింలు అభినందించారు. టీటీడీ బోర్డు మెంబర్ నర్సిరెడ్డి,సిటీ జనరల్ సెక్రెటరీ నల్లల కిషోర్, స్టేట్ ఎస్సీ సెల్ సెక్రెటరీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

- 25 నుంచి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో నిర్వహణ..
- పార్టీ నగర నాయకులు
- పార్టీ నగర కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ - ముషీరాబాద్

సంగారెడ్డి పట్టణంలో ఈ నెల 25 నుంచి 28 వరకు నిర్వహించే సీపీఐ(ఎం) 4 వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం గోల్కొండ చౌరస్తాలోని పార్టీ నగర కార్యాలయంలో ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ నగర కమిటీ సభ్యులు ఆర్ వెంకటేష్ , కార్యదర్శి వర్గ సభ్యులు ఎం దశరథ్ , రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం శ్రీనివాస్, కార్యదర్శి ఎం వెంకటేష్ ,మాట్లాడుతూ పార్టీ మహాసభల సందర్భంగా జనవరి 25న సంగారెడ్డి పట్టణంలో గొప్ప బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు హాజరు కాబోతున్నారని చెప్పారు. ఈ బహిరంగ సభను జయప్రదం చేసేందుకు పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ భారీ సమీకరణకు కృషి చేస్తున్నదన్నారు. రాష్ట్రంలో గత మూడు సంవత్సరాల కాలంలో జరిగిన రాజకీయ పరిణామాలను, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగిన ప్రజా పోరాటాలను సమీక్షించుకొని, రాబోయే మూడు సంవత్సరాల కాలానికి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకునే ముఖ్యమైన ఘట్టం ఈ రాష్ట్ర మహాసభలు అని తెలిపారు. పజా పోరాటాలను మరింత ఉధృతంగా సాగించేందుకు, ప్రజల వాణిని రాష్ట్రంలో బలంగా వినిపించేందుకు, రాజకీయ పరిణామాలను కార్మిక వర్గం, పేద, మధ్యతరగతి ప్రజానీకానికి అనుకూలంగా మలిచేందుకు ఈ మహాసభలలో చర్చిస్తామన్నారు. రాష్ట్రంలో కేంద్రంలో బూర్జువా పార్టీల రాజకీయాల వలన ధన ప్రభావం, అవినీతి, ఆశ్రిత పక్షపాతం పెరిగి రాజకీయాలంటేనే ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. దానికి భిన్నంగా వామపక్ష పార్టీల రాజకీయాలు ప్రజా సమస్యలపై పోరాటాలతో, త్యాగాలతో, ఆదర్శ జీవన విధానాలతో ప్రత్యామ్నాయ రాజకీయాలతో భిన్న రాజకీయ సంస్కృతిని రూపొందించింది అన్నారు. రాజకీయాలంటే ప్రజల కోసం, ప్రజలకు మెరుగైన జీవనాన్ని అందించడం కోసం అనే లక్ష్యంతో కృషి చేసే వామపక్ష రాజకీయాలను ఆదరించాలని రాష్ట్ర ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే సంగారెడ్డి పట్టణంలో పార్టీ కార్యకర్తలు ఇంటింటి ప్రచారాన్ని, జనరల్ బాడీ సమావేశాలను నిర్వహించి విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించి మహాసభల సన్నాహాలను పూర్తి చేశారన్నారు.

కన్నోళ్లకు కన్నీళ్లు మిగల్చొద్దు..

- హైదరాబాద్ రవాణశాఖ జాయింట్ కమిషనర్ సి.రమేష్
- ఆర్టీఓ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



నవతెలంగాణ - ధూల్ పేట్

నిర్లక్ష్యంగా వాహనాలను నడుపుతూ కన్నవాళ్లకు, భార్య పిల్లలకు జీవితాంతం కన్నీళ్లను మిగిల్చవద్దని హైదరబాద్ నగర రవాణశాఖ ఆఫీస్ జాయింట్ కమిషనర్ .రమేష్ అన్నారు. వాహన చోదకులు ప్రతి ఒక్కరూ రహదారి నియమ నిబంధనాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా నగరంలో పాతబస్తీ చాంద్రాయణగుట్ట బండ్లగూడ దక్షిణ మండల ప్రాంతియ రవాణశాఖ కార్యాలయం అర్టీఓ ఆధ్వరంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యథిగా పాల్గొని సిబ్బందితో కలిసి బైక్ ర్యాలీ ప్రారంభించారు. ఆయన మాట్లాడూతూ... దేశంలో ప్రతి నిమిషానికి ఇద్దరు చోప్పున రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడం విచారకరమన్నారు. ఇలా యువత ప్రమాదాల బారిన పడితే ఆదేశ రాష్ట్ర ఆర్థిక వనరులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. వీటిని నివారించాలంటే హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం వాహనాలు నడుపవద్దని సూచించారు. అనంతరం బండ్లగూడ ఆర్టీవో కిష్టయ్య, ఏవో హరి ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ దేశంలోని రహదారుల ప్రమాదాలపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. ప్రధాన రహదారులపై పడిన గుంతల కారణంగా అనేక మంది వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారని న్యాయస్థానాలు ఆగ్రహం వ్యక్తం చేశాయన్నారు. ఏవో సునీతా, ఎంవీఐ ప్రవిందర్‌రాజ్, సూరెష్‌కుమార్, గంటా రవిందర్, తోపాటు ఆఫీస్ సిబ్బంది స్థానికులు పాల్గోన్నారు..

తెలంగాణ ఫిలిం చాంబర్ ఏర్పాటు చేయాలి

- చిన్న సినిమాలను ప్రోత్సహించాలి
- సుందరయ్య విజ్ఞాన కేంద్రం దాశరథి థియేటర్ కార్యదర్శి ఎస్ వినయ్ కుమార్



నవతెలంగాణ - ముషీరాబాద్

తెలంగాణ ఫిలిం చాంబర్ ఎర్పాటు చేసి చిన్న సినిమాలను ప్రోత్సహించాలని సుందరయ్య విజ్ఞాన కేంద్రం దాశరథి థియేటర్ కార్యదర్శి ఎస్ వినయ్ కుమార్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన తెలంగాణ సినీ ప్రేక్షకుల వినియోగదారుల సంఘం సంయుక్తంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ. తెలుగు చిత్ర పరిశ్రమలో మూడంచెల వ్యవస్థ నియంతత్వం కొనసాగు తున్నదన్నారు. పెద్ద హీరోల గుత్తాధిపత్యం కొనసాగుతున్నదని ధ్వజమెత్తారు. ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్, ఎగ్జిబిటర్ ఈ ముగ్గురే ఏకచక్రాధిపత్యంగా ఉంటున్నారని.. సినిమా థియేటర్లు మొత్తం వీళ్ళ చేతుల్లోనే ఉన్నాయని తెలిపారు. పెద్ద సినిమా "హీరో"లు నిజజీవితంలో "జీరో "గా ఉన్నారని.. మానవీయత లేని మనుషులు గా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న సినిమాలను హీరోలను సాంకేతిక ఎన్నికలను ప్రోత్సహించాల్సిన అవసరంఉందన్నారు. డీయఫ్‌డీసీ తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ కళాకారులకు సాంకేతిక నిపుణులకు 24 రకాల క్రాఫ్ట్ లో శిక్షణ ఇవ్వాలన్నారు. ఫిలిం ప్రొడక్షన్ మేనేజ్మెంట్ కోర్సులు ప్రవేశపెట్టాలని, సినిమా ప్రొడక్షన్ పై ఆసక్తి కలిగిన వారందరినీ వర్క్ షాప్ పెట్టి సినిమా నిర్మాణం పై అవగాహన కల్పించాలని కోరారు.సినిమా కళాకారులకు ఇండ్ల స్థలాలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. తెలంగాణ ఆట, పాటల సంస్కృతి, తెలంగాణ వీరులు, సాయుధ పోరాట నిజ చరిత్ర వెండితెరపై ఆవిష్కృతం కావాలన్నారు. చిన్న సినిమాలకు థియేటర్ సమస్య లేకుండా చూడాలని డిమాండ్ చేశారు.మంచి సందేశాత్మక సినిమాలకు రాష్ట్ర అవార్డులు ఇవ్వాలని, ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్స్ నిర్వహించి ప్రోత్సహించాలన్నారు. తెలంగాణ జానపద కళాకారులకు ప్రత్యేకంగా జానపద కళల అకాడమీ ఏర్పాటు చేసి దానికి కావలసిన నిధులు కేటాయించి, విధులు రూపొందించి గుర్తింపు కార్డులు పెన్షన్లు ఇంటి స్థలాలు ఆర్థిక సహకారం అందించాలన్నారు. డిమాండ్లపై సీఎం వెంటనే స్పందించకపోతే ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఫిబ్రవరి 10న ధర్నాలు రాస్తా రోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సకల కళలు, జానపద కళాకారుల పరిరక్షణ జెఏసి చైర్మన్ మురళీధర్ దేశ్ పాండే, గౌరవ న్యాయమూర్తి మందమురళీధర్, రిటైర్ న్యాయమూర్తి మేకల నరసింహ రెడ్డి, రిటైర్ డిఎస్పీ సుంకర సత్యనారాయణ, సినిమా ప్రముఖ నటుడు సి ఏల్ నరసింహ రావు, సినిమా నటుడు మదన్ లింగాల, సీమ శ్రీనివాస్ రావు, గడ్డం సుధాకర్, సెన్సార్ బోర్డు చైర్మన్ వెంకటస్వామి, సినిమా దర్శకులు నిర్మాతలు సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

అర్హులైన వారందరికీ రేషన్ కార్డులివ్వాలి

- పీఓడబ్ల్యు, పీడీఎస్‌యూ, పీవైఎల్ నాయకులు

నవతెలంగాణ - ముషీరాబాద్

అర్హులైన వారందరికీ రేషన్ కార్డులివ్వాలని పీఓడబ్ల్యు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి. అనసూయ, అందే మంగ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి మహేష్ ,ఎస్ వి శ్రీకాంత్, పి వై ఎల్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇందూరు సాగర్, కోలా లక్ష్మీనారాయణ లు శనివారం పత్రిక ప్రకటన ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్తే రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 12 లక్షల కుటుంబాలు రేషన్ కార్డుకు దరఖాస్తు చేశారని తెలిపారు. కానీ నేడు రాష్ట్రవ్యాప్తంగా 6 లక్షల కుటుంబాలకు మాత్రమే రేషన్ కార్డులు ఇస్తామనిప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇది నిరుపేదలను మోసం చేయడమేనన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరికీ రేషన్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

'ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

నట విఖ్యాత, నట సార్వ భౌమ, ప్రజా నాయకుడునందమూరి తారక రామారావుకు 'భారతరత్న' ఇవ్వాలని భారత్ నేషనల్ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుల్లూరి వెంకట రాజేశ్వరరావు డిమాండ్ చేశారు.ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా శనివారం హిమాయత్ నగర్ లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే కాదు యావత్ ప్రపంచంలోనే నేటికి తెలుగు వారి గురించి మాట్లాడుతున్నారంటే దానికి ముఖ్య కారణం నందమూరి తారక రామారావు అని కొనియాడారు.ఒక వైపు కథానాయకుడిగా ఆయన చేసిన పాత్రలు, అలాగే మరోవైపు ప్రజా నాయకుడిగా ఆయన చేసిన గొప్ప పనులు అందరికి తెలిసినవేనని, అలాంటి మహానుభావుడికి భారతరత్న కచ్చితంగా ఇవ్వాలన్నారు.పటేల్, పట్వారి వ్యవస్థను రద్దుచేసి అగ్రవర్ణాల చేతుల్లోని అధికారం బడుగు, బలహీన వర్గాలు అధికారంలో ఉండాలని ఎన్నో బెదిరింపులు వచ్చిన వెనక్కి తగ్గకుండా ముందుకు వెళ్లిన వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు.ప్రజలకు ఉపయోగపడేలా ఎన్నో సంక్షేమ పథకాలను ఆయన ప్రవేశపెట్టడం జరిగిందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో బడుగు బలహీన వర్గాలకు అవకాశాలు కల్పించిన వ్యక్తి ఎన్టీఆర్

- టీడీపీ నాయకులు ఎడెల్లి భాను ప్రకాష్, సత్యనారాయణ



నవతెలంగాణ-అంబర్‌పేట

బడుగు బలహీన వర్గాలకి రాజకీయం చైతన్య కల్పించి, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషిచేసిన ఏకైక నాయకుడు స్వర్గీయ ఎన్టీ రామారావు అని ఆడ్ హాక్ కమిటీ కమిటీ మెంబర్, టీడీపీ బాగ్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షులు ఎడెల్లి భాను ప్రకాష్, పార్టీ రాష్ట్ర నాయకులు సత్యనారాయణ అన్నారు. బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించి మాట్లాడారు. రాజకీయాలపై ఆసక్తి, చైతన్యం పెంచిన వ్యక్తి అని, ప్రజల వద్దకు పాలన తీసుకు వచ్చిన మహనీయుడు ఎన్టీఆర్ అన్నారు. మండల వ్యవస్థతో ప్రజల వద్దకు పాలన తీసుకువచ్చారని తెలిపారు. మహిళలకు తండ్రి ఆస్తిలో సమాన వాటా కల్పించారనీ, మూడు రూపాయలకే కిలో బియ్యం ఘనత ఆయనదేనన్నారు. ఏ పాత్రలో నటించినా దానికి జీవం పోశారని చెప్పారు. త్వరలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తిచేసి వారికి డిజిటల్ కార్డులు అందజేస్తామని తెలిపారు. దశరథ్, ధనరాజ్, శ్రీరామ్, తదితర నాయకులు పాల్గొన్నారు.



సమగార వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన

- వివాహ పరిచయ వేదిక చైర్మన్ ఆర్ రోహిదాస్ వాగ్మారే

నవతెలంగాణ - ముషీరాబాద్

సమగార వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన లభించిందని వివాహ పరిచయ వేదిక చైర్మన్ ఆర్ రోహిదాస్ వాగ్మారే తెలిపారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమకార వివాహ పరిచయ వేదిక 8వ సమ్మేళన కార్యక్రమం జరిగింది. చైర్మెన్ మాట్లాడుతూ. తమ సంస్థ ద్వారా ఎంతో మంది పేదవారికి వివాహాలు జరిపించామన్నారు. సంస్థలో ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తమ జనాభా ఐదు లక్షలకు మించి ఉన్నామన్నారు. సాంప్రదాయబద్ధంగా వివాహాలు పరిచయ వేదికల నిర్వహిస్తామన్నారు. గ్రేట్ హైదరాబాద్ అధ్యక్షులు జితేందర్, ప్రధాన కార్యదర్శి మున్నాలాల్ కోక, వైస్ ప్రెసిడెంట్ పి నందు, సెక్రెటరీ ఎన్, శ్యాంసుందర్, రాజ్ కుమార్, కోశాధికారి గోవింద్ , శివశంకర్, జగ్గులాల్, తుకారం, శంకర్ తదితరులు హాజరయ్యారు.

బీసీ వాటా ప్రకటించిన తర్వాతే ఎన్నికలు జరిపించాలి



- ఓబీసీ జేఏసీ ప్రతినిధుల డిమాండ్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర కులగణన లెక్కలు తేల్చి 42 శాతం బీసీల వాటా ప్రకటించిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు జరిపించాలని ఓబీసీ జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఓబీసీ జేఏసీ చైర్మన్ డాక్టర్ అల్వారు వేణుకుమార్, బీసీ హిందూ మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్, బీసీ కులాల సమన్వయ వేదిక అధ్యక్షులు బొమ్మ రఘురాం, ఓబీసీ పొలిటికల్ జేఏసీ కన్వీనర్ ఎస్బీఎన్ చారి, బీసీ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు కోట్ల వాసుదేవ్ తదితరులు మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు పరచాలని కోరారు. రాష్ట్ర బీసీ సమాజమంతా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కలుపుకొని ఆయా పంచాయతీల్లో వార్డు మెంబర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలుగా జనరల్ స్థానాల్లో బీసీలను గెలిపించి చరిత్ర సృష్టించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన లెక్కలు బహిర్గతం చేయకుండా ఎన్నికలకు పోతే రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కోణాలలో బీసీ సమాజాన్ని ఏకీకతం చేసి ధర్నాలు, ఆమరణ నిరాహార దీక్షలు, సైకిల్ యాత్ర, పాదయాత్రలు చేస్తామని హెచ్చరించారు.గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని రంగాల్లో బీసీలకు అన్యాయం జరిగిందని గుర్తు చేశారు.చేపట్టే ఉద్యమాల్లో బీసీ వాదులంతా పాల్గొని 'పల్లెని గెలుద్దాం-ఢిల్లీని ఏలుదాం' అనే నినాదంతో ముందుకెళ్లి పంచాయతీ ఎన్నికల్లోకి గెలిచి బీసీల సత్తా చాటాలన్నారు. సమావేశంలో జేఏసీ ప్రతినిధులు ఏ.అరుణ, విజయ్ కుమార్, మహేష్, పర్వత సతీష్, పెండ్యాల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి ఆవాజ్ కృషి..

- ఆవాజ్ క్యాలెండర్ ఆవిష్కరణలో జిల్లా కార్యదర్శి అబ్దుల్ సత్తార్



నవతెలంగాణ - ధూల్ పేట్

మైనార్టీల సమస్యలపై పోరాడుతూ వారి అభ్యున్నతికి ఆవాజ్ కృషి చేస్తుందని ఆవాజ్ జిల్లా కార్యదర్శి అబ్దుల్ సత్తార్ అన్నారు. ఆవాజ్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆవాజ్ క్యాలెండర్లను ఆయన సంతోష్ నగర్ పార్కులో, సియాసత్ ఆఫీస్‌లో న్యూస్ ఎడిటర్ ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవాజ్ మైనార్టీల తో మమేకమై పనిచేస్తుందన్నారు. ఈ కమిటీ ప్రతి ఏడాది నూతన క్యాలెండర్ ప్రచూరణ చేసి మైనార్టీ క్యాడర్‌కి అందిస్తున్నదని గుర్తుచేశారు. ఇలా మంచి ఆదరణ చూరగొన్నదన్నారు. మన వాయిస్ మైనార్టీలకు తీసుకెళ్తూ ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతున్నదన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకొని వారి పరిష్కారం వైపు ప్రయత్నం చేస్తున్నమన్నారు. ప్రజలతో మమేకవడానికి దోహదపడుతుందన్నారు. జిల్లా నాయకులు సయ్యద్ కలీముదిన్, గులాం నజీర్, మహ్మద్ అన్వర్ ఖాన్, అఖ్తర్ బేగం, సయ్యద్ అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

సంతాన సాఫల్యంలో.. తగ్గేదేలే..

- పెట్ల బుర్జ్ ప్రభుత్వ ఆధునిక ప్రసూతి ఆస్పత్రిలో ఒకే మాసంలో ఐదుగురు మహిళల్లో సాఫల్యం..
- పేదల ఆదరణ చురగొంటున్న సంతాన కేంద్రం..
- తమదైన శైలిలో వైద్యుల చికిత్సలు..
- చికిత్సలు అందించడమే మా లక్ష్యం..
- ఫలితాల వైపే మా దృష్టి..
- ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజినీ రెడ్డి..





నవతెలంగాణ - ధూల్ పేట్

సంతానం లేక దంపతులు అవమానం పడుతున్నారా.. వివాహమై ఏండ్లు గడుస్తున్నా సంతాన లేమితో అవస్థలు.. పిల్లలు ఇక కారని నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారా.. ప్రయివేటు ఆస్పత్రుల్లో ఖర్చు పెట్టుకో లేక.. బయట చెప్పుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారా.. భయపడవద్దు.. డబ్బుల కోసం చింత వద్దు.. లక్షల రూపాయలు ఖర్చు చేసినా కాక పోవచ్చునేమో అనే ఆందోళన వద్దు.. వైద్యం ఉచితం, మందులు ఉచితం, ఆ చికిత్సలు నిర్ధారణకు చేయాల్సిన శస్త్ర చికిత్సలు(స్కానింగ్ వంటి అన్ని రకాల పరీక్షలు) ఉచితం.. ఎక్కడో కాదు నగరం నడబొడ్డున రాష్ట్ర నగరంలోనే ప్రఖ్యాతి పొందిన పెట్ల బుర్జ్ ప్రభుత్వ ఆధునిక ప్రసూతి ఆస్పత్రి(జచ్చీ ఖానా)లో వైద్యులు సంతాన సాఫల్యంలో తగ్గేదెలే.. అంటున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రుల్లో ప్రవేశ పెట్టిన సంతాన సాఫల్య కేంద్రంలో ఒక్కటైన పెట్ల బుర్జ్ ఆస్పత్రి సాఫల్యం కల్పించడంలో మంచి ఫలితాలను అందిస్తున్నది. గత మూడు మాసాలుగా చికిత్సలకు వస్తున్న రోగులను దృష్టిలో పెట్టుకొని గతే డాది డిసెంబర్ 9వ తేదీ నుంచి ఆస్పత్రిలో ప్రారంభమైన సంతాన సాఫల్య కేంద్రం(ఐవీఎఫ్)లో వారికి చికిత్సలు అందించారు. దంపతులకు వైద్య పరీక్షలు నిర్వహించి కౌన్సిలింగ్ చేశారు. తదనుగునంగా మాసం తిరిగే లోపు ఐదుగురు మహిళల్లో విజయం సాధించి వారి దాంపత్య జీవితంలో ఆనందాలు నింపారు.

మరో ఐదుగురు..

సంతాన లేమితో బాధపడుతున్న వారికి డిసెంబర్ మాసంలో 320 మంది రోగులు చికిత్సలు పొందారు. ప్రతి రోజూ సుమారు 50 నుంచి 60 మందికి సంతాన సాఫల్య చికిత్సలు పొందుతున్నారు. గత మాసంలో ఐదుగురికి సాఫల్యం కాగా ఇప్పటికీ మరో ఐదుగురు మహిళల ముందున్నారని, అందుకనుగుణంగా దంపతులిద్దరికీ కౌన్సిలింగ్ చేస్తూ చికిత్సలు అందిస్తున్నట్టు వైద్యులు పేర్కొంటున్నారు.

సమస్యను బట్టి చికిత్సలు..

సంతానం(పిల్లలు) కాకపోవడానికి మహిళలే కారణం కాదు. మగ వారిలో కూడా సమస్యలుంటాయి. దీన్ని దష్టిలో ఉంచుకుని చికిత్సలకు వచ్చిన మహిళల వివరాలు, గతంలో చికిత్సలు పొందిన, తీసుకున్న మెడిసిన్ వంటి వివరాలు సేకరించి సూపరింటెండెంట్ డాక్టర్ రజినీ రెడ్డి పర్యవేక్షణలో ప్రొఫెసర్ లు డాక్టర్ శకుంతల, డాక్టర్ మధులత లు తమ వైద్య బందంతో ప్రత్యేక శ్రద్ధ వహించి చికిత్సలు అందిస్తున్నారు. సమస్య ఎక్కడ అనేది గుర్తించి.. ఆ దిశగా చికిత్సలు అరంబిస్తు ఫలితాల వైపు దష్టి సారిస్తున్నారు. మహిళల గర్భంలో నుంచి అండం, అండ నాళాలు(టెస్ట్ ట్యూబ్) పరీక్షలు నిర్వహించి.. అదే క్రమంలో మగవారికి కూడా కావాల్సిన పరీక్షలు, చికిత్సలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆస్పత్రి మంచి సంతాన సాఫల్య స్పందన లభించింది.

చికిత్సలు అందించడమే లక్ష్యం..

- ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజినీ రెడ్డి..



సంతానం లేని దంపతులకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రవేశపెట్టిన సంతాన సౌఫల్య కేంద్రం ఐవిఎఫ్ సెంటర్ తోఐదుగురు మహిళలకు విజయవంతమైందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజిని రెడ్డి తెలిపారు. ఇందుకు సంబం ధించిన వివరాలను శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో వివరించారు ఆస్పత్రిలోని సంతాన సౌఫల్య కేంద్రం ఐవీఎఫ్ సెంటర్ చికిత్సలు అందిస్తూ శంషాబాద్ .. నారాయణఖేడ్. హైదరాబాద్‌లోని పాతబస్తీకి చెందిన ముగ్గురు మహిళలకు విజయవంతమైనట్టు వివరించారు. సంతానం లేని దంపతులు ప్రయివేటు ఆస్పత్రులను కాకుండా ప్రభుత్వాసుపత్రిలో చికిత్సలు పొంది ఐవీఎఫ్ సెంటర్ లో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ విజయవంతం వెనుక ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది కృషి ఎంతో ఉందని ఆమె అన్నారు. ఈ సమావేశంలో ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ అమతలక్ష్మి, వైద్య బందం, సిబ్బంది పాల్గొన్నారు.

'పార్లమెంట్‌లో చర్చ జరగకుండా రాష్ట్రాల్లో వర్గీకరణ అమలు చేయరాదు'

- మాల మహానాడు జాతీయ అధ్యక్షులు, ప్రొఫెసర్ డా.వి.ఎల్.రాజు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమిలేయర్ అంశంపై సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన కూడా పార్లమెంట్‌లో చర్చ జరగందే రాష్ట్రాల్లో వర్గీకరణ అమలు చేయరాదని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు, ప్రొఫెసర్ డా.వి.ఎల్.రాజు రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.శనివారం హిమాయత్ నగర్ లోని దళిత బహుజన పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వి.ఎల్.రాజు మాట్లాడుతూ దళిత జాతులను సామాజికంగా, రాజకీయంగా అణిచివేసి బానిసలుగా చేసుకోవడానికి మనువాద కేంద్ర, రాష్ట్ర పాలకులు, దోపిడీ కుల పార్టీలు కుట్రలు చేశాయన్నారు. ప్రధానంగా అంబేద్కర్ వాదాన్ని ధ్వంసం చేయాలని ఎమ్మార్పీఎస్‌తో చేతులు కలిపి మనువాద పార్టీలు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ హక్కులను కాలరాయడం కోసమే సుప్రీంకోర్టు ద్వారా మోడీ సర్కార్ తీర్పు ఇప్పించిందని ఆయన ఆరోపించారు. 59 ఎస్సీ కులాలు, ఉప కులాల జనాభా లెక్కలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద లేవన్నారు.వర్గీకరణ అంశం అనేది యావత్ దళిత కులాల భవిష్యత్తుకు గొడ్డలి పెట్టు లాంటిదని ఆందోళన వ్యక్తం చేశారు.దీని కోసం సీఎం ఎ.రేవంత్ రెడ్డి నియమించిన షమీర్ అక్తర్ చైర్మెన్‌గా ఏక సభ్య కమిషన్ ఇచ్చే వర్గీకరణ అనుకూల సిఫారసులను ఉన్నత న్యాయ స్థానాల్లో సవాల్ చేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు సమాయత్తం కావాలని సూచించారు.ఈ సమావేశంలో ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం చైర్మెన్, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కష్ణ స్వరూప్, రాష్ట్ర శాఖ అధ్యక్షులు సిలివెరి వసంతరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.అశోక్, ప్రధాన కార్యదర్శి పి.రాజలింగం, ఉపాధ్యక్షులు ఎం.రవీందర్, విశ్వనాథం, రమేష్, ప్రసన్నకుమార్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు జె.ఎస్.రావు, డీబీపీ గ్రేటర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

'అవయవ దానంపై అవగాహన అవసరం'



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో స్వచ్ఛందంగా శరీర, అవయవ దానం చేయాలని, ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితులను కాపాడాలని సామాజిక కార్యకర్త ఆర్ ఏ వినోద్ కుమార్ అన్నారు. శనివారం సుల్తాన్ బజార్ లో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సంవత్సరానికి 3మార్లు రక్తదానం చేయవచ్చున్నారు. ప్రతి ఒక్కరూ మతి చెందిన అనంతరం శరీర దానం చేయాలని, రోడ్డు ప్రమాదాల్లో అవయవాలు కోల్పోయిన క్షతగాత్రులను బతికించేందుకు అవయవదానం, శరీర దానం దోహద పడుతుందని తెలిపారు. మనదేశంలో కేవలం 5శాతం పైబడి వ్యక్తులు మాత్రమే అవయవ దానం చేస్తున్నారని, నగరంలో, పట్టణ, జిల్లా, మారుమూల ప్రాంతాల్లో రక్త, శరీర, అవయవ, నేత్రదానంపై విద్యార్థులు, యువతీ, యువకులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని ప్రభుత్వాన్ని, స్వచ్ఛంద సంస్థలను కోరారు.

తల్లిదండ్రులను ప్రేమించండి...

నేను గీతికకు ప్రేమతో...

ఏరా బంగారు తల్లి, ఏం చేస్తున్నావు? ఏమిటో ఇవ్వాళ నా మనసంతా బాధతో, ఆవేదనతో నిండిపోయి ఉంది. అందుకే నీకు ఉత్తరం రాస్తున్నా. దీంతో నాకు కొంచెం ఉపశమనం. ఈరోజు పేపర్‌లో ఒక వార్త చదివాను. ఎంతో బాధనిపించింది. తరచూ ఇటువంటి వార్తలు చదువుతున్నప్పటి ఈ వార్త మాత్రం మనసుని కలచి వేసింది.

అసలు విషయం ఏమిటంటే 65, 60 ఏండ్ల వయసు గల దంపతులు కొడుకు తమను చూడటం లేదని ఆత్మ హత్య చేసుకున్నారు. ఇది నేను చదివిన వార్త. ఇటువంటివి ఎన్నో చదువుతున్నాం, కొన్ని సంఘటనలు చూస్తున్నాం. పిల్లలు రెక్కలు రాగానే ఎగిరి పోవడం, కన్న తల్లిదండ్రులను పట్టించుకోక పోవడం లేదా తమ అవసరాలకు వాడుకోవడం వంటివి చేస్తున్నారు. వృద్ధాప్యం వచ్చిన తల్లి తండ్రుల పట్ల ఇలా ప్రవర్తించడం ఎంతవరకు సమంజసం?

ఈ రోజు బిడ్డలు అభివృద్ధిలోకి వచ్చారంటే అందుకు తల్లిదండ్రులు ఎన్ని త్యాగాలు చేసుంటారో. వాళ్లే మరో విధంగా ఆలోచించి ఉంటే ఈ పిల్లలు ఎక్కడ ఉండే వారు, ఎలా ఉండే వారు? చదువు కున్నాం, ఉద్యోగాలు చేస్తున్నాం, సంపాదించుకుంటున్నాం అని చెప్పుకునే పిల్లలు, తల్లిదండ్రులను చూసుకుంటున్నాం, చూసుకోవాలి అది మా బాధ్యత అని ఎందుకు అనుకోవడం లేదు. పెండ్లికాగానే తల్లి తండ్రులను మర్చి పోవడం, వాళ్ళతో మాట్లాడటానికి



అమ్మ లేఖ

సమయం లేదనడం చూస్తున్నాం. సినిమాలు, హోటళ్లు, బైట తిరగడానికి సమయం ఉన్నప్పుడు కనిపెంచిన తల్లిదండ్రుల కోసం సమయం ఎందుకు ఉండదు. ఇది చాలా తప్పు నాన్న.

చరిత్ర పునరావృతం అవుతుంది అంటారు. రేపు మీరుకూడా వృద్ధులు అవుతారు. మీ పట్ల కూడా మీ పిల్లల వ్యవహార శైలి ఇలాగే ఉంటే? తప్పకుండా ఉంటుంది, ఎందుకంటే మిమ్మల్ని చూసే కదా వాళ్ళు నేర్చుకునేది. అంతే కదా నాన్న.. అమ్మా నాన్నలను చూసే కదా పిల్లలు నేర్చుకుంటారు. ఇటీవల తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో వదిలేయడం ఓ ఆనవాయితీగా మారింది. వాళ్ళు ఆ వయసులో కోరుకునేది ప్రేమతో ఓ పలకరింపు. పిల్లలు తమ దగ్గర కూర్చుని కాసేపు కబుర్లు చెప్పాలని కోరుకుంటారు. తమను పట్టించుకుంటే చాలు అనుకుంటారు.

కన్నా.. ఒక్కొక్క సారి తల్లిదండ్రుల మీద పిల్లలకు, పిల్లల మీద తల్లిదండ్రులకు కోపం రావడం సహజం. అయినా కూడా అవి మనసులో పెట్టుకోకుండా కలిసి పోవాలి. నేటి పిల్లలకు చెప్పేది ఒక్కటే.. వాళ్ళు మిమ్మల్ని ఎలా చూసుకున్నా, మీరు ఈ రోజు ఒక స్థాయిలో ఉన్నారంటే వాళ్లే కారణం. ఎవరి రుణం అయినా తీర్చు కోవచ్చు, జన్మ నిచ్చిన వారి రుణం తీర్చుకోలేనిది. బిడ్డలు ఎలాంటి వారైనా వారు బాగుండాలని మనసారా ఆశీర్వదించేది, కోరుకునేది తల్లిదండ్రులు మాత్రమే..

ఇక నైనా మారండి జీవితపు చరమాంకంలో ఉన్న తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోండి. వారికి సంతోషం కలిగించండి. నాన్న.. రేపు నీకూ కుటుంబం ఏర్పడ్డాక తల్లిదండ్రులను, అత్త మామలను చూసుకోవాలి. వారికి ప్రేమను పంచాలి. పెద్ద వాళ్ళు ఏదైనా అన్నా పట్టించుకోకూడదు. కొందరికి అభద్రతా భావం ఏర్పడుతుంది. అటువంటప్పుడు వారికి ధైర్యం చెప్పాలి. నువ్వు ఎంత ప్రేమను పంచితే వారికి అంత నిశ్చింత. వారు నీపై అంతే ప్రేమను కురిపిస్తారు.

'మా పిల్లలు బంగారం, వాళ్ళు మాకు కొండంత అండ, మమ్మల్ని చాలా బాగా చూసుకుంటారు' అని వాళ్ళు చెప్పుకునే లాగా ఉండాలి.



ప్రేమతో అమ్మ
- పాలపర్తి సంధ్యారాణి

నేర్చుకునేందుకు సిద్ధంగా ఉండండి...



అమిత మాధ్వానీ... భారతీయ వ్యాపార ప్రకటనల్లో తన కంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. ఆపై నిర్మాణంలో నాయకురాలిగా ఎదిగారు. సాంస్కృతికంగా సంపన్నమైన మరాఠీ కుటుంబంలో పుట్టిన ఆమె తల్లిదండ్రుల నుండి ఉన్నతమైన విలువలు నేర్చుకున్నారు. తన అనుభవాలతో చలనచిత్ర, నిర్మాణ పరిశ్రమలలో కీలకమైన శక్తిగా ఎదిగారు. అంతేకాదు యువతులు సినీ పరిశ్రమలో ప్రత్యేకమైన కృషితో తమదైన ముద్ర వేయాలని కోరుకుంటున్నారు.

ముంబై మాహిమ్‌లోని చావల్‌లో పుట్టిన అమిత మాధ్వానీ మరాఠీ సంస్కృతి, సాంప్రదాయ పండుగలు, లోతైన సమాజ భావనల మధ్య పెరిగింది. (చావల్ అనేది ముంబైలో సాధారణంగా కనిపించే ఒక రకమైన నివాస భవనం. ఇది బహుళ కుటుంబాలను కలిగి ఉంటుంది. ఆర్థిక రూపకల్పన, సామూహిక జీవనం ద్వారా వర్గీకరించబడుతుంది) ఆమె తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు, సర్జన్, సంస్కృత పండితుడు. తండ్రి నుండి సేవ, సమ్మిళిత విలువలను నేర్చుకున్నారు. ఆమె తల్లి తన కుటుంబాన్నే కాకుండా ఇతర పిల్లలను కూడా చూసుకునేది. ఇది మాధ్వానీ జీవితంలో ఎంతో ప్రభావాన్ని చూపింది. తన సమాజంలోని సాంస్కృతిక వేడుకలు, మరాఠీ థియేటర్‌పై ఆమెకున్న అవగాహనకు పునాదిగా నిలిచాయని చెప్పవచ్చు. ఈ వాతావరణం ఆమెలో కళల పట్ల ప్రేమను, సమాజ శక్తిపై నమ్మకాన్ని పెంపొందించింది.

సినీ రంగంలో ప్రవేశం

మాధ్వాని 1980లలో తన కెరీర్‌ను ప్రారంభించారు. అప్పట్లో ఈ రంగం పురుషుల ఆధిపత్యంలో ఉంది. అటువంటి సమయంలో ఎంతో ఉత్సుకత, నేర్చుకోవాలనే తపనతో పరిశ్రమలోకి ప్రవేశించారు. నిర్మాణంలో ఆమెకున్న తొలి అనుభవాలు కష్టపడే తత్వాన్ని నేర్పించాయి. 'అప్పట్లో సినిమాల విభాగంలో నేనే ఏకైక మహిళను. ఇది సవాలుతో కూడుకున్నది. నన్ను నేను నిరూపించుకోవాలి. సెట్‌లో బ్యాగులు ప్యాక్ చేయడం నుండి 35-ఎంఎం ఫిల్మ్‌లో ఎడిటింగ్ చిక్కులను అర్థం చేసుకోవడం వరకు ప్రతిదీ నేర్చుకున్నాను' అని ఆమె ఓ వెబ్‌సైట్‌తో పంచుకున్నారు. ఓగిల్వీ, లియో బర్నెట్ వంటి ప్రకటనలు ఆమె దృక్పథాన్ని విస్తృతం చేశాయి. ఏజెన్సీల నుండి పరిశ్రమను చూడగలిగారు. తన అనుభవాలతో వెంచర్లకు పునాది వేసాయి. తర్వాత కాలంలో ఈక్వినాక్స్ ఫిల్మ్‌లో సహ-భాగస్వామి, నిర్మాతగా ఎదిగారు. ఈ కంపెనీలను నడిపించడంలో కీలక పాత్ర పోషించారు. మహమ్మారి సమయంలో అతి తక్కువ సమయంలోనే డిజిటల్ ఫార్మాట్‌లకు మారారు.

యాడ్స్ పరిణామం

భారతదేశ ప్రకటనల్లో నాటకీయ మార్పులను మాధ్వానీ ప్రత్యక్షంగా చూశారు. పెద్ద బడ్జెట్‌లతో కూడిన సాంప్రదాయ టెలివిజన్ వాణిజ్య ప్రకటనల నుండి ప్రస్తుత రీల్స్, డిజిటల్ ప్రకటనల యుగం వరకు పరిశ్రమ తీవ్రమైన మార్పుకు గురయ్యింది. 'కథ చెప్పడం మనం చేసే ప్రతి పనిలోనూ ప్రధానమైనది. ఇది 10 సెకన్ల డిజిటల్ స్పాట్ అయినా, మూడు గంటల ఫీచర్ ఫిల్మ్ అయినా సారాంశం ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వడంలో ఉంది' అంటారు ఆమె. సోషల్ మీడియా, స్నేహపూర్వక ఫార్మాట్‌లను ఏకీకృతం చేయడం ద్వారా, క్లయింట్‌లకు ఎండ్-టు-ఎండ్ పరిష్కారాలను



అందించడం ద్వారా ఈక్వినాక్స్ ఫిల్మ్స్ ముందంజలో ఉంది. మాధ్వాని తన విజయానికి జట్టు అంకితభావం, ప్రతి సభ్యుని సహకారాన్ని విలువైనదిగా భావించే విధానమే కారణమని అంటున్నారు.

యువతకు సందేశం

పరిశ్రమలో ఒక మహిళగా తన ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ సమ్మిళితత్వం వైపు తన పురోగతిని అంగీకరిస్తున్నారు. అయితే నిరంతర పురోగతి అవసరాన్ని కూడా ఆమె నొక్కి చెబుతున్నారు. 'నేను ఎప్పుడూ పోటీని ఎదుర్కోలేదు. నన్ను ఎవ్వరూ జడ్జ్ కూడా చేయలేదు. ఎందుకంటే నేను ఎల్లప్పుడూ నా పనిని వినయంతో, నేర్చుకోవాలనే సంకల్పంతో ఉంటాను. ఈ రంగంలోకి ప్రవేశించే యువతులకు నేను చెప్పేది ఏమిటంటే... కష్టపడి పనిచేయడానికి, ఉత్సుకతతో ఉండటానికి సిద్ధంగా ఉండండి. ముందస్తుగా భావించిన ఆలోచనలు మిమ్మల్ని వెనక్కి నెట్టకుండా చూసుకోండి' అంటారు. అలాగే ఆశావాహులైన నిపుణులను ప్రతి అభ్యాస అవకాశాన్ని, ఎంత చిన్నదైనా స్వీకరించమని, విభిన్న అనుభవాలకు సిద్ధంగా ఉండాలని ప్రోత్సహిస్తారు.

కాలానికి అనుగుణంగా

'మీ పని మిమ్మల్ని ఎక్కడికి తీసుకెళుతుందో మీకు తెలియదు. మారుతున్న కాలానికి అనుగుణంగా నా సామర్థ్యం, స్థితిస్థాపకతకు నేను రుణపడి ఉన్నాను. నేను పరిశ్రమలోకి ప్రవేశించాను. దశాబ్దాలుగా కొనసాగగలుగుతున్నాను. ఇప్పటికీ మారుతున్న కాలాలకు అతీతంగా నన్ను నడిపించే ఒక కోర్ ఉంది. నేను దాన్నే నమ్ముతాను. అది నన్ను ముందుకు నడిపిస్తుంది' అంటారు ఆమె. మాధ్వాని నాయకత్వంలో ఈక్వినాక్స్ పర్చువల్ ప్రారంభమయింది. అలాగే కొత్త కథ చెప్పే రంగాలలోకి ఆమె బృందం అడుగుపెడుతోంది. సాంప్రదాయ నైపుణ్యాన్ని అత్యాధునిక డిజిటల్ ఆవిష్కరణలతో మిళితం చేస్తున్నారు. ఆమె చేస్తున్న పనిలో ఆమెకు ఆనందం ఉంది. 'మీ పని పట్ల మీరు నిజాయితీగా ఉండండి. నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండండి. భయం మీ ఎంపికలను నిర్దేశించ నివ్వకండి. కథ చెప్పే ప్రపంచం విశాలమైనది, అవకాశాలతో నిండి ఉంది. నమ్మకంగా, వినయంతో దానిలోకి అడుగుపెట్టండి' అంటూ ఆమె తన మాటలు ముగించారు. ■

కొత్త ప్రాజెక్టులపై ఆసక్తి

(మొదటిపేజీ తరువాయి)

ఉపయోగపడుతుందని టెలిమీడియా గ్లోబల్ డేటా సెంటర్ అధ్యక్షులు బ్రూనో లోపెజ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎస్‌టీటీ డాటా సెంటర్ నిర్ణయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. ప్రపంచానికి హైదరాబాద్ డేటా హబ్‌గా మారుతోందని శ్రీధర్‌బాబు ధీమా వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ ఆధారిత రంగంలో వస్తున్న కొత్త మార్పుల్లో నగరం ముఖ్య పాత్ర పోషిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్, టీజీఐఐసీ ఎండీ.విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి :
సింగపూర్ సెమీ కండక్టర్ అసోసియేషన్‌కు మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి

రాష్ట్రంలో విరివిగా పెట్టుబడులు పెట్టాలని సింగపూర్ సెమీకండక్టర్ అసోసియేషన్ (ఎస్ఎస్ఐఏ) ప్రతినిధులకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు. ఈ దేశ పర్యటనలో ఉన్న ఆయన శనివారం వారితో సమావేశమై పెట్టుబడి అవకాశాలపై చర్చించారు. తెలంగాణాలో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటుకు అనుకూలమైన పరిస్థితులను మంత్రి వివరించారు. రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక వాతావరణం, పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను తెలియజేశారు. ప్రపంచ వ్యాప్తంగా సెమీకండక్టర్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో తెలంగాణ అందుకు కీలకమైన కేంద్రంగా నిలుస్తుందని మంత్రి తెలిపారు. ఎస్ఎస్ఐఏ ప్రతినిధులను రాష్ట్రానికి ఆహ్వానించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన వారు, ఈ ఏడాది చివర్లో హైదరాబాద్ వస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఐఏ చైర్మెన్ బ్రియాన్ టాన్, వైస్ చైర్మెన్ టాన్ యూ కాంగ్ తదితరులు పాల్గొన్నారు.



తెలుగుఖ్యాతిని చాటుదాం

సింగపూర్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ ప్రవాసుల సమావేశంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు ఖ్యాతిని చాటాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కె. జయవీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫోసిస్‌కు షాక్

ముంబయి : వారాంతం సెషన్‌లో ఇన్ఫోసిస్ షేర్ విలువ భారీగా పడిపోవడంతో ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎన్‌ఆర్ నారాయణమూర్తి కుటుంబం సంపద వేల కోట్లు ఆవిరయ్యింది. శుక్రవారం సెషన్‌లో అమ్మకాల ఒత్తిడితో ఇన్ఫీ షేర్ 6 శాతం పతనమై రూ.1,812.70కు పడిపోయింది. దీంతో బీఎస్ఇలో ఒక్క పూటలోనే మూర్తి కుటుంబ సంపద దాదాపు రూ.1,900 కోట్లు హరించుకుపోయింది. ఇన్ఫోసిస్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.7.54 లక్షల కోట్లకు పడిపోయింది. 2024 సెప్టెంబర్ ముగింపు నాటికి నారాయణ మూర్తి కుటుంబానికి సమిష్టిగా 4.02 శాతం వాటా ఉంది. ఇందులో మూర్తికి 0.40 శాతం, ఆయన సతీమణి సుధా మూర్తికి 0.92 శాతం, వారి కుమారుడు రోహన్ మూర్తికి 1.62 శాతం, కుమార్తె, రిషి సునక్ భార్య అక్షతా మూర్తికి 1.04 శాతం, మనవడు ఏకగ్రహ రోహన్ మూర్తికి 0.04 శాతం చొప్పున వాటాలున్నాయి. మొత్తంగా వీరి హోల్డింగ్ వాటా విలువ రూ.30,334 కోట్లుగా ఉంది.

సంజయ్ రాయ్ దోషి

కోల్‌కతా : దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన ఆర్‌జి కార్ ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య కేసులో సంజయ్ రాయ్‌ను దోషిగా సీల్దాలోని అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు శనివారం నిర్ధారించింది. 20వ తేదీన శిక్షను విధించనున్నట్లు న్యాయమూర్తి అనిర్బన్ దాస్ తెలిపారు. ఆ సమయంలో నిందితుడు, బాధితురాలి తల్లిదండ్రులు కోర్టు రూమ్‌లోనే వున్నారు. సిబిఐ అందజేసిన సాక్ష్యాధారాల ఆధారంగా సంజయ్ రాయ్‌ను దోషిగా తేల్చినట్లు కోర్టు తెలిపింది. గతేడాది ఆగస్టు 9న ఆస్పత్రిలోకి ప్రవేశించిన నిందితుడు బాధితురాలిని హత్య చేసి ఆపై లైంగిక దాడికి పాల్పడ్డాడని న్యాయమూర్తి తెలిపారు. ఈ దారుణానికి మరణశిక్ష లేదా యావజ్జీవ శిక్ష విధించే అవకాశముందని చెప్పారు. భారత న్యాయ సంహితలోని సెక్షన్లు 64, 66, 103(1) కింద నిందితుడిని దోషిగా నిర్ధారించినట్లు న్యాయమూర్తి దాస్ చెప్పారు. కోర్టు గదిలో తీర్పు చదువుతుండగా, కాగా తాను ఈ నేరం చేయలేదంటూ సంజయ్ రాయ్ కోర్టులో చెప్పాడు. "నేను ఇది చేయలేదు. ఇలా చేసిన వారు వున్నారు, వారినెందుకు పట్టుకోలేదు?" అని ప్రశ్నించాడు. శిక్ష విధించే ముందు సోమవారం మాట్లాడేందుకు అవకాశమిస్తామని సంజయ్ రాయ్‌కు న్యాయమూర్తి చెప్పారు. తీర్పు చెప్పిన వెంటనే బాధితురాలి తల్లిదండ్రులు కోర్టు గదిలోనే కన్నీటి పర్యంతమయ్యారు. 'మేం మీపై వుంచిన విశ్వాసానికి తగ్గట్టుగా మీరు వ్యవహరించారు.' అని బాధితురాలి తండ్రి వ్యాఖ్యానించారు. తీర్పు వెలువడేందుకు ముందు కోర్టు వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. అక్కడ ప్రజలు గుమిగూడేందుకు పోలీసులు అనుమతినివ్వనప్పటికీ సీల్దా కోర్టు కాంప్లెక్స్ వెలుపల పెద్ద సంఖ్యలో జనాలు మూగారు. కోర్టు తీర్పు కోసం వారు ఆతృతగా ఎదురుచూడడం కనిపించింది. ఈ నేరానికి సంజయ్ రాయ్ ఒక్కడే బాధ్యుడని తాము విశ్వసించడం లేదని అక్కడ గుమిగూడిన జనాల్లోని జూనియర్ డాక్టర్లు వ్యాఖ్యానించారు.

తొలుత ఈ నేరాన్ని కప్పిపుచ్చడానికి పశ్చిమ బెంగాల్ పోలీసులు ప్రయత్నిస్తున్నారని బాధితురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. దాంతో పశ్చిమ బెంగాల్ హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును కోల్‌కతా పోలీసులు సిబిఐకి బదిలీ చేశారు. పోలీసు వలంటీర్, ప్రధాన నిందితుడైన సంజయ్ రాయ్ పేరును మాత్రమే చార్జిషీట్‌లో పేర్కొంటూ అక్టోబరు 7న సిబిఐ చార్జిషీట్ దాఖలు చేసింది. సామూహిక అత్యాచారం అన్న అంశాన్నే ఆ ఛార్జిషీట్‌లో ప్రస్తావించలేదు. ఆగస్టు 9వ తేదీన ఆస్పత్రిలోని సెమినార్ రూమ్ నుండి బాధితురాలి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. సిసిటివి ఫుటేజ్ ప్రాతిపదికన 10వ తేదీన కోల్‌కతా పోలీసులు సంజయ్ రాయ్‌ను అరెస్టు చేశారు. తర్వాత కేసు సిబిఐకి బదిలీ అయింది. సాక్ష్యాధారాలు కింద 11 వస్తువులను సిబిఐ తన చార్జిషీట్‌లో పేర్కొంది. వీటిని చూస్తుంటే ఈ నేరంలో సంజయ్ రాయ్ పాత్ర వుందని నిర్ధారించబడుతోందని పేర్కొంది. సిసిటివి ఫుటేజ్ చూసినట్లైతే సంజయ్ రాయ్ సంఘటనా స్థలంలోకి రావడం వెళ్ళడం కనిపిస్తోంది.

ఆస్పత్రిలో రాత్రిపూట విధుల్లో వున్న జూనియర్ వైద్యురాలిపై ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టడం దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. కోల్‌కతా సహా రాష్ట్రవ్యాప్తంగానూ, దేశవ్యాప్తంగానూ విస్తృతంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. సంఘటన జరిగిన తర్వాత కూడా పశ్చిమ బెంగాల్‌లో నెలల తరబడి నిరసనలు, ఆందోళనలు కొనసాగాయి.

ఈ కేసులో ఆర్‌జి కర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తాలా పోలీస్ స్టేషన్ మాజీ ఆఫీసర్ ఇన్‌చార్జి అభిజిత్ మండల్‌లను కూడా తొలుత అరెస్టు చేశారు. సాక్ష్యాధారాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారని, ఎఫ్‌ఐఆర్ నమోదు చేసుకోవడంలో జాప్యం చేశారని అభియోగాలు కూడా వారిపై నమోదు చేశారు. అరెస్టయిన 90 రోజుల్లో వారిపై అనుబంధ చార్జిషీట్‌ను నమోదు చేయకపోవడంతో ప్రత్యేక న్యాయస్థానంలో వారికి బెయిల్ లభించింది.

మిగిలినవారి సంగతేంటి? : బాధితురాలి తల్లి

దర్యాప్తు సగమే పూర్తయిందని బాధితురాలి తల్లి వ్యాఖ్యానించారు. ఈ నేరంలో పాలుపంచుకున్న వారిలో ఇంకా చాలామంది స్వేచ్ఛగా తిరుగుతున్నారని బాధితురాలి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో న్యాయం జరిగేవరకు పోరాడతామన్నారు.

బ్యాంక్ అధికారుల వేధింపులకు రైతు బలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బ్యాంకు అధికారుల వేధింపుల కారణంగా ఓ రైతు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లాలో కలకలం రేపింది. వాయిదా చెల్లింపులో జరిగిన జాప్యానికి బ్యాంకు అధికారులు వేధింపులకు గురి చేశారన్న ఆవేదనతో బ్యాంకులోనే ఎదుటే పురుగుల మందు తాగి కుప్పకూలాడు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేల మండలం రేణిగూడ గ్రామానికి చెందిన జాదవ్ దేవ్‌రావ్(60) పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఉన్న ఐసీఐసీఐ బ్యాంకు నుంచి తన భూమిని మార్టిగేజ్ చేయించారు. నాలుగేండ్ల కింద మూడున్నర లక్షల రుణం తీసుకున్నాడు.

అప్పటి నుంచి క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తూ వస్తున్నాడు. ఇటీవల వాయిదా రూ.25వేలు అనివార్య కారణాలతో సకాలంలో చెల్లించలేకపోయాడు. దాంతో బ్యాంకు అధికారులు గ్రామానికి వెళ్లి వేధించినట్టు కుటుంబీకులు ఆరోపించారు. శనివారం బ్యాంకుకు వచ్చిన దేవ్‌రావ్ తొలుత మేనేజర్‌ను కలిసి బయటకు వెళ్లిపోయాడు. తర్వాత కొద్ది సేపటికి పురుగుల మందు డబ్బాతో బ్యాంకుకు చేరుకుని అది తాగి అక్కడే కూర్చున్నాడు. గమనించిన సెక్యూరిటీ, ఇతర సిబ్బంది ఆయనను ఆస్పత్రికి తరలించడంలో తాత్సారం చేయడంతో అక్కడే కుప్పకూలాడు. ఇదంతా అక్కడి సీసీ కెమెరాలో నిక్షిప్తమైంది. కుటుంబీకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో బ్యాంకు వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. పోలీసులు మధ్యాహ్నం నుంచి బ్యాంక్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాలుగేండ్ల నుంచి క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తూనే ఉన్నాడని రైతు దేవ్‌రావ్ అన్న కుమారుడు జాదవ్ కృష్ణ, సోదరుడు జాదవ్ హేమాలాల్ తెలిపారు. ఈసారి పంట దిగుబడి రాకపోవడంతో ఒక వాయిదా చెల్లింపులో జాప్యం జరిగిందని, ఈ మాత్రానికే బ్యాంకు అధికారులు వేధింపులతో ఒత్తిడికి గురి చేసి ఆత్మహత్యకు కారణమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరగని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి : ఎమ్మెల్యే

విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే పాయల శంకర్ బ్యాంకుకు చేరుకున్నారు. అధికారులు, కుటుంబీకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఒక్క వాయిదా చెల్లింపులో కొంత ఆలస్యమైతేనే రైతు పట్ల బ్యాంకర్లు నిర్దాక్షిణ్యంగా వ్యవహరించడం సమంజసం కాదని ఎమ్మెల్యే అన్నారు. వేల కోట్ల అప్పులను ఎగ్గొట్టే బడాబాబులను ఓ రకంగా, సామాన్య రైతును మరో రకంగా చూసే ధోరణి సరికాదన్నారు. ఊరికి వెళ్లి అందరి ముందు బ్యాంకు సిబ్బంది అవమానానికి గురిచేయడంతో ఆత్మగౌరవం దెబ్బతిని, రైతు ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఇందుకు బాధ్యులైన బ్యాంకు అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

రైతు దేవరావుది ప్రభుత్వ హత్యే

ఆ కుటుంబానికి రూ.20 లక్షలు చెల్లించాలి
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్
ఆత్మహత్యలకు పాల్పడవద్దంటూ రైతులకు విజ్ఞప్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆదిలాబాద్ జిల్లాకు చెందిన రైతు జాదవ్ దేవరావ్ ఆత్మహత్య ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కార్ చేసిన హత్యేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో విమర్శించారు. రుణమాఫీ కాకపోవడంతో బ్యాంకులోనే పురుగుల మందు తాగి ఆయన బలవన్మరణానికి పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ పేరిట చేసిన మోసమే రైతుల మరణానికి కారణమని పేర్కొన్నారు. "అప్పులు తీరక అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా సర్కారులో ఏమాత్రం చలనం లేదు. అధికారంలోకి రాగానే రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి మాట తప్పడం, రైతు భరోసా ఎగ్గొట్టడంతోనే దేవరావ్ అనే రైతు అన్యాయంగా బలయ్యారు. రైతు కుటుంబానికి రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఒకప్పుడు సాగులో, పంట దిగుబడిలో నెంబర్ వన్‌గా ఉన్న తెలంగాణ, ఇప్పుడు అన్నదాతల ఆత్మహత్యల్లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉండటం కాంగ్రెస్ సర్కారు అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. అన్నదాతలు ధైర్యం కోల్పోయి ఆత్మహత్యలు చేసుకోవద్దంటూ కేటీఆర్ వారికి విజ్ఞప్తి చేశారు. నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

త్వరలో హౌసింగ్ పాలసీ తీసుకొస్తాం

మధ్యతరగతి ప్రజలకూ ఇండ్లు నిర్మిస్తాం : మంత్రి పొంగులేటి వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కొత్తగా తెలంగాణ సమగ్ర హౌసింగ్ పాలసీని తీసుకొస్తామని గృహనిర్మాణ శాఖ మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మధ్యతరగతి వారి కోసం హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్, రీజనల్ రింగ్ రోడ్ మధ్యలో కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు తరహాలో ఇండ్ల నిర్మాణాలను చేపట్టబోతున్నామని తెలిపారు. కనీసం వంద ఎకరాల్లో ఈ టౌన్‌షిప్‌లను నిర్మించి వారికి అందుబాటులోకి తేవాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి ఎస్.హెచ్.రాజేష్ ధర్మాని సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం చేపడుతున్న గృహనిర్మాణ పథకాల వివరాలను ఈ సందర్భంగా ధర్మాని అడిగి తెలుసుకున్నారు. గృహనిర్మాణానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి వివరించారు. హౌసింగ్ నియమ నిబంధనల మేరకు అందుబాటులో ఉన్న బోర్డు స్థలాల్లో కొత్తగా గృహనిర్మాణానికి సంబంధించిన స్కీములను అమలు చేయాలని ఆలోచన చేస్తున్నట్టు తెలిపారు. ప్రయివేటు, ప్రభుత్వరంగ భాగస్వామ్యంతో గృహ పథకాల అమలుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. హౌసింగ్ బోర్డుకు సంబంధించిన భూముల పరిరక్షణకు ఒకవైపు చర్యలు తీసుకుంటూనే మరోవైపు వివిధ కోర్టుల్లో పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం 2014 అనుసరించి ఆస్తుల మరియు అప్పులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. రాష్ట్రంలో పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వడమే తమ ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమన్నారు. ఆ పథకం ద్వారా నిరుపేదలకు శాశ్వత గృహాలు నిర్మించాలన్న సంకల్పంతో వచ్చే నాలుగేండ్లలో 20లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. ఇప్పటికే మొదటి దశలో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ కొలిక్కి వచ్చిందనీ, వీలైనంత త్వరలో ఇండ్ల నిర్మాణాలను చేపట్టబోతున్నట్టు చెప్పారు. లబ్దిదారులే స్వయంగా ఇండ్లు నిర్మించుకునే సౌలభ్యం కల్పించామన్నారు. 400 చదరపు అడుగుల విస్తీర్ణం, వంటగది, టాయిలెట్ సౌకర్యం కలిగి ఉంటాయని చెప్పారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వమే రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తుందని వివరించారు. హైదరబాద్ విశ్వ నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతుందని గుర్తుచేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ మూడు సిటీలు ఉండగా ఫోర్త్ సిటీగా 15 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని మంత్రి వివరించారు.

కేజ్రీవాల్ కారుపై దాడి

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధానిలో శాంతి భద్రతలు అదుపుతప్పుతున్నాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక..బీజేపీ బరితెగిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఢిల్లీలో ఆప్ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కారుపై దాడి జరిగింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయన ఉన్న వాహనంపై రాళ్లు విసిరారు. ఇది బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మకు చెందిన గూండాల పని అని ఆప్ ఆరోపించింది. అయితే దీనిని పర్వేష్ వర్మ ఖండించారు. కేజ్రీవాల్ కారు ఇద్దరు యువకులను ఢీకొట్టిందని ఆరోపించారు. న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కేజ్రీవాల్ శనివారం ఆ ప్రాంతంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు వ్యక్తులు ఆయన వాహనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అలాగే కేజ్రీవాల్ ఉన్న కారుపై అమాంతంగా రాళ్లు రువ్వారు. అప్రమత్తమైన పోలీసులు కేజ్రీవాల్ కారును అక్కడి నుంచి పంపివేశారు. అయితే కేజ్రీవాల్ కారుపై దాడికి సంబంధించిన వీడియో క్లిప్‌ను సోషల్ మీడియాలో ఆప్ పోస్ట్ చేసింది. బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ గూండాలు ఈ చర్యకు పాల్పడినట్టు ఆరోపించింది. 'ఓటమి భయంతో బీజేపీ ఆందోళన చెందుతోంది. కేజ్రీవాల్‌పై దాడికి తమ గూండాలను ఉపయోగించింది. కేజ్రీవాల్ ప్రచారం చేస్తున్నప్పుడు బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ గూండాలు ఇటుకలు, రాళ్లతో దాడి చేశారు. ఆయనను గాయపరిచేందుకు ప్రయత్నించారు. కేజ్రీవాల్ ప్రచారం చేయకుండా చేయాలనుకున్నారు. బీజేపీ పిరికి చర్యలకు కేజ్రీవాల్ భయపడరు. ఢిల్లీ ప్రజలు మీకు తగిన సమాధానం ఇస్తారు' అని ఎక్స్‌లో పేర్కొంది. మరోవైపు ఆప్ ఆరోపణలను బీజేపీ అభ్యర్థి పర్వేష్ వర్మ ఖండించారు.



శనివారం విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి. ఈ సందర్భంగా ఫిలింనగర్‌లో కృష్ణ అవతారంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆయన కుటుంబ సభ్యులు, రాజకీయ నాయకులు, తెలుగు చిత్ర పరిశ్రమ పెద్దలు, అభిమానులు భారీ స్థాయిలో హాజరై ఘన నివాళి అర్పించారు. పరుచూరి గోపాలకృష్ణ, మాదాల రవి, ఎన్టీఆర్ మనవరాలు నందమూరి రూప, ఎన్టీఆర్ తనయుడు నందమూరి మోహన్ కృష్ణ, మాగంటి గోపీనాథ్, తెలుగు చిత్ర నిర్మాతల మండలి కార్యదర్శి తుమ్మల ప్రసన్న తదితరులు స్ఫూర్తిదాయక ఎన్టీఆర్ ప్రయాణాన్ని కొనియాడారు.

నవచిత్రం

ఉగాదికి గద్దర్ సినిమా అవార్డుల ప్రదానం

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



'ఈ ఏడాది ఉగాది నుంచి గద్దర్ తెలంగాణ చలన చిత్ర అవార్డులను అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు తగిన విధంగా కమిటీ సభ్యులు, అధికారులు వేగంగా ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలి' అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు.

శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన గద్దర్ అవార్డుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 'తెలుగు భాషలో నిర్మించిన ఉత్తమ చిత్రాలను గుర్తించి, ప్రశంసిస్తూ అవార్డులు అందజేస్తాం. జాతీయ సమైక్యత, ఐక్యతను పెంపొందించే సాంస్కృతిక, విద్యా, సామాజిక ఔచిత్యం కలిగిన అత్యున్నత సాంకేతిక నైపుణ్యం, మానవతా విలువలతో కూడిన చిత్రాల నిర్మాణాన్ని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఆవార్డులు ప్రదానం చేస్తున్నాం. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డుల కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీన్ని జాతీయస్థాయి కార్యక్రమాల తరహాలో నిర్వహిస్తాం. అలాగే కల్చరల్ ఐకాన్ గద్దర్‌కి సంబంధించి ప్రతిదీ పెంచేలా అవార్డుల లోగోలు రూపొందించాలని అధికారులకు పలు సూచనలు ఇచ్చాం. సినిమా నిర్మాణంలో హైదరాబాద్‌ను ప్రపంచ గమ్యస్థానంగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. గత పది సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని పరిపాలించిన వారు చిత్ర పరిశ్రమను నిర్లక్ష్యం చేశారు. అవార్డుల పంపిణీ జరగలేదు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంది. రాష్ట్రంలో సినిమాల నిర్మాణాన్ని ప్రోత్సహించే గద్దర్ తెలంగాణ సినిమా అవార్డులను ఈ ఉగాది నుంచి ప్రతి సంవత్సరం అందజేస్తాం' అని తెలిపారు.

గద్దర్ అవార్డుల కోసం లోగోతో సహా విధి విధానాలు, నియమ, నిబంధనలపై కమిటీ సమావేశం జరిగింది. అలాగే ఫీచర్ ఫిల్మ్‌లు, బాలల చిత్రాలు, తెలుగు సినిమాపై పుస్తకాలు వంటి వివిధ విభాగాల కింద అవార్డులు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. అవార్డులలో నగదు పురస్కారంతో పాటు ప్రశంసా పత్రం కూడా అందచేస్తారు.
ఈ సమావేశంలో టీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు, ఎండీ డాక్టర్ హరీశ్, ఈడీ కిషోర్‌బాబు, కమిటీ చైర్మన్ బీ నర్సింగ్‌రావు, కమిటీ సభ్యులు జయసుధ, తమ్మారెడ్డి భరద్వాజ్, హరీశ్ శంకర్, వందేమాతరం శ్రీనివాస్, గుమ్మడి వెన్నెల, అల్లాణి శ్రీధర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకులకు కృతజ్ఞతలు



బాలకృష్ణ

'నీటి సమస్య గురించి ప్రజలకు అవగాహన కలిగించిన సినిమా 'డాకు మహారాజ్'. ఒక తెలుగు ఇంజనీర్ రాజస్థాన్ వెళ్లి, అక్కడి ప్రజల కోసం డాకుగా మారడం ఈ సినిమాలో చూశారు. మా సినిమాని ఆదరించి, అఖండమైన విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు' అని బాలకృష్ణ చెప్పారు.

'డాకు మహారాజ్' చిత్రం సంక్రాంతి కానుకగా ఈనెల 12న విడుదలైంది. మొదటి షో నుంచే ప్రేక్షకుల నుంచి విశేష స్పందనను సొంతం చేసుకున్న ఈ సినిమా భారీ వసూళ్లతో బాక్సాఫీస్ దగ్గర సంచలనాలు సృష్టిస్తోంది. కేవలం ఐదు రోజుల్లోనే రూ.114 కోట్లకు పైగా గ్రాస్ రాబట్టి, బాలకృష్ణ కెరీర్‌లోనే అతి పెద్ద విజయం దిశగా దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో మేకర్స్ విజయోత్సవ సభను నిర్వహించారు.

బాలకృష్ణ మాట్లాడుతూ, 'నా రికార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా కలెక్షన్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా అవార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా రివార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్. కొత్తదనాన్ని తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. ఈ సినిమా విజయంతో ఇది మరోసారి రుజువైంది. తిరుమల ఘటన నేపథ్యంలో అనంతపురంలో తలపెట్టిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించలేకపోయాం. అందుకే ఈనెల 22న అనంతపురంలోనే విజయోత్సవ పండుగను జరుపుకోవాలని నిర్ణయించాం' అని తెలిపారు.

దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ, 'బాలకృష్ణ ఫిల్మోగ్రఫీలో గుర్తుండిపోయే సినిమాలలో ఒకటిగా నిలవాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని మొదలుపెట్టాం. డిస్ట్రిబ్యూటర్లు అందరికీ మూడు రోజుల్లోనే డబ్బులు వచ్చేసి హ్యాపీగా ఉన్నారు. బ్లాక్ బస్టర్లు చాలా వస్తాయి. కానీ రెస్పెక్ట్ అరుదుగా వస్తుంది. ఈ సినిమా చూసి ఎందరో నాకు మాస్టర్ పీఎస్ అని మెసేజ్‌లు పెడుతున్నారు' అని చెప్పారు.

'నన్ను, దర్శకుడు బాబీని నమ్మి మాకు ఈ సినిమా చేసే అవకాశం ఇచ్చిన బాలకృష్ణకి కృతజ్ఞతలు. అభిమానులు, ప్రేక్షకుల నుంచి మేం ఊహించిన దానికంటే పది రెట్లు ఎక్కువ స్పందన లభించింది. 3వ రోజుకే మా డిస్ట్రిబ్యూటర్లు సేఫ్ జోన్‌కి వెళ్లిపోయారు. అది మాకు పెద్ద సక్సెస్. డిస్ట్రిబ్యూటర్లకు డబ్బులు వచ్చినప్పుడే నిర్మాతలకు నిజమైన ఆనందం. మా దృష్టిలో అదే పెద్ద హిట్' అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ అన్నారు.

సినిమాని కాపాడే బాధ్యత మనదే

సక్సెస్ చాలా గొప్పది. అది డబ్బు పెడితే దొరకదు. సక్సెస్ ఎంతో ఎనర్జీని, భవిష్యత్‌కి భరోసాని ఇస్తుంది. ఈ రోజుల్లో నిర్మాత ఒక విజయం సాధించడం అంత తేలికైన విషయం కాదు. నిర్మాతను అందరూ ఒక దేవుడిలా చూడాలి. ఇప్పుడు తెలుగు సినిమా స్థాయి పెరిగి పోయింది. ప్రపంచ వ్యాప్తంగా మన సినిమా గురించి మాట్లాడుకుంటున్నారు. అందుకే నెగటివిటీని పక్కన పెట్టి, మనమందరం కలిసి మన సినిమాలకు మనమే సపోర్ట్ చేసుకోవాలి. సినిమాని కాపాడే బాధ్యత మనందరికి ఉంది. ఈ సినిమా విషయంలో అనంత శ్రీరామ్, కాసర్ల శ్యామ్ గొప్ప సాహిత్యం అందించారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా పని చేసిన నా మ్యూజికల్ టీంకి థ్యాంక్స్. నేపథ్య సంగీతం విషయంలో బాబీ చేసిన సపోర్ట్‌ను మరచిపోలేను. నిర్మాత వంశీ చాలా నిజాయితీగా ఉంటారు. బాలకృష్ణ, నా కాంబినేషన్‌లో వరుసగా 4 ఘన విజయాలు సాధించాం.

- సంగీత దర్శకుడు తమన్

'మ్యాడ్ స్క్వేర్' రిలీజ్‌కి రెడీ



బ్లాక్ బస్టర్ చిత్రం 'మ్యాడ్'కి సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' చిత్రాన్ని రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రాన్ని మార్చి 29న విడుదల చేయనున్నట్లు తాజాగా నిర్మాతలు ప్రకటించారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో 'మీరు హ్యాండిల్ చేయగలిగిన దానికంటే ఎక్కువ వినోదం, మీరు ఊహించిన దానికంటే ఎక్కువ మ్యాడ్‌నెస్' అని నిర్మాతలు పేర్కొన్నారు.
ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్, శ్రీకర స్టూడియోస్ పతాకాలపై హారిక సూర్యదేవర, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ సమర్పకులు. కళ్యాణ్ శంకర్ దర్శకుడు.
సంగీత్ శోభన్, నార్నే నితిన్, రామ్ నితిన్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈచిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: శామ్‌దత్, కూర్పు: నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైనర్: శ్రీ నాగేంద్ర తంగాల, అదనపు స్క్రీన్‌ప్లే: ప్రణయ్ రావు తక్కళ్లపల్లి, కళ: పెనుమర్తి ప్రసాద్.

భిన్న కాన్సెప్ట్‌తో 'శివ శంభో'



అనంత ఆర్ట్స్ పతాకంపై నర్సింగ్ రావు దర్శకత్వంలో రాజగోపాల్, దోరవేటి సుగుణ నిర్మిస్తున్న చిత్రం 'శివ శంభో'.
తనికెళ్ల భరణి, సుమన్ ముఖ్య పాత్రల్లో నటించిన ఈ సినిమా పోస్టర్‌ను చిత్ర బృందం సమక్షంలో గాయకుడు, రచయిత, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న విడుదల చేశారు. ఈ చిత్రంతో పరిచయం అవుతున్న హీరో కృష్ణ ఇస్లావత్, హీరోయిన్ కేశవర్ధిని, బేబీ రిషిత తదితరులు ఇందులో ఇతర కీలక పాత్రలను పోషించారు.
గోరటి వెంకన్న మాట్లాడుతూ, 'పోస్టర్ చూస్తుంటే తెలుగు సాహిత్యం, సంస్కృతితో పాటు అన్ని హంగులతో ఈ సినిమా ఉన్నట్లు తెలుస్తోంది. మంచి కాన్సెప్ట్‌తో నిర్మించిన ఈ చిత్రం ఘనవిజయం సాధిస్తుంది' అని చెప్పారు.
'మహా శివరాత్రికి సినిమాను విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. సినిమా చాలా బాగా వచ్చింది' అని దర్శకుడు నర్సింగ్‌రావు తెలిపారు. మాటలు, పాటల రచయిత దోరవేటి మాట్లాడుతూ,'ఈనాటి సమాజానికి డబ్బు, సుఖాలు, సౌకర్యాలకు కొరత లేదు. కానీ మనశ్శాంతి లేక కొట్టుకుంటున్నారు. పరమ శివుని నమ్ముకుంటేనే శాంతి దొరుకుతుందనే సందేశంతో రూపొందిన ఈ చిత్రం అందరికీ నచ్చుతుంది' అని అన్నారు.

ఓ తల్లి కథ..



రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'తల్లి మనసు'. వి.శ్రీనివాస్ (సిప్పీ) దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ముత్యాల మూవీ మేకర్స్ పతాకంపై దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిషోర్ తొలిసారి నిర్మాతగా మారి, నిర్మించిన చిత్రమిది.
ఇటీవల సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఈ నెల 24న థియేటర్లలో విడుదల చేస్తున్నట్లు నిర్మాత ముత్యాల అనంత కిషోర్ తెలియజేశారు.
సమర్పకులు ముత్యాల సుబ్బయ్య మాట్లాడుతూ, 'దర్శకుడిగా 50 చిత్రాలు తీశాను. అయితే సొంత చిత్ర నిర్మాణం మునుపు ఎన్నడూ చేయలేదు. మా పెద్ద అబ్బాయి అనంత కిషోర్ నిర్మాతగా ఓ మంచి చిత్రం తీయాలన్న అభిరుచి మేరకు ఈ సినిమాను సొంతగా నిర్మించాం. తల్లికి ఎన్ని నిర్వచనాలు ఇచ్చినా సరిపోవు. అలాంటి తల్లి సబ్జెక్ట్‌ని తీసుకుని, పాత్రలకు తగ్గ నటీనటులనే ఎంచుకుని ఈ సినిమాను తీశాం. కథలో, పాత్రలలో ప్రేక్షకులు పూర్తిగా నిమగ్నమయ్యే విధంగా సినిమా వచ్చింది. ఇలాంటి మంచి చిత్రాలను ఆదరిస్తే మరిన్ని మంచి చిత్రాలు వస్తాయి' అని అన్నారు.
'ఓ తల్లి ఎలాంటి సంఘర్షణలకు గురయ్యిందన్న అంశాన్ని ప్రేక్షకులకు హత్తుకునేలా వైవిధ్యంగా చెప్పాం. భావోద్వేగం, సెంటిమెంట్, ఎంటర్‌టైన్మెంట్ వంటి అంశాల మేళవింపుతో చిత్రం ఉంటుంది. నిర్మాత అభిరుచి లేకపోతే ఇంత మంచి చిత్రం రాదు' అని దర్శకుడు వి.శ్రీనివాస్ (సిప్పీ) చెప్పారు.

క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీదే భవిష్యత్

రాష్ట్రంలో 2035 నాటికి 40వేల మెగావాట్ల ఉత్పత్తి లక్ష్యం

- పైలట్ ప్రాజెక్టులుగా 25 గ్రామాలు ఎంపిక
- వ్యవసాయ పంపుసెట్లు సహా ఇండ్లకూ సోలార్ విద్యుత్తే...
- ఏడాది ప్రజాపాలనలో చాలా చేశాం : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- 121 మంది విద్యుత్ ఉద్యోగులకు నియామకపత్రాలు అందజేత



విద్యుత్ ఉద్యోగులకు పెండింగ్ డీఏ చెల్లిస్తూ ఉత్తర్వులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్‌రంగంలో భవిష్యత్ అంతా క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీదేనని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్‌శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దానికోసం రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాల ఏర్పాట్లు చేస్తున్నదనీ, నూతనంగా క్లీన్ అండ్ గ్రీన్ విద్యుత్ పాలసీని కూడా ప్రకటించామని చెప్పారు. 2024 మార్చి 8వ తేదీ రాష్ట్రంలో 15,623 మెగావాట్లు పీక్ డిమాండ్ వచ్చిందనీ, ఎక్కడా ఎలాంటి అవాంతరాలు లేకుండా సమర్థవంతంగా విద్యుత్ పంపిణీ చేశామని వివరించారు. హైదరాబాద్ నగరంతో పాటు జిల్లాల్లోనూ పట్టణీకరణ విస్తరిస్తున్నదనీ, 2029-30 నాటికి 22,448 మెగావాట్ల పీక్ డిమాండ్ వస్తుందని అంచనా వేశామన్నారు. 2034-35 నాటికి రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణం తర్వాత విద్యుత్ డిమాండ్ 31,809 మెగావాట్లకు చేరుతుందన్నారు. ఆ లక్ష్యాన్ని చేరేందుకు థర్మల్ పవర్‌తో పాటు క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీలో ప్రపంచంతో పోటీపడుతూ కొత్త ఎనర్జీ పాలసీని రూపొందించామని వివరించారు. 2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ, 2035 నాటికి మరో 20వేల మెగావాట్లు మొత్తం 40వేల మెగావాట్లు సమకూర్చుకొనేలా విద్యుత్‌శాఖ కసరత్తు చేస్తుందని తెలిపారు. పైలట్ ప్రాజెక్టులుగా 25 గ్రామాలను ఎంపిక చేశామనీ, అక్కడ పూర్తిగా సోలార్ విద్యుత్‌ను వినియోగాన్ని ప్రయోగాత్మకంగా చేపడతామన్నారు. ఆ గ్రామాల్లోని వ్యవసాయ పంపుసెట్లు, ఇండ్లకు కూడా సోలార్ విద్యుత్‌నే అనుసంధానం చేస్తామనీ, అక్కడి ఫలితాలనుబట్టి దాన్ని రాష్ట్రం మొత్తానికి విస్తరిస్తామన్నారు. శనివారంనాడిక్కడి సచివాలయం సమీపంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద తెలంగాణ ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్)లో 92 మందికి, టీజీ ట్రాన్స్‌కోలో 20 మంది నూతన జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్లకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియామకపత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పదేండ్లు గ్రూప్-1 పరీక్ష కోసం రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులు హైదరాబాద్ కోచింగ్ సెంటర్లకు వచ్చి శిక్షణ తీసుకున్నారనీ, వయసు పైబడిందే తప్ప, పరీక్ష మాత్రం నిర్వహించలేదని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతినెలా నియామక పత్రాలను కుటుంబ సభ్యుల సమక్షంలో ఇస్తున్నామనీ, ఇప్పటి వరకు 56వేల మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. మిగిలిన వారికి కూడా జాబ్ క్యాలెండర్ ప్రకటించి, పోటీపరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో చదువుకున్న నిరుద్యోగు లందరికీ ప్రభుత్వ, ప్రయివేటు ఉద్యోగాలు కల్పించడంతో పాటు స్వయం ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ఎక్కువ మొత్తం కేటాయిస్తుందనీ, రూ.5 వేల కోట్లను యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల కోసం ఖర్చుచేస్తున్నామని తెలిపారు. భవిష్యత్ విద్యుత్ సవాళ్లను ఎదుర్కొనుందుకు సిద్ధంగా ఉన్నామనీ, రాష్ట్రంలో 28 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచితంగా నిరంతర విద్యుత్ అందిస్తున్నామన్నారు. 2004లోనే కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రైతులకు ఉచిత విద్యుత్‌ను ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పటి వరకు వ్యవసాయ ఉచిత విద్యుత్ కోసం డిస్కంలకు రూ.8,729 కోట్లను చెల్లించామన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామనీ, దానికోసం ఇప్పటి వరకు రూ.1,485 కోట్లను ఆర్థిక శాఖ విడుదల చేసిందన్నారు. ప్రతినెలా రూ.148 కోట్ల సొమ్మును విద్యుత్ పంపిణీ సంస్థలకు చెల్లిస్తున్నామని తెలిపారు.

గడచిన పదేండ్ల పాలన అబద్ధాలమీదే జరిగిందనీ, ఆపార్టీ పుట్టుకే అబద్ధాల ప్రాతిపదికగా ఏర్పడిందంటూ బీఆర్ఎస్ పేరు ప్రస్తావించకుండా వ్యాఖ్యలు చేశారు. పదేండ్లు ఏమీ చేయకుండా, ఇప్పుడు ఇందిరమ్మరాజ్యంపై అపవాదులు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేండ్లలో వారు చేసిన అప్పులు, ఆర్థిక విధ్వంసాన్ని సరిదిద్దుతూనే, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఎప్పుడు ఇస్తారో కూడా తెలియని పరిస్థితులు ఉన్నాయనీ, తాము అధికారంలోకి వచ్చాక ఒకటవ తేదీనే జీతాలు చెల్లిస్తున్నామన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామనీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామనీ,. మహాలక్ష్మి స్కీం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని వివరించారు. గత ప్రభుత్వం లక్షరూపాయల రైతు రుణమాఫీని నాలుగు వాయిదాల్లో చేస్తే, ఆ సొమ్ము వడ్డీలకే సరిపోలేదన్నారు. కానీ తమ ప్రభుత్వం వచ్చాక ఒకేసారి రూ.2 లక్షల వరకు మొత్తం రూ.21వేల కోట్లను ఒకేసారి రుణమాఫీ చేశామన్నారు. సాగుయోగ్యమైన భూమి ఉన్న రైతులందరికీ రైతు భరోసా ఇస్తామనీ, దానికోసం రూ.8,400 కోట్లు అవసమవుతాయని ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. అలాగే భూమి లేని రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో ఆర్థికసాయాన్ని ఈనెల 26నుంచి అందచేయబోతున్నామని చెప్పారు. కొత్త రేషన్‌కార్డులు ఇస్తున్నామనీ, సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి, సంక్షేమ హాస్టళ్లకు డైట్ చార్జీలు పెంచామని తెలిపారు. పదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్, ఆర్థికశాఖల ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చామని చెప్పారు. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రాన్ని గత పాలకులు అల్లకల్లోలం చేశారనీ, ఇప్పుడు మీడియా, సోషల్ మీడియా చేతిలో ఉన్నాయని ఇష్టం వచ్చినట్టు ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్ సిటీ అభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు పెట్టామన్నారు. ముఖ్యమంత్రి, ఐటీశాఖ మంత్రి దావోస్ పర్యటనలో భారీ ఎత్తున విదేశీ పెట్టుబడులు తెస్తున్నారని తెలిపారు. విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లకు సంబంధించి లోన్లు, డిఏ చెల్లించేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. రాష్ట్ర అభివృద్ధి విద్యుత్‌శాఖతోనే ముడిపడి ఉంది. ఉద్యోగులు తమ జీవితాలను రాష్ట్ర అభివృద్ధి కోసం అంకితం చేస్తూ, స్థూల జాతీయోత్పత్తి పెంచే చర్యల కోసం కృషి చేయాలని చెప్పారు. ఆరోగ్య శాఖలో 108కు ఫోన్‌చేస్తే వైద్యబృందం ఎలాగైతే ఇంటి ముంగిటకు వస్తుందో అదే తరహాలో విద్యుత్‌శాఖకు చెందిన టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు ప్రజలు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. దానికోసం విద్యుత్‌శాఖలో ట్రాన్స్‌ఫార్మరు సహా ఇతర పరికరాలన్నీ ఉండేలా ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశామనీ, ప్రజల ఇండ్ల వద్దకే వచ్చి వారు సమస్యలు పరిష్కరిస్తారని వివరించారు. కార్య క్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పొరుగు రాష్ట్రం నుంచి రావల్సిన నీరు, కరెంటును చర్చల ద్వారా తెచ్చుకుంటామన్నారు. విద్యుత్‌శాఖ వ్యవసాయానికి అనుబంధమై ఉంటుందనీ, సాగు విస్తీర్ణం ఎంత పెరిగిందనే లెక్కలు కాకుండా, ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నామో లేదో గమనించుకోవాలన్నారు. దేశంలోనే తెలంగాణ అత్యధిక పంటలు పండించిందనీ, అరనిముషం కూడా నిరంతర విద్యుత్‌కు ఆటంకం కలిగించొద్దనీ, రైతులను ఇబ్బంది పెట్టొద్దనీ విజ్ఞప్తి చేశారు. పదేండ్లలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని చక్కబెడుతూనే రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలోకి తీసుకెళ్తున్నామన్నారు. బడ్జెట్‌లో 35 శాతం వ్యవసాయశాఖకు కేటాయించారనీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు దేనికోసం దీక్షలు చేస్తున్నారో ప్రజలకు వివరించి చెప్పాలని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో టీజీట్రాన్స్‌కో సీఎమ్‌డీ కృష్ణభాస్కర్, జేఎమ్‌డీ శ్రీనివాసరావు, ఉత్తర, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థల సీఎమ్‌డీలు వరుణ్‌రెడ్డి, ముషారఫ్ ఫారూఖీ పాల్గొన్నారు.

ఆటలు

జైస్వాల్‌కు పిలుపు

జస్‌ప్రీత్ బుమ్రా, కుల్‌దీప్‌లకు చోటు
చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టు ఎంపిక

2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌లో రన్నరప్‌గా నిలిచిన టీమ్ ఇండియా.. చాంపియన్స్ ట్రోఫీని సైతం రోహిత్ శర్మ సారథ్యంలోనే వేటాడనుంది. ఫిట్‌నెస్ సమస్యలు ఉన్నప్పటికీ జస్‌ప్రీత్ బుమ్రా, కుల్‌దీప్ యాదవ్‌లు జట్టులో నిలువగా.. యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ తొలిసారి వన్డే జట్టులో చోటు సాధించాడు. ఫిబ్రవరి 19 నుంచి చాంపియన్స్ ట్రోఫీ ఆరంభం.

నవతెలంగాణ-ముంబయి

ఎటువంటి సంచలనాలకు తావు లేకుండా ఐసీసీ 2025 చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టును ఎంపిక చేశారు. శనివారం ముంబయిలో సమావేశమైన సీనియర్ సెలక్షన్ కమిటీ 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఆసీస్‌తో ఐదో టెస్టులో గాయపడిన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా, గత నవంబర్‌లో హెర్నియా శస్త్రచికిత్స అనంతరం గ్రౌండ్‌లో అడుగుపెట్టని స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ సహా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ భారత జట్టులో నిలిచారు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఓటమితో భారత డ్రెస్సింగ్‌రూమ్‌లో అలజడి రేగినా.. రోహిత్ శర్మకే మరోసారి కెప్టెన్సీ పగ్గాలు దక్కాయి. టీ20ల్లో అక్షర్ పటేల్‌కు వైస్ కెప్టెన్సీ ఇవ్వగా.. వన్డే ఫార్మాట్‌లో శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. చాంపియన్స్ ట్రోఫీ ముంగిట స్వదేశంలో ఇంగ్లాండ్‌తో భారత్ మూడు వన్డేలు ఆడనుంది.

సిరాజ్‌కు షాక్ :

ఇటీవల భారత క్రికెట్ సర్క్యూట్‌లో కీలక ఆటగాడిగా ఎదిగిన హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు చుక్కెదురైంది. కొంతకాలంగా అంచనాలను అందుకోని సిరాజ్‌ను సెలక్షన్ కమిటీ పక్కనపెట్టింది. ఆసీస్‌తో టెస్టు సిరీస్‌లో సిరాజ్ నిరాశపరిచాడు. ఇంగ్లాండ్‌తో తొలి రెండు వన్డేలకు బుమ్రా దూరం కాగా.. అతడి స్థానంలో హర్షిత్ రానాను ఎంపిక చేశారు. కానీ సిరాజ్‌ను కనీసం ప్రత్యామ్నాయ పేసర్‌గా సైతం పరిగణించలేదు. చాంపియన్స్ ట్రోఫీ జట్టులో సిరాజ్‌కు చోటు దక్కలేదు. వికెట్ కీపర్ సంజు శాంసన్‌కు సైతం నిరాశే ఎదురైంది. రిషబ్ పంత్‌ను వికెట్ కీపర్‌గా ఎంపిక చేయగా.. బ్యాకప్‌గా కెఎల్ రాహుల్ జట్టులో ఉండనే ఉన్నాడు.

షమికి చోటు :

ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన మహ్మద్ షమికి సెలక్టర్లు పిలుపు అందింది. దేశవాళీ క్రికెట్‌లో ఫిట్‌నెస్‌తో పాటు ఫామ్ నిరూపించుకున్న షమిని ఇంగ్లాండ్‌తో టీ20, వన్డే సిరీస్‌తో పాటు చాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేశారు. అర్షదీప్ సింగ్ మూడో పేసర్‌గా ఎంపిక కాగా.. జస్‌ప్రీత్ బుమ్రా జట్టులో నిలిచాడు. స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ సైతం సర్జరీ అనంతరం నేరుగా జట్టులోకి వచ్చాడు. ఈ ఫార్మాట్‌లో కుల్‌దీప్ పోషించగల పాత్ర దృష్ట్యా సెలక్షన్ కమిటీ అతడికి ఓటేసింది. ఆల్‌రౌండర్ల జాబితాలో హార్దిక్ పాండ్యతో పాటు రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ నిలిచారు.

జైస్వాల్ వచ్చాడు :

అద్భుత ఇన్నింగ్స్‌లతో విమర్శకుల మెప్పు పొందుతున్న యువ బ్యాటర్ యశస్వి జైస్వాల్ తొలిసారి వన్డే జట్టులోకి వచ్చాడు. రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఓపెనర్లు ఉండగా.. యశస్వి జైస్వాల్ మూడో ఓపెనర్‌గా ఎంపికయ్యాడు. మిడిల్ ఆర్డర్‌లో విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ ఉన్నారు. కెఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ ఇటీవల మంచి ఫామ్‌లో ఉన్నారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి మాత్రమే బ్యాటింగ్ లైనప్‌లో ఫామ్‌లో లేని ఆటగాళ్లు.

బుమ్రాకు పరీక్ష! :

పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా ఆసీస్ పర్యటనలో గాయం బారిన పడిన సంగతి తెలిసిందే. వైద్యుల సూచన మేరకు బుమ్రా ఐదు వారాల పాటు విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ సమయంలో బౌలింగ్ చేయకూడదు. ఇంగ్లాండ్‌తో మూడో వన్డే ఫిబ్రవరి 12న జరుగనుంది. దీంతో ఇంగ్లాండ్‌తో చివరి వన్డేలో బుమ్రా ఫిట్‌నెస్



పరీక్ష కోసం బరిలోకి దిగనున్నాడు. చాంపియన్స్ ట్రోఫీకి తుది జట్టును ప్రకటించేందుకు ఫిబ్రవరి 11 ఆఖరు గడువు. ఒకవేళ, బుమ్రా ఆశించిన సమయానికి ఫిట్‌నెస్ సాధించకపోతే సెలక్షన్ కమిటీ మరోసారి సమావేశమై సరైన నిర్ణయం తీసుకోనుంది.

చాంపియన్స్ ట్రోఫీకి భారత జట్టు :

రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), హార్దిక్ పాండ్య, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, జస్‌ప్రీత్ బుమ్రా, మొహమ్మద్ షమి, అర్షదీప్ సింగ్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.



పరస్పర సహకారంతో విద్యాభివృద్ధికి కృషిచేద్దాం

- తెలంగాణ, ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మెన్ల సమావేశంలో నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పరస్పర సహకారంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యాభివృద్ధికి కృషి చేద్దామని తెలంగాణ, ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మెన్లు వి బాలకిష్టారెడ్డి, కె మధుమూర్తి అన్నారు. శనివారం హైదరాబాద్‌లో బాలకిష్టారెడ్డితో మధుమూర్తి సమావేశమయ్యారు. రెండు రాష్ట్రాల్లో అమలవుతున్న విద్యావిధానాలతోపాటు ఉన్నత విద్యారంగం బలోపేతం, సంస్థల మధ్య సహకారంపై చర్చించారు. ఉన్నత విద్యలో పరస్పర సహకారం ఉండాలని నిర్ణయించామని అన్నారు. విద్యా ప్రగతిపై ఎక్కువ కేంద్రీకరణ చేయాలని వివరించారు. ఆవిష్కరణలు, అవకాశాలపై ఉమ్మడిగా పలు చర్యలు చేపట్టాలని అభిప్రాయానికి వచ్చామన్నారు. రెండు రాష్ట్రాల్లోని విద్యార్థులు, అధ్యాపకులకు ఉపయోగపడేలా నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు. నాణ్యమైన విద్య, పరిశోధనలు, స్కిల్ డెవలప్‌మెంట్ అంశాలకు ప్రాధాన్యతనివ్వాలని నిర్ణయించామని అన్నారు. ఆలోచనలు పంచుకోవాలని సూచించారు. తెలంగాణ, ఏపీ మధ్య విద్యారంగ విషయాల్లో రెండు ఉన్నత విద్యామండళ్లు కీలకంగా వ్యవహరించాలని ఆకాంక్షించారు.

'అండర్‌గ్రౌండ్'కు ఆసక్తి వ్యక్తీకరణ

- 'గ్రేటర్' పరిధిలో అమలుకు కసరత్తు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో భూగర్భ కేబుల్స్ (అండర్‌గ్రౌండ్) ఏర్పాటు కోసం అర్హత ఉన్న కంపెనీలు ఆసక్తి వ్యక్తీకరణకు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎమ్‌డీ ముషారఫ్ ఫారూఖీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం బహిరంగంగా ఉన్న విద్యుత్ లైన్ల స్థానంలో భూగర్భ కేబుల్స్‌కు మార్చే ప్రక్రియను ప్రారంభించామని ఆయన తెలిపారు. ప్రపంచంలోనే అత్యుత్తమ అండర్ గ్రౌండ్ కేబుల్ విధానాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామనీ, దానికోసం అందుబాటులో ఉన్న సాంకేతికతను పరిశీలిస్తున్నామన్నారు. అండర్‌గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ ఏర్పాటు వల్ల ప్రజా భద్రతతో పాటు నెట్‌వర్క్ మరింత పటిష్టమవుతుందని చెప్పారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ నగరాల సరసన నిలబెట్టడానికి ఈ విధానం వీలు కల్పిస్తుందన్నారు. ఆసక్తి వ్యక్తీకరణ కోసం తమ సంస్థ వెబ్‌సైట్ ్స్రంశీబ్ష్రవతీఅజూశీఓవతీ.శీతీస్ర లో వివరణాత్మక ప్రకటన ఉన్నదని తెలిపారు.

ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని విద్యుత్ నెట్‌వర్క్ వివరాలను ఆయన వెల్లడించారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్లు 498 ఉన్నాయనీ, 33 కేవీ అండర్‌గ్రౌండ్ కేబుల్స్ 1,280 కి.మీ., 33 కేవీ ఓవర్‌హెడ్ లైన్ 3,725 కి.మీ., సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు1022 ఉన్నాయని తెలిపారు. దానితో పాటు 11 కేవీ అండర్‌గ్రౌండ్ కేబుల్ 957 కి.మీ., 11 కేవీ ఓహెచ్ లైన్ 21,643 కి.మీ., డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు 1,50,992, ఇంటర్మీడియట్ స్తంభాలు 58,271 ఉన్నాయని వివరించారు.

మెడికల్ విద్యార్థుల బ్యాక్‌లాగ్ క్లియరెన్స్‌కు అవకాశం కల్పించండి

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తల్లిదండ్రుల విజ్ఞప్తి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ మెడికల్ కళాశాలల్లో 2021-22 బ్యాచ్‌కి చెందిన ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు బ్యాక్ లాగ్ క్లియరెన్స్ చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించాలని పలువురు తల్లిదండ్రులు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిని కోరారు. శనివారం పలువురు ఎంబీబీఎస్ బ్యాక్‌లాగ్ విద్యార్థుల తల్లిదండ్రులు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిసి విజ్ఞాపన పత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 70 మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు ఇచ్చిన నాలుగు అవకాశాల్లో సబ్జెక్టులు క్లియర్ చేసుకోలేక పోయారని, వారికి ఐదోసారి అవకాశం ఇప్పించి విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పాటును అందించాలని తల్లిదండ్రులు కోరారు. వైద్యవిద్య ప్రవేశ పరీక్ష 2021 సెప్టెంబర్ 13న జరగగా, 2022 జనవరిలో కౌన్సిలింగ్ నిర్వహించి 2023 జనవరిలో పరీక్షలు నిర్వహించారని తెలిపారు. కానీ కోవిడ్ ప్రభావంతో మెడికల్ ఎంట్రెన్స్, తరగతులు, పరీక్షలు సకాలంలో జరగలేదనీ, అందువల్ల విద్యార్థులు నాలుగు సార్లు అవకాశాలు కల్పించినప్పటికీ మొదటి సంవత్సరం సబ్జెక్టులు క్లియర్ చేయలేక పోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌ఈఈటి (నీట్) ఉత్తీర్ణత సాధించి ఎంబీబీఎస్ సీటు సాధించినప్పటికీ ఆ కోర్సులో ఉత్తీర్ణులు కాకపోతే వారి భవిష్యత్తు ఇబ్బందికరంగా మారుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్ కారణంగా ముందు బ్యాచ్ విద్యార్థులకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ఐదోసారి అవకాశం ఇచ్చిందనీ, అదే విధంగా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఎన్ఎంసీ ద్వారా ఈ 70 మంది విద్యార్థులకు కూడా మరోసారి అవకాశం కల్పించి న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరారు. ఇది దేశవ్యాప్త సమస్య అని, కేవలం రాష్ట్రస్థాయిలో చేయడం కుదరదనీ, ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వంలోని సంబంధిత మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకువెళతానని మంత్రి కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు.

పదేండ్లలో గుర్తుకురాని రైతులు ఇప్పుడు గుర్తుకొస్తున్నారా?

- మాజీ మంత్రి కేటీఆర్‌కు మంత్రి తుమ్మల సూటి ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదేండ్లు అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకురాని రైతులు అధికారం కోల్పోయాక గుర్తుకొస్తున్నారా? అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాజీ మంత్రి కేటీఆర్‌ను ప్రశ్నించారు.బీఆర్ఎస్ సర్కారు రైతు బంధు పథకాన్ని సీజన్ తర్వాత కూడా ఇచ్చిన విషయాన్ని మరచిపోయారా? అని ఎద్దేవా చేశారు. రైతుబంధు పేరు చెప్పి పంటల బీమా, వ్యవసాయ యాంత్రీకరణ పథకాలకు తిలోదకాలు ఇచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా? అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంట నష్ట పోయినప్పుడు ఏనాడైనా రైతులను ఆదుకున్నారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నేతలు రైతు దీక్షల పేరిట కొత్త విన్యాసాలు ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. నాలుగేండ్ల కాలంలో 35,31,913 మంది రైతులకు రూ.16,143.94 కోట్ల రుణమాఫీ చేసిందని తెలిపారు. దీంతో రైతులపై రూ.2,630 కోట్ల అధిక వడ్డీ భారం పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏకకాలంలో చేయకపోవడంతో రైతులపై రూ. 8,515 కోట్ల అధిక వడ్డీ భారం పడిందని తెలిపారు. రైతు రుణమాఫీ సమస్యలను పరిష్కరించేందుకు డీబీటీ రిటర్న్ అయిన 2,26,342 మంది రైతులకు సంబంధించి రూ. 1,419.74 కోట్లు పంపిణీ జరగలేదని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఏకకాలంలో రూ. 2 లక్షల లోపు రుణమాఫీ చేసినట్టు తెలిపారు. అర్హులైన 25,35,964 మంది రైతులకు రూ. 20,616.89 కోట్లు నెలలోపే మాఫీ చేశామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక విధ్వంసంతో కుదేలైన ఆర్థిక పరిస్థితులను చక్కబెట్టుకుంటూనే రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకులు వాస్తవాలను తెలుసుకోవాలని సూచించారు. రైతు సంక్షేమం కోసం పాటుపడుతున్న ఈ ప్రభుత్వానికి నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలని కోరారు.

బాలికలను అన్ని రంగాల్లోనూ ప్రోత్సహించాలి



- చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి
- అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించాలి : దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

నవతెలంగాణ-దౌల్తాబాద్

బాలికలను ఉపాధ్యాయులు అన్ని రంగాల్లోనూ ప్రోత్సహించాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాల కనుగుణంగా చదివి ఉన్నతంగా ఎదగాలని, విద్యాలయం ఆవరణలో మొక్కలు నాటాలని, చదువుతో పాటు క్రీడల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం బాలికల వసతి గృహం ప్రారంభం, ఇందిరమ్మ నమూనా గృహానికి జిల్లా కలెక్టర్ మనుచౌదరి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతి ఒక్కరూ తల్లిదండ్రుల పేరు మీద ఒక్కొక్క మొక్క నాటాలని సూచించారు.మెయిన్ రోడ్డు నుంచి ఆదర్శ పాఠశాలకు వెళ్లేందుకు సీసీ రోడ్డు కోసం ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్‌కు సూచించారు. సీసీ రోడ్డుతో పాటు ఐమాక్స్ లైట్లు, స్ట్రీట్ లైట్లు, సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

అలాగే ఇందిరమ్మ ఇంటిని నాణ్యతతో నిర్మించాలన్నారు.

ప్రొటోకాల్ పాటించలేదని బీఆర్ఎస్ ఆందోళన

ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో ఫ్లెక్సీ మీద ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పేరు లేకపోవడంతో బీఆర్ఎస్ కార్యకర్తలు అభ్యంతరం తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వివాదం జరగడంతో పోలీసులు నిలువరించారు. వెంటనే అధికారులు ఫ్లెక్సీని తొలగించడంతో గొడవ సద్దు మణిగింది. ఇలాంటివి పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన మంత్రి

అంగన్వాడీ కేంద్రాలలో మంత్రి తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించి పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో సదానందం, తహసీల్దార్ చంద్రశేఖర్ రావు, ఎంఈఓ గజ్జల కనకరాజు, ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మ, పీఏసీఎస్ చైర్మెన్ వెంకట్‌రెడ్డి, ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, దౌల్తాబాద్ మాజీ ఎంపీపీ గంగాధర్ సంధ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గొల్లపల్లి కనకయ్య, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏస్ నెక్స్ట్ జెన్ ప్రతినిధిని ప్రశ్నించిన ఏసీబీ

ఫార్ములా-ఈ కారు రేస్ కేసులో మూడు గంటలు విచారణ



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫార్ములా-ఈ కారు రేసింగ్ కేసులో శనివారం ఏస్ నెక్స్ట్ జెన్ ప్రతినిధిని మూడు గంటల పాటు రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు విచారించారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ప్రతినిధి సీఎస్ శెట్టిని ఏసీబీ అధికారులు సుదీర్ఘంగా మూడు గంటల పాటు ప్రశ్నించారు. ఫార్ములా-ఈ కారు రేసింగ్ మొదటి సెషన్‌లో భాగస్వామి అయిన ఏస్ నెక్స్ట్ జెన్ సంస్థ రెండో సెషన్ వచ్చే సరికి అకస్మాత్తుగా ఎందుకు ఒప్పందాన్ని వీడి వెళ్లిపోయింది? మొదలుకొని ఒప్పందంలో ఏవైనా విభేదాలు తలెత్తాయా? లేక లాభాలు రానందున వెళ్లిపోయారా? వరకు ఏసీబీ అధికారులు ఈ సంస్థ ప్రతినిధిని క్షుణ్ణంగా ప్రశ్నించినట్టు తెలిసింది. ఫార్ములా-ఈ కారు రేసింగ్ ఒప్పందం విషయంలో అటు యూకేకు చెందిన ఎఫ్ఈఓ సంస్థతో, ఇటు హెచ్ఎండీఏతో ఎలాంటి ఒప్పందాలు కుదిరాయి? ఈ-కారు రేసింగ్ నిర్వహణ కోసం బిడ్డింగ్ ఎవరెవరి మధ్య జరిగింది? మీకు బిడ్డింగ్ ఎంతకు దక్కింది? మీరు రూ.30 కోట్లను చెల్లించటం మాట వాస్తవమేనా? అనే ప్రశ్నలను కూడా ఏసీబీ సంధించినట్టు సమాచారం. ఫార్ములా రెండో సెషన్ ప్రారంభం నాటికి మీకు లాభాలు ఏ మేరకు వస్తాయని ఆశించారు? అవి రావటం లేదని నిర్ధారణకు ఎలా వచ్చారు? ఈ విషయంలో హెచ్ఎండీఏ, ఎఫ్ఈఓతో మీ మధ్య జరిగిన చర్చలేమిటి? అనే దిశగా కూడా ఏసీబీ అధికారులు సమాచారాన్ని రాబట్టటానికి ప్రయత్నించారని తెలిసింది. అయితే, తమకు ఫార్ములా-ఈ కారు రేసింగ్‌లో లాభాలు రాకపోవటం వలనే తాము ఇందులో నుంచి వైదొలిగినట్టు ఏస్ నెక్స్ట్ జెన్ ప్రతినిధి అధికారులకు తెలిపినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ఈ కేసుకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హెచ్ఎండీఏ మాజీ కార్యదర్శి అరవింద్ కుమార్, మాజీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలతో జరిపిన విచారణ సందర్భంగా వెల్లడైన కొన్ని అంశాలను కూడా ఏస్ నెక్స్ట్ జెన్ ప్రతినిధుల ముందు ఉంచి ఏసీబీ అధికారులు ప్రశ్నించారని తెలిసింది. అవసరమైతే, మరోసారి విచారణకు పిలుస్తామని అధికారులు తెలిపినట్టు సమాచారం. ఉదయం 10:30 గంటలకు మొదలు కావాల్సిన విచారణ మధ్యాహ్నం వరకు సాగకపోవటానికి ఈ సంస్థ ప్రతినిధి విదేశాల నుంచి రావటానికి జరిగిన ఆలస్యమే కారణమని ఏసీబీ వర్గాలు తెలిపాయి. కాగా, ఏస్ నెక్స్ట్ జెన్ ప్రతినిధితో జరిపిన విచారణ అంశాలనుబట్టి మరోసారి కేటీఆర్, అరవింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలను ఏసీబీ అధికారులు ప్రశ్నించే అవకాశమున్నదని తెలిసింది.

26న నాలుగు పథకాలు ప్రారంభం

సొంతభూమి లేని ఉపాధి హామీ కూలీలకు రూ.12 వేల ఆర్థిక చేయూత

- మహిళా కూలీల ఖాతాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా జమ
- లబ్దిదారుల ఎంపికలో గ్రామసభ నిర్ణయమే ఫైనల్
- గ్రామసభలకు ఎంపీడీఓలు సన్నద్ధం కావాలి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గణతంత్ర దినోత్సవం నుంచి రాష్ట్రంలో నాలుగు ప్రభుత్వ పథకాలు అమల్లోకి రాబోతున్నాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) చెప్పారు. లబ్దిదారుల ఎంపికలో గ్రామ నిర్ణయమే ఫైనల్ అనీ, గ్రామసభలకు ఎంపీడీఓలు సన్నద్ధం కావాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లబ్దిదారుల ఎంపిక, కొత్త రేషన్ కార్డుల మంజూరి, ఇందిరమ్మ ఇండ్ల మంజూరి కూడా గ్రామ సభ వేదికల మీదే జరగాలని సూచించారు. అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు వెంటనే ప్రొసీడింగ్స్ ఇవ్వాలని ఆదేశించారు. గ్రామ సభల్లో రెచ్చగొడితే అధికారులు రెచ్చిపోవద్దని సూచించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. వ్యక్తిగత అభిమానాలతో నిమిత్తం లేకుండా...ప్రజా శ్రేయస్సు కోసం పనిచేయాలని సూచించారు. శనివారం హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లోని మిషన్‌భగీరథ కార్యాలయంలో డీఆర్డీఓలతో ఆమె సమావేశమయ్యారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు పై జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అందులో పీఆర్ఆర్డీ కార్యదర్శి లోకేశ్‌కుమార్, డైరెక్టర్ సృజన, అన్ని జిల్లాల డీఆర్డీఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. సొంత భూమిలేని ఉపాధి హామీ కూలీలకు ఏడాదికి 12 వేల ఆర్థిక చేయుత అందించబోతున్నామని మంత్రి సీతక్క ప్రకటించారు. ఇలాంటి పథకం దేశంలో ఎక్కడా లేదని చెప్పారు. కుటుంబంలో ఉండే ఉపాధి హామీ మహిళా కూలీల బ్యాంకు ఖాతాల్లో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొత్తాన్ని జమ చేస్తామని చెప్పారు. ఇలాంటి పథకం తీసుకురావడం పేద కుటుంబం నుంచి వచ్చిన తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. చిన్నపొరపాటు జరిగినా పేదలకు నష్టం జరిగే అవకాశమున్నందున అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామ సభ వేదికగానే అర్హుల గుర్తింపు, లబ్ధిదారుల ఎంపిక జరగాలన్నారు. గ్రామసభలో అధికారులు మానవీయ దృక్పథం, సామాజిక స్పృహతో వ్యవహరించాలని కోరారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై అనవసర రాజకీయాలు తగదనీ, కూలీలకు రూపాయి సహాయం చేయని బీఆర్ఎస్ పెద్దలు సైతం విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. అరెకరమున్న రైతుకన్నా భూమి లేని కూలికే అధిక లబ్ది చేకూరుతుందని కూలీలను అవమానించేలా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని విమర్శించారు. రైతులకు రైతు భరోసా, పంట బోనస్ ద్వారా కౌలు రైతులకు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా కూలీలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమల్లో తలెత్తే లోటుపాట్లను సవరిస్తామన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికీ అందజేస్తామన్నారు. ఉపాధి హామీ కూలీల ఆధార్ నెంబర్లు సరిగా నమోదు చేయలేదనీ, పొరపాట్లను సరిదిద్దాలని సూచించారు. నల్లగొండ జిల్లాలో 99 మంది పంచాయతీ కార్యదర్శులు అనుమతులు లేకుండా విధులకు నెలల తరబడి గైర్హజరయ్యారనీ, అందుకే వారి సర్వీస్ బ్రేక్ చేయాల్సి వచ్చిందని వివరించారు.

కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే హామీల అమలుపై చర్చకు రావాలి

- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే ఆ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుపై చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సవాల్ విసిరారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. షాబాద్‌లో కేటీఆర్ పాల్గొన్న రైతు దీక్ష తాము ఊహించిన దానికన్నా ఎక్కువ విజయవంతం అయిందని తెలిపారు. దొంగ దీక్షలు చేయాల్సిన అవసరం తమకు లేదనీ, ఆ అలవాటు కాంగ్రెస్ నేతలకే ఉందని ఎద్దేవా చేశారు. రైతులకు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వ మెడలు వంచేందుకు దీక్ష చేశామన్నారు. ప్రజా సమస్యలపై ముందుండి పోరాడుతున్నందుకే కేటీఆర్‌పై తప్పుడు కేసు పెట్టారని చెప్పారు.

చిరుద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలి : మాజీ మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో చిరుద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నెలలు గడుస్తున్నా వేతనాలు చెల్లించక పోవడం పట్ల ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీలు అమలు చేశామని ఢిల్లీకి వెళ్లి అబద్ధాలు ప్రచారం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి పాలనలో వేతనాలు అందక ఉద్యోగులు రోడ్డెక్కుతున్న దుస్థితి తెలంగాణలో ఉందని తెలిపారు. నాలుగు నెలలుగా పంచాయతీ కార్మికులు, మూడు నెలలుగా ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగులు, నెల గడిచినా మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు వేతనాలు అందక వెతలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్, ఏపీఓలు తదితర వేల మంది చిరు ఉద్యోగులు జీతాలు ఇవ్వాలని ప్రభుత్వానికి దరఖాస్తులు పెట్టుకున్న దయనీయ పరిస్థితి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.


దాదాపు అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని పేర్కొన్నారు. నెలలు గడిచినా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారమై, అప్పుల పాలవుతున్నారు. కండ్లు కాయలు కాసేలా జీతాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కుర్చీ కాపాడుకోవడం కోసం ఢిల్లీకి చక్కర్లు కొట్టడం, విదేశాలకు వెళ్లి వేల కోట్ల రూపాయల పెట్టుబడులు తెస్తున్నామనే డబ్బా ప్రచారం చేసుకోవడం మానేసి పాలనపై దృష్టి సారించాలని సూచించారు.

సంఘ విద్రోహ చర్యలు మానండి : ఎస్పీ

- 22 మంది మావోయిస్టు, ఆర్పీసీ సభ్యుల లొంగుబాటు

నవతెలంగాణ-చర్ల

మావోయిస్టు పార్టీ చేస్తున్న దుశ్చర్యలను ఖండించండి, సంఘ విద్రోహ చర్యలకు దూరంగా ఉండండని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ అన్నారు. శనివారం చర్ల సీఐ ఏ.రాజువర్మ అధ్యక్షతన ఇప్పటివరకు లొంగిపోయిన మాజీ మావోయిస్టు సభ్యులు, వారి కుటుంబాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా



వివిధ కేడర్లలో విధులు నిర్వహిస్తున్న ఎర్రపల్లి ఏరియా కమిటీకి చెందిన 22 మంది మావోయిస్టులు ఎస్పీ ఎదుట లొంగిపోయారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. నిరుపేదలైన ఆదివాసీలను మభ్యపెడుతూ కాలం గడుపుతున్న మావోయిస్టుల మాటలు నమ్మకండి, తమ కుటుంబాలతో ఆనందంగా జీవనం గడపండి అని సూచించారు.



రైతు భరోసాపై మాట్లాడే వారికి ప్రజా భరోసా లేదు

- రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి
- రాహుల్‌పై ఆరోపణలకు ఖండన

నవతెలంగాణ-ఖమ్మం

కాంగ్రెస్ ప్రభుత్వం ఈనెల 26 నుంచి అమలు చేయబోతున్న నాలుగు పథకాలలో ఒకటైన రైతు భరోసాపై విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నేతలకు రాష్ట్ర ప్రజల నుంచి భరోసా లేదని రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి అన్నారు.కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. మోడీ సర్కారు వన్ నేషన్, వన్ ఎలక్షన్ అమలు వైఫల్యం చెందిందన్నారు. ఇందుకు వెస్ట్ బెంగాల్ ఎన్నికలు నిదర్శనమని తెలిపారు. ఒక్క రాష్ట్రంలోనే సజావుగా ఎలక్షన్ ప్రక్రియ నిర్వహించలేనివారు, దేశ వ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. తమ అధినేత, ఎంపీ రాహుల్ గాంధీపై ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. దేశ ప్రధాని మన్మోహన్‌సింగ్ తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలు దేశానికి ఆదర్శం అని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రగతి కోసం అహర్నిశలూ శ్రమిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని పార్లమెంట్‌లో తాము ప్రమాణం చేస్తే.. బీజేపీ వాళ్లు మాత్రం రాజ్యాంగంపై కాకుండా మతంపై ప్రమాణం చేస్తున్నారని ఆరోపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విమానాశ్రయం ఏర్పడితే రైతాంగానికి మంచి జరగనుందన్నారు. నాన్ ఫెస్టిసైడ్, ఆర్గానిక్ ఫామ్ పంటలను పండించడం వల్ల కార్గో సర్వీస్ ద్వారా ఉత్పత్తులను ఎగుమతి చేసుకోవచ్చని సూచించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించి మహన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర మేయర్ నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, టీపీసీసీ స్పోక్స్ పర్సన్ కొరిపల్లి వెంకటరత్నం, మానుకొండ రాధ కిషోర్, ముస్తఫా ఉన్నారు.

సినీ అవకాశాల పేరుతో మహిళపై లైంగికదాడి

- హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఘటన

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

సినిమా అవకాశాలు ఇప్పిస్తానని నమ్మించి మహిళా జూనియర్ ఆర్టిస్ట్‌పై ఓ వ్యక్తి లైంగికదాడికి ఒడిగట్టాడు. ఈ దారుణ ఘటన హైదరాబాద్ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీకి చెందిన బాధిత మహిళ మూడు సంవత్సరాల కిందట భర్తను వదిలి హైదరాబాద్ వచ్చింది. మణికొండలో బంధువుల వద్ద ఉంటూ హౌస్ కీపింగ్ పనులు చేస్తూ జీవిస్తోంది. సినిమాలో అవకాశాలకు ప్రయత్నించాలనే ఉద్దేశంతో ఆమె బంధువుల ఇంటి నుంచి కూడా బయటకు వచ్చి కొన్ని నెలల నుంచి అమీర్‌పేటలోని లేడీస్ హాస్టల్‌లో ఉంటోంది. ఈ క్రమంలో కొంతమంది పరిచయస్తుల ద్వారా ఒక సినిమాలో చిన్న క్యారెక్టర్ చేసింది. అసిస్టెంట్ డైరెక్టర్ అని చెప్పుకునే రాజు ఆమెను పరిచయం చేసుకున్నాడు. అనంతరం కృష్ణానగర్‌లోని హెవెన్ లాడ్జిలో రూమ్ తీసుకుని ఆడిషన్స్ పేరుతో ఆమెను రప్పించి ఫొటో షూట్ చేశాడు. మరుసటి రోజు (17వ తేదీ శుక్రవారం) కూడా ఆమెను లాడ్జికి పిలిచి లైంగికదాడి చేశాడు. దాంతో మహిళ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమెను పోలీసులు వైద్య పరీక్షలకు పంపించి, నిందితుడిపై బి.ఎన్.ఎస్ 64, 79, 115, 351(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. త్వరలో నిందితుడిని అరెస్టు చేస్తామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మావోయిస్టు సీనియర్ నేత దామోదర్ మృతి

- తలపై రూ.50 లక్షల రివార్డు
- 12 మంది కాదు 18 మంది మృతి
- మావోయిస్టుల లేఖ విడుదల



(ఫైల్)

నవతెలంగాణ-చర్ల

దండకారణ్యంలో సమాంతర ప్రభుత్వాన్ని నడపడంలో తనదైన ముద్ర వేసుకున్న మావోయిస్టు నేత.. ములుగు జిల్లా కాల్వపల్లి గ్రామానికి దామోదర్ అలియాస్ బడే చొక్కారావు(50) బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందినట్టు సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి గంగ శనివారం లేఖ ద్వారా తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో మొత్తం 12 మంది కాదు.. 18 మంది కామ్రేడ్లు అమరులయ్యారని, అందులో సెంట్రల్ కమిటీ సభ్యులు, మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దామోదర్ ఉన్నారని పేర్కొన్నారు. ఆయన తలపై రూ.50 లక్షల రివార్డు ఉందని తెలిపారు. ఆయనతోపాటు హుంగి (పీపీసీఎం), దేవా (పీపీసీఎం), జోగా (పీపీసీఎం), నరసింహారావు (పీపీసీఎం) మృతిచెందినట్టు పేర్కొన్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో 18 మంది వీర సహచరులను పార్టీ కోల్పోయిందని, వారు చివరి వారికి పోరాడి తుది శ్వాస విడిచారని ముఖ్యంగా కామ్రేడ్ బడే చొక్కారావు ధైర్య సాహసాలను ప్రదర్శించి పోరాడుతూ అమరుడయ్యాడన్నారు. అతని మరణం పార్టీకి కోలుకోలేని నష్టాన్ని కలిగించిందని పేర్కొన్నారు. అయితే, ఆయన విప్లవాత్మక వారసత్వం వేలాది మంది కొత్త సహచరులకు స్ఫూర్తినిస్తుందన్నారు. సుమారు 5000 మందికి పైగా పోలీసులు అడవిలో బీభత్సం సృష్టించడంతోపాటు ట్రాక్టర్లకు, బండ్లకు నిప్పంటించి భయానక వాతావరణం కల్పించారని పేర్కొన్నారు. కాగా, మాస్టర్ మైండ్, హిడ్మా తమ్ముడు దేవా కూడా ఈ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్టు తెలిసింది.

ప్రజల్లో గౌరవం పెంచుకోండి

- పోలీసు అధికారులకు డీజీపీ పిలుపు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి- హైదరాబాద్

ప్రజల్లో గౌరవం పెరిగేలా విధి నిర్వహణ సాగించాలని పోలీస్ అధికారులకు రాష్ట్ర డీజీపీ పిలుపు నిచ్చారు. శనివారం హైదరాబద్‌లోని డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా 41 మంది పోలీస్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జితెందర్ మాట్లాడుతూ పోలీసులు ఎన్ని విజయాలు సాధించినప్పటికీ ప్రజల్లో వారి పట్ల గౌరవ భావాన్ని పెంచుకోకపోతే శూన్యమేనని అన్నారు. శాంతి భద్రతలను కాపాడటంమేకాక నేరాలను అదుపు చేస్తూ మంచి ఫలితాలను రాష్ట్ర పోలీసులు సాధిస్తున్నారని ప్రశంసించారు. పోలీసులనగానే గౌరవ భావం పెరిగేలా వారి వ్యక్తిత్వం ఉండాలనీ, ఆరోపణలకు తావిచ్చేలా ప్రవర్తన ఉండకూడదని డీజీపీ అభిప్రాయపడ్డారు. సమాజంలో మహిళలు, పిల్లల భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలనీ, సివిల్ తగాదాల్లో జోక్యం చేసుకోరాదని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ విధంగా రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువయ్యేలా గ్రూపుల వారీగా అధికారులకు శిక్షణ ఇస్తున్నట్టు డీజీపీ చెప్పారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అన్నారు. పోలీస్ శాఖకు చెడ్డపేరు తెచ్చేలా ఎవ్వరూ ప్రవర్తించినా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాంతి భద్రతల అదనపు డీజీ మహేశ్‌భగవత్, ఏఐజీ రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతుల ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులే కారణం

నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్

ఆర్థిక ఇబ్బందులతో వృద్ధ దంపతులు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడు గ్రామంలో శనివారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పంతంగి కృష్ణ(60), సీత(58) దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. వారికి పెండ్లిలు చేశారు. పంతంగి కృష్ణ గతంలో లారీ కొనుగోలు చేసి నడిపాడు. దాని వల్ల అప్పులయ్యాయి.

బిజినెస్

టెల్కోలకు బంఫర్ లబ్ధి..!

- రూ.1 లక్ష కోట్ల ఏజీఆర్ బకాయిల మాఫీ
- యోచనలో కేంద్రం
- వీఐ, భారతీ ఎయిర్‌టెల్‌లకు మద్దతు



న్యూఢిల్లీ : ప్రయివేటు టెలికం కంపెనీలకు భారీ లబ్ధి చేకూర్చడానికి మోడీ సర్కార్ కసరత్తు చేస్తోందని సమాచారం. టెల్కోలను ఆదుకునే పేరుతో స్థూల సర్దుబాటు ఆదాయం (ఏజీఆర్) బకాయిలను మాఫీ చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోందని లీకులు వస్తున్నాయి. దీంతో టెలికాం కంపెనీలకు దాదాపు రూ.1 లక్ష కోట్ల మేర లబ్ధి చేకూరనుందని సమాచారం. గతంలో దక్కించుకున్న స్పెక్ట్రమ్‌కు గానూ బ్యాంక్ గ్యారెంటీలు సమర్పించాలన్న నిబంధనను ఇప్పటికే కేంద్రం తొలగించింది. మరోమారు టెల్కోలకు భారీ ఆర్థిక మద్దతును ఇవ్వనుందని.. ఇందుకోసం త్వరలోనే కీలక నిర్ణయం తీసుకోనుందని రిపోర్టులు వస్తున్నాయి. ఈ నిర్ణయంతో ముఖ్యంగా వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్ వంటి సంస్థలకు మేలు చేకూరనుందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. టెలికం కంపెనీల డిపాజిట్లపై వడ్డీ, ఆస్తుల విక్రయాలు, డివిడెండ్‌లు సహా అన్ని రకాల ఆదాయాలపై పన్నులు చెల్లించాల్సి ఉండగా.. పలు కారణాలు, భారాల పేరుతో టెల్కోలు ఇందులో కొన్ని బకాయిలను చెల్లించలేదు. ఆ విధంగా కేంద్రానికి రూ.1.47 లక్షల కోట్ల మేర చెల్లించాల్సి ఉంది.

ఏజీఆర్ బకాయిలకు సంబంధించిన చర్చలు ఏండ్ల తరబడి కొనసాగుతున్నాయి. గతేడాది మార్చి నాటికి వొడాఫోన్ ఐడియా బకాయిలు రూ.80వేల కోట్లకు చేరగా.. ఎయిర్‌టెల్ బకాయిలు రూ.42వేల కోట్లుగా ఉన్నాయని అంచనా. ఇందులో దాదాపు 75 శాతం మేర వడ్డీ ఉండగా మిగిలినది జరిమానాలు ఉన్నాయి. ఈ బకాయిలపై ఇప్పటికే టెలికాం కంపెనీల ప్రతినిధులతో టెలికాం విభాగం పలుమార్లు సమావేశమైంది. ఆర్థికంగా తాము ఒత్తిడిని ఎదుర్కొంటున్నామని ఆ కంపెనీలు ప్రభుత్వానికి తెలిపాయి. ఈనేపథ్యంలోనే వడ్డీపై 50శాతంతో పాటు పెనాల్టీలు, పెనాల్టీలపై విధించిన వడ్డీని 100 శాతం మేర మాఫీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని సమాచారం. అదే జరిగితే విఐకి రూ.52 వేల కోట్లు, ఎయిర్‌టెల్‌కు రూ.38వేల కోట్లు, టాటా టెలీ సర్వీసెస్‌కు రూ.14వేల కోట్ల మేర బకాయిలు రద్దు కానున్నాయి.

సోలార్ కార్ వచ్చేసింది..!

- వేవ్ మొబిలిటీ ఆవిష్కరణ



న్యూఢిల్లీ : విద్యుత్ వాహనాల తయారీ సంస్థ వేవ్ మొబిలిటీ కొత్తగా సోలార్‌తో నడిచే ఎలక్ట్రిక్ వాహనం ఈవీఏను ఆవిష్కరించింది. శనివారం దీన్ని ఆటోమొబైల్ ఎక్స్‌పోలో విడుదల చేసింది. మూడు వేరియంట్లలో లభ్యం కానున్న దీని ధరల శ్రేణిని రూ.3.25 లక్షల నుంచి రూ.6 లక్షలుగా ఉండొచ్చని అంచనా. 2026లో దీని ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు ఆ కంపెనీ వెల్లడించింది. వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో ఎంపిక చేసిన నగరాల్లో తొలుత వినియోగదారులకు అందుబాటులోకి తేనున్నామని వేవ్ మొబిలిటీ సీఈఓ విలాస్ దేశ్‌పాండే తెలిపారు. సగటున ప్రతి రోజూ 35 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చన్నారు. విద్యుత్ చార్జింగ్‌తో కూడా 250 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందన్నారు.

బీఎండబ్ల్యూ కొత్త ఎస్1000 ఆర్‌ఆర్ బైక్ ఆవిష్కరణ

- ధర రూ.21.10 లక్షలు



న్యూఢిల్లీ : బీఎండబ్ల్యూ మోటోరాడ్ కొత్తగా మరో లగ్జరీ బైక్ ఎస్1000 ఆర్‌ఆర్‌ను విడుదల చేసింది. దీని ప్రారంభ ధరను రూ.21.10 లక్షలుగా నిర్ణయించింది. ఈ బైకు కోసం బుకింగ్స్‌ను తెరిచినట్లు ఆ కంపెనీ తెలిపింది. ఏప్రిల్ 2025 నుంచి డెలివరీలను ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. 999 సీసీ ఇన్‌లైన్ ఫోర్ సిలిండర్ ఇంజిన్, 210 హెచ్‌పీ పవర్ కలిగి ఉంది. 3.3 సెకండ్లలోనే 0-100 కిలోమీటర్ల వేగాన్ని పుంజుకోగలదని.. గంటకు 300 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదని ఆ కంపెనీ తెలిపింది.

కండ్లు చెదిరే మినీ కూపర్ విడుదల



న్యూఢిల్లీ : బ్రిటిష్‌కు చెందిన ప్రముఖ వాహన తయారీ సంస్థ మినీ తన మినీ కూపర్ ఎస్ జేసీడబ్ల్యూ ప్యాక్‌ను విడుదల చేసింది. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఈ లగ్జరీ కారు ధరను రూ.55.90 లక్షలుగా నిర్ణయించినట్లు మినీ ఇండియా వెల్లడించింది. ఈ కారు బుకింగ్స్‌కు తెరిచామని.. ఏప్రిల్ నుంచి డెలివరీలను ప్రారంభించనున్నట్లు తెలిపింది. 2.0 లీటర్ పెట్రోల్ ఇంజిన్ కలిగిన ఈ కారు గంటకు గరిష్టంగా 242 కిలోమీటర్లు ప్రయాణించగలదు.

ఐసీఐసీఐ లంబార్డ్ లాభాల్లో 68 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ఐసీఐసీఐ లంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 68 శాతం వృద్ధితో రూ.724.38 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.431.46 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.5,883 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. గడిచిన క్యూ3లో 17 శాతం పెరిగి రూ.5,883 కోట్లకు చేరింది.

సామ్‌సంగ్ హెల్త్ యాప్‌లో హెల్త్ రికార్డ్ ఫీచర్

గూర్‌గావ్ : తమ వినియోగదారుల ఆరోగ్యాన్ని మరింత సమగ్రంగా నిర్వహించడంలో సహాయపడటానికి సామ్‌సంగ్ హెల్త్ యాప్‌లో హెల్త్ రికార్డ్స్ ఫీచర్‌ను జోడించినట్లు సామ్‌సంగ్ ఇండియా ప్రకటించింది. వినియోగదారులు వారి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌ను నేరుగా ఈ యాప్ ద్వారా సష్టించి యాక్సెస్ చేయడానికి వీలు కల్పిస్తుందని పేర్కొంది. ఇది వ్యక్తులు తమ వ్యక్తిగత ఆరోగ్య రికార్డులను నిర్వహించే విధానాన్ని మారుస్తుందని నోయిడాలోని సామ్‌సంగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ క్యుంగ్యున్ రూ పేర్కొన్నారు. ఈ ఫీచర్ హెల్త్ పురోగతిని ట్రాక్ చేయడానికి దోహదం చేయనుందని పేర్కొంది.

అందరి కండ్లూ గాజాపైనే!

- తొలి దశలో 33మంది బందీలు, 737మంది ఖైదీలు విడుదల

8.30 గంటలకు ఆగనున్న బాంబుల హోరు



జెరూసలేం, గాజా : కాల్పుల విరమణ ఒప్పందం ఈ వారాంతం నుంచి అమల్లోకి వస్తుందా రాదా అనే విషయమై రోజుల తరబడి నెలకొన్న అనిశ్చితికి తెరదించుతూ ఆదివారం ఉదయం 8.30గంటల నుంచి గాజాలో కాల్పుల విరమణ అమలవుతుందని ఖతర్ విదేశాంగ శాఖ ప్రతినిధి శనివారం ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఉభయ పక్షాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రాతిపదికన గాజాలో ఆదివారం ఉదయం 8.30గంటలకు కాల్పుల విరమణ అమల్లోకి వస్తుంది. అత్యంత అప్రమత్తంగా వుంటూ, ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటూ అధికార వర్గాల నుండి వచ్చే సూచనలు, ఆదేశాల కోసం వేచి వుండాలని ఖతర్ ప్రతినిధి మజీద్ అల్ అన్సారి ట్వీట్ చేశారు. ప్రస్తుతం అందరి కండ్లూ గాజాపైనే వున్నాయి. ఈ తుది గంటల్లో ఇజ్రాయిల్ మిలటరీ ఏం చేయబోతోందో అనే విషయమై అందరూ ఆతృతగా ఎదురుచూస్తున్నారు. శనివారం తెల్లవారు జామున ఇజ్రాయిల్ ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని ధ్రువీకరించింది. ఆరు గంటలకు పైగా సమావేశమై పూర్తిస్థాయి క్యాబినెట్ ఒప్పందానికి ఆమోద ముద్ర వేసినట్టు ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. వచ్చే ఆరు వారాల్లో గాజాలో బందీలుగా వున్న 33మంది బందీలు విడుదలవుతారని భావిస్తున్నారు. అందుకు ప్రతిగా ఇజ్రాయిల్ జైళ్ళలోని వందలాదిమంది పాలస్తీనియన్లను విడుదల చేయనున్నారు. రెండో దశలో మిగిలినవారిని విడుదల చేయాల్సి వుంటుంది. దీనిపై ఇంకా చర్చలు జరగాల్సి వుంది. శాశ్వత కాల్పుల విరమణ అమలు కాకపోతే మిగిలిన బందీలను విడుదల చేసేది లేదని హమాస్ తేల్చి చెప్పింది. ఇజ్రాయిల్ బలగాలు గాజా నుంచి పూర్తి స్థాయిలో వైదొలగాలని కూడా స్పష్టం చేసింది. మొదటి దశ ఒప్పందంలో భాగంగా 737మంది ఖైదీలు విడుదలవుతారని ఇజ్రాయిల్ న్యాయశాఖ వెల్లడించింది.

ఒప్పందాన్ని కుదుర్చుకున్న పాలస్తీనియన్లకు హిజ్బుల్లా నేత నయీమ్ ఖాసిమ్ అభినందనలు తెలిపారు. 2024 మేలో ఏదైతే ప్రతిపాదించబడిందో అదే ఒప్పందం మార్పు లేకుండా ఇప్పుడు కుదిరిందని, దీన్నిబట్టి ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా తీవ్ర ప్రతిఘటన ప్రదర్శించినట్లు రుజువైందని వ్యాఖ్యానించారు. ఈ దాడుల తర్వాత గాజాలో పూర్తి స్థాయిలో బాధ్యతలు చేపట్టడానికి పాలస్తీనా అథారిటీ సన్నాహాలు పూర్తి చేసిందని పాలస్తీనా అధ్యక్షుడు మహ్మద్ అబ్బాస్ తెలిపారు. నిర్వాసితులైన పాలస్తీనియన్లు గాజాకు తిరిగి రావడానికి సమాయత్తమవుతున్నారు.

46,788 మంది బలి, తాజా దాడుల్లో ఐదుగురి మృతి

460రోజుల పాటు ఇజ్రాయిల్ సైనిక బలగాలు అమెరికా, పశ్చిమ దేశాల మద్దతుతో జరిపిన దారుణ మారణహోమంలో 46,788మంది పాలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోయారు. 1,10,453మందిని గాయపరిచిన తర్వాత ఎట్టకేలకు ఈ ఒప్పందానికి ఆమోద ముద్ర లభించింది. గాజావ్యాప్తంగా ఇజ్రాయిల్ దాడులు కొనసాగుతునే వున్నాయి. శనివారం తెల్లవారు జామున జరిగిన దాడిలో ఐదుగురు మరణించారని వైద్య బృందాలు తెలిపాయి. శుక్రవారం పొద్దుపోయిన తర్వాత జరిగిన డ్రోన్ దాడిలో మరో ముగ్గురు చనిపోయారు.

ట్రంప్ పాలన పట్ల ఈయూలో భయాందోళనలు !


పలు దేశాల్లో మిశ్రమ ప్రతిస్పందనలు



బ్రస్సెల్స్ : అమెరికాలో ట్రంప్ అధికారం చేపట్టడం పట్ల యురోపియన్ యూనియన్ సభ్య దేశాల్లో పలువురిలో నిరాశవాదం నెలకొనగా ప్రపంచవ్యాప్తంగా మిగిలిన దేశాల్లో పలుచోట్ల మిశ్రమ ప్రతిస్పందనలు వెలువడుతున్నాయని ఇటీవల నిర్వహించిన ఒక సర్వేలో వెల్లడైంది. ట్రంప్ వచ్చిన తర్వాత కేవలం అమెరికాకే మంచి జరగడం కాకుండా ఉక్రెయిన్‌లో, మధ్య ప్రాచ్యంలో శాంతి నెలకొనడానికి, అమెరికా-చైనా సంబంధాల్లో ఉద్రిక్తతలు తగ్గించడానికి కూడా దోహదపడుతుందని మరికొందరు భావిస్తున్నారు. తన స్వప్రయోజనాలు నెరవేర్చుకునే దిశగా 'అమెరికా ఫస్ట్' అన్న ట్రంప్ నినాదం యూరప్‌ను తీవ్రంగా భయపెడుతోంది. ఈయూవ్యాప్తంగా 22శాతం మంది అమెరికాను మిత్రపక్షంగా భావిస్తుండగా, 51శాతం మంది అవసరమైన భాగస్వామిగా పేర్కొంటున్నాయి. 9శాతం మంది ప్రత్యర్థిగా పేర్కొంటుండగా 3శాతం మంది ప్రతికూల శక్తిగా భావిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 24 దేశాల్లో 28,549మందిపై విదేశీ సంబంధాలపై యురోపియన్ కౌన్సిల్ (ఈసీఎఫ్‌ఆర్), ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలు సంయుక్తంగా సర్వే చేశాయి. ట్రంప్ రెండోసారి పదవీకాలం పట్ల భారత్ చాలా ఆశాభావంతో వుంది. 82 నుంచి 85శాతం మంది అమెరికన్లకు ట్రంప్ మంచి చేస్తారని ఆశిస్తున్నారు. అలాగే భారత్‌తో పాటూ ప్రపంచానికి కూడా మంచి జరుగుతుందని భావిస్తున్నారు. చైనాలో 46శాతం మంది చైనా పట్ల మంచిగానే వ్యవహరిస్తారని ఆశిస్తున్నారు. మొత్తంగా ప్రపంచ దేశాలకు మంచి జరుగుతుందని 52శాతం భావిస్తున్నారు. ఇక అమెరికా మిత్రపక్షాలైన బ్రిటన్, కొరియా రిపబ్లిక్, ఇయు సభ్య దేశాల్లోని ప్రజలైతే ట్రంప్ పాలన పట్ల చాలా సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. యురోపియన్ మిత్రపక్షాలే ఎక్కువ నిరాశావాదాన్ని ప్రకటించాయి. రాబోయే ట్రంప్ ప్రభుత్వం వల్ల అమెరికన్లకు ఎదురు దెబ్బ తగులుతుందని, అలాగే అంతర్జాతీయ ఘర్షణల పరిష్కారానికి కూడా విఘాతం కలుగుతుందని మెజారిటీ ప్రజలు భావిస్తున్నారు. ఇక రిపబ్లిక్ ఆఫ్ కొరియాలో అయితే ట్రంప్ పట్ల ఈయూ కన్నా అధ్వాన్నంగా ప్రజాభిప్రాయం నెలకొంది. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా ఒక మోస్తరు దేశాలన్నీ ప్రపంచ పోలీస్‌మేన్‌గా ఇక అమెరికాను కొనసాగించేది లేదని భావిస్తున్నాయి. కాగా ఈయూలోనే మరో భాగం ట్రంప్‌ను స్వాగతిస్తోంది. ప్రధానంగా ఇటలీ ప్రధాని మెలోనికి ట్రంప్‌తో సన్నిహిత సంబంధాలున్నాయి.

మాటలు కాదు, చేతలు కావాలి !

- నితిన్ గడ్కరీ వ్యాఖ్యలపై ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ప్రకటన



న్యూఢిల్లీ : కాంట్రాక్టర్లు రహదారులను లోపభూయిష్టంగా నిర్మిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారని అయినా వారిపై ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చేసిన ప్రకటనను అఖిల భారత రోడ్డు రవాణా కార్మికుల సమాఖ్య (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య స్వాగతించారు. గత పదేళ్ళుగా ఆయనే సంబంధిత శాఖ మంత్రిగా కొనసాగుతున్నందున ముందుగా ఆయన అందుకు నైతిక బాధ్యత వహించి, పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలోని సీఐఐ నిర్వహించిన రహదారుల భద్రతా కార్యక్రమాన్ని ఈనెల 16న మంత్రి ప్రారంభిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. లోపభూయిష్టంగా రహదారులు నిర్మించడాన్ని నాన్ బెయిలబుల్‌గా చేయాలని, సదరు కాంట్రాక్టర్లను, ఇంజనీర్లను జైలుకు పంపాలని ఆయన వ్యాఖ్యానించినట్లు మీడియాలో వార్తలు వెలువడ్డాయి. ఒకే శాఖను గత పదేళ్ళుగా నిర్వహిస్తున్న మంత్రి కనీసం ఇప్పటికైనా ఈ వాస్తవాన్ని గ్రహించినందుకు ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ కృతజ్ఞతలు చెబుతోందని లక్ష్మయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తప్పు చేసిన కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తే అడ్డుకునేవారు ఎవరూ వుండరని అన్నారు. పైగా ప్రభుత్వాన్ని అభినందిస్తారని చెప్పారు. ఇన్నాళ్లు ఈ దిశగా ఎందుకు చర్యలు చేపట్టలేదని ఆయన ప్రశ్నించారు. తానన్న వ్యాఖ్యల పట్ల మంత్రి సీరియస్‌గా వ్యవహరిస్తే, వెంటనే నిష్పక్షపాతంగా, స్వేచ్ఛా, సక్రమ విచారణకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. జాతీయ రహదారుల నిర్మాణంలో అవకతవకలకు పాల్పడి ప్రమాదాలకు, ప్రాణాలు కోల్పోవడానికి కారణమైన వారికి కఠినంగా శిక్షలు విధించాలన్నారు. మెజారిటీ రోడ్డు ప్రమాదాలు జాతీయ రహదారులపైనే జరుగుతున్నాయని ఇటీవల ఎంఒఆర్‌టీహెచ్ విడుదల చేసిన డేటా వెల్లడించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తమది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని మోడీ సర్కార్ రుజువు చేయాలని లక్ష్మయ్య పేర్కొన్నారు.

ఎన్‌ఎల్‌సీఐఎల్ సీఎమ్‌డీకి ఐపీఎమ్ఏ సర్టిఫికెట్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నైవేలీ లిగ్నేట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌ఎల్‌సీఐఎల్) సీఎమ్‌డీ మోటుపల్లి ప్రసన్న కుమార్‌కు ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ఐపీఎమ్ఏ) గౌరవ పురస్కారం లభించింది. ఉత్తమ నిర్వహణ విభాగంలో ఆయనకు ప్రాజెక్ట్ డైరెక్టర్ లెవల్-ఏ సర్టిఫికెట్ దక్కింది. వివిధ క్లిష్టమైన ప్రాజెక్టులను వ్యూహాత్మకంగా అమల్లోకి తేవడంలో ఆదర్శవంతమైన నాయకత్వ నైపుణ్యాలకు గుర్తుగా ఈ పురస్కారాన్ని అందచేసినట్టు ఐపీఎమ్ఏ రీజినల్ డైరెక్టర్ టీ శ్రీనివాసన్ తెలిపారు. ఎన్‌ఎల్‌సీఐఎల్‌లోని యెగ్నేశ్వరన్ ఆడిటోరియం లెర్నింగ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఐపీఎమ్ఏ ఇండియా అధ్యక్షులు, బ్రహ్మాస్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులు, పద్మభూషణ్ డాక్టర్ శివథాను పిళ్లై ఈ సర్టిఫికెట్‌ను మోటుపల్లి ప్రసన్నకుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎల్‌సిఐఎల్ ఫంక్షనల్ డైరెక్టర్లు సమీర్ స్వరూప్, ఎమ్ వెంకటాచలం, ఎన్‌ఎల్‌సిఐఎల్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ తిరు అప్పకన్ను గోవిందరాజన్ తదితరులు పాల్గొన్నారు. దీనిపై ప్రసన్నకుమార్ స్పందిస్తూ ఈ సర్టిఫికెట్‌ను తన సహచర ఉద్యోగులకు అంకితం ఇస్తున్నట్టు ప్రకటించారు. వారి సహకారంతోనే తాను విజయాలు సాధించగలిగానని చెప్పారు.



ఐదేండ్ల లోక్‌పాల్

దర్యాప్తునకు ఆదేశించినది 24 కేసులలోనే!

- ప్రాసిక్యూషన్ అనుమతి మంజూరు ఆరు కేసుల్లో మాత్రమే
- సరైన ఫార్మాట్‌లో లేవని పెద్ద సంఖ్యలో దరఖాస్తుల తిరస్కరణ



న్యూఢిల్లీ : దేశంలో అవినీతి రూపుమాపటం కోసం ఏర్పడిన మొట్టమొదటి అవినీతి నిరోధక సంస్థ లోక్‌పాల్. ఐదేండ్ల క్రితం ఇది తన కార్యకలపాలను ప్రారంభించింది. ఈ ఐదేండ్లలో ఇది 24 కేసులలోనే దర్యాప్తునకు ఆదేశించింది. ఆరు కేసులలో ప్రాసిక్యూషన్ అనుమతిని మంజూరు చేసింది. లోక్‌పాల్ గత ఐదేండ్లకు సంబంధించిన సమాచారాం ఈ విషయాన్ని వెల్లడిస్తున్నది. దీంతో లోక్‌పాల్ పనితీరుపై సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ప్రధానిపై మూడు ఫిర్యాదులు

గతేడాది అక్టోబర్, డిసెంబర్ నెలల్లో ప్రధాని మోడీకి వ్యతిరేకంగా మూడు ఫిర్యాదులు లోక్‌పాల్‌కు అందాయి. ఇక సరైన ఫార్మాట్‌లో లేని కారణంగా లోక్‌పాల్ పెద్ద సంఖ్యలో ఫిర్యాదులను తిరస్కరించింది. లోపాలు లేకుండా గత ఐదేండ్లలో 2320 ఫిర్యాదులు అందాయి. గతేడాది ఏప్రిల్ 1 నుంచి డిసెంబర్ వరకు అందినవే 226.

ఇతర పాలకులు, అధికారులపై ఇలా..

ఇక మొత్తం ఫిర్యాదులలో ప్రధాని, పార్లమెంటు సభ్యుడు, కేంద్ర మంత్రులపై మూడు శాతం, కేంద్ర ప్రభుత్వ గ్రూప్ ఏ,బీ, సీ, డీ అధికారులపై 21 శాతం ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థల చైర్‌పర్సన్ లేదా సభ్యులపై 35 శాతం, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సహా 'ఇతరలు'పై 41 శాతం కంప్లైంట్‌లు అందాయి. లోక్‌పాల్ మరియు లోకాయుక్తల చట్టం, 2013లోని సెక్షన్ 53 ప్రకారం.. ఆరోపిత నేరం జరిగిన తేదీ నుంచి ఏడు సంవత్సరాల వ్యవధిలోపు ఫిర్యాదు దాఖలు చేస్తేనే దానిని స్వీకరించొచ్చు.

లోక్‌పాల్ చట్టం, 2013లో ఆమోదం పొందింది. అయితే, దేశంలో మొదటి లోక్‌పాల్ జస్టిస్ పినాకి చంద్ర ఘోశ్.. మార్చి 19, 2019న మరో ఎనిమిది మంది సభ్యులతో పాటు నియమితులయ్యారు. జస్టిస్ పినాకి ఘోశ్.. 70 ఏండ్లు వయసు నిండిన తర్వాత మే, 2022లో పదవీ విరమణ చేసిన విషయం విదితమే. జస్టిస్(రిటైర్డ్) ఎ.ఎం.ఖాన్విల్కర్ మార్చి, 2024లో రెండో లోక్‌పాల్‌గా నియమితులయ్యారు.

పోస్టుల భర్తీకి కేంద్రానికి ప్రతిపాదనలు.. నిర్ణయం కోసం వేచి చూస్తున్న లోక్‌పాల్

సంస్థ సామర్థ్యాన్ని మెరుగుపర్చటానికి తాత్కాలిక ఉద్యోగుల స్థానంలో శాశ్వత సిబ్బందిని నియమించటం ద్వారా సిబ్బందిని పునర్నిర్మించాలని ఉన్నతాధికారులు చూస్తున్నారని ఒక అధికారి చెప్పారు. డైరెక్టర్ ఆఫ్ ఎంక్వైరీ అండ్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పోస్టులను భర్తీ చేయటానికి కేంద్రానికి అనే సందర్భాలలో ప్రతిపాదనలు అందాయి. అయితే, దీనిపై నిర్ణయం కోసం లోక్‌పాల్ వేచి చూస్తున్నది. ఈలోగా ప్రాథమిక విచారణలు, దర్యాప్తులను సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కి అప్పగించినట్టు సదరు అధికారి వివరించారు.

ఫైనల్లో భారత్

ఖోఖో ప్రపంచకప్ 2025



న్యూఢిల్లీ : తొలి ఖోఖో ప్రపంచకప్‌లో భారత మహిళల జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాపై టీమ్ ఇండియా అమ్మాయిలు ఏకపక్ష విజయం నమోదు చేశారు. నిర్మల, వైష్ణవి అద్భుతంగా రాణించటంతో 66-16తో భారత్‌పై అలవోక విజయం సాధించింది. నాలుగు క్వార్టర్ల ఆటలో ఆధిపత్యం చెలాయించిన భారత్.. నేడు ఫైనల్లో నేపాల్‌తో తలపడనుంది. మరో సెమీఫైనల్లో 89-18తో ఉగాండాపై నేపాల్ ఘన విజయం నమోదు చేసింది. నేపాల్, భారత్ మ్యాచ్‌తో మొదలైన ఖోఖో ప్రపంచకప్.. ఆ రెండు జట్ల టైటిల్ పోరుతో ముగియనుంది.

చాంపియన్ కర్నాటక

ఫైనల్లో విదర్భపై ఘన విజయం

వడోదర (గుజరాత్) : విజయ్ హజారే ట్రోఫీ ఐదోసారి కర్నాటక సొంతమైంది. శనివారం వడోదరలో జరిగిన టైటిల్ పోరులో విదర్భపై కర్ణాటక 36 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. 349 పరుగుల భారీ ఛేదనలో విదర్భ ఆఖరు వరకు పోరాడినా ఫలితం దక్కలేదు. ఓపెనర్ ధ్రువ్ శోరె (110, 111 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), హర్ష్ దూబె (63, 30 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) రాణించినా విదర్భ 48.2 ఓవర్లలో 312 పరుగులకు కుప్పకూలింది. కర్ణాటక బౌలర్లు వాసుకి కౌశిక్, ప్రసిద్ కృష్ణ, అభిలాశ్ శెట్టి మూడేసి వికెట్లు పడగొట్టారు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు రవిచంద్రన్ స్మరణ్ (101, 92 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), అభినవ్ మనోహర్ (79, 42 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లు), కృష్ణన్ శ్రీజిత్ (78, 74 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్‌తో తొలుత బ్యాటింగ్ చేసిన కర్ణాటక 50 ఓవర్లలో 6 వికెట్లకు 348 పరుగుల భారీ స్కోరు సాధించింది.

క్వార్టర్స్‌లో నంద్యాల నరసింహారెడ్డి

హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్



హైదరాబాద్ : 20వ హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో నంద్యాల నరసింహారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి సత్తా చాటుతున్నారు. పురుషుల 50 ప్లస్ సింగిల్స్‌లో ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ప్రీ క్వార్టర్స్‌లో మహ్మద్ అసిఫ్‌పై అలవోక విజయం సాధించగా.. నరసింహారెడ్డి 8-7(0)తో సాయి గణేశ్‌పై ఉత్కంఠ మ్యాచ్‌లో పైచేయి సాధించాడు. సాంబశివా రెడ్డి 8-3తో శివ ప్రసాద్ రెడ్డి గెలుపొంది క్వార్టర్‌ఫైనల్లో కాలుమోపాడు. లగడపాటి శ్రీధర్ 8-1తో రాజా రామ్ మోహన్‌పై అలవోక విజయం నమోదు చేశాడు. పురుషుల 60 ప్లస్ సింగిల్స్‌లో రామ్ రెడ్డి 8-0తో జవహర్‌పై విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకున్నాడు. సికింద్రబాబ్ క్లబ్ వేదికగా దేశవ్యాప్తంగా 220 మంది వెటరన్ క్రీడాకారులు పోటీపడుతున్న ఈ టోర్నమెంట్‌లో ఆదివారం అన్ని విభాగాల్లో ఫైనల్స్ జరుగనున్నాయి.

గ్రామీణ క్రికెట్‌కు బోర్డు బాసట!

హెచ్‌సీఏకు బీసీసీఐ కార్యదర్శి హామీ



హైదరాబాద్ : తెలంగాణ జిల్లాలు, గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ అభివృద్ధికి సహకారం అందిస్తామని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియ హామీ ఇచ్చారు. ముంబయిలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో శనివారం సైకియ సహా సీఈవో హేమంగ్ ఆమీన్‌లతో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు, కోశాధికారి శ్రీనివాస్ భేటీ అయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో నూతనంగా నిర్మించే స్టేడియాలు, మౌళిక సదుపాయాల కల్పనకు బోర్డు నుంచి 50 శాతం నిధులను అందిస్తామని భరోసా అందించారు. రానున్న సీజన్‌లో భారత జట్టు మేనేజర్‌గా హెచ్‌సీఏ నుంచి అవకాశం ఇవ్వాలని కోరగా సైకియా సానుకూలంగా స్పందించినట్టు జగన్ తెలిపారు.

దాశరథి శతజయంతిని ఘనంగా నిర్వహించాలి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సాయుధ పోరాటానికి జవసత్వాలు నింపిన ప్రజాకవి, పీడనపై అగ్నిధారను కురిపించిన కలం యోధుడు దాశరథి కృష్ణమాచార్యులు శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర సాంస్కృతిక, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు శనివారం ఆమె లేఖ రాశారు. హైదరాబాద్ లోని ఒక ప్రముఖ కూడలిలో దాశరథి విగ్రహాన్ని ఏర్పాటు చేసి గౌరవించుకోవాలని కోరారు. ఆయన జన్మించిన మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరు గ్రామంలో స్మృతి వనం ఏర్పాటు చేయడంతో పాటు గ్రామస్థులు ఏర్పాటు చేసుకున్న దాశరథి గ్రంథాలయానికి ప్రభుత్వం నూతన భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. దాశరథి సమగ్ర సాహిత్యాన్ని ప్రభుత్వమే ముద్రించి లైబ్రెరీలలో ఉంచడంతో పాటు అందరికీ అందుబాటులోకి తేవాలని సూచించారు. దాశరథి శతజయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా ఏడాది పొడవునా నిర్వహిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించి ఉన్నదనీ, అయితే ఆ దిశగా కార్యక్రమాలు జరిగిన దాఖలాలు లేవని తెలిపారు. ఆ ఉత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా జరపాలనీ, ఉత్సవాల ముగింపు వేడుకలను ప్రభుత్వం పాఠశాల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పెద్ద ఎత్తున జరపాలని పేర్కొన్నారు.

సిద్ధరామయ్యపై ఈడీ దాడి.. ఆస్తులు స్వాధీనం

న్యూఢిల్లీ : కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడికి దిగింది. సిద్ధరామయ్య, ఇతరులకు చెందిన దాదాపు రూ.300 కోట్ల విలువైన 140 యూనిట్లకు పైగా స్థిరాస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఈడి తెలిపింది. మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూ కేటాయింపుల్లో జరిగిన అవతవకలపై మనీలాండరింగ్ విచారణలో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి ఈడీ దాడికి దిగడం గమనార్హం. స్వాధీనం చేసుకున్న ఆస్తులను రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఏజెంట్లుగా పనిచేస్తున్న వివధ వ్యక్తుల పేరిట రిజిస్టర్ అయినట్టు ఈడీ ఓ ప్రకటనలో తెలిపింది.